గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మే 2016
# కథలు




ఆ రోజు ఏప్రియల్ 22వ తారీఖు.ప్రపంచ ధరిత్రి దినోత్సవం.ఆ సందర్భంగా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల,ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవ సభ ఏర్పాటు చేయబడింది.ఆ సభలోఆ రోజు ప్రాముఖ్యత గురించి విద్యార్థులను ప్రసంగించమని సభాధ్యక్షులైన ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను కోరారు. అంతేకాకుండా చక్కగా ప్రసంగించిన వారికి మంచి బహుమతులు ఉంటాయని తెలిపారు.ఆ సందర్భంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఎప్పుడు ప్రారంభమైంది,ఆ దినోత్సవం చేసుకోవటంలో గల ముఖ్య ఉద్దేశ్యమేమిటి,

పుడమికి జరుగుతున్న హాని గురించి,అదే విధంగా రోజురోజుకి పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు గురించి,ఇట్లా ఉష్ణోగ్రతలు పెరిగిపోవటానికి గల కారణాలు,పర్యావరణకు జరుగుతున్న హాని గురించి,పర్యావరణాన్ని పరిరక్షించుకోవడమెలా,అలాగే ప్లాస్టిక్ విపరీతంగా వాడటం వల్ల కలుగుతున్న పరిణామాలు,జల,నేల,వాయు కాలుష్యాల వల్ల పర్యావరణ సమతుల్యత ఎంతగా దెబ్బతింటుంది, గాలిలోకి విడుదల అవుతున్న క్లోరోఫ్లోరోకార్బన్స్,వాటి వల్ల ఓజోన్ పొర దెబ్బతినటం,పర్యవసానంగా సూర్యుని నుంచి అతినీలలోహిత కిరణాలు సరాసరి భూమిపై ప్రసరించడం ద్వారా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడమే కాక అనేకరకాల చర్మవ్యాధులు,ఎలర్జీలకు కారణమవడం,అలాగే తరిగిపోయే శక్తివనరులు అయిన పెట్రోల్,సహజవాయువు భూమిలోపలనుంచి విపరీతంగా వెలికితీయటం ద్వారా అవి కొంతకాలానికి పూర్తిగా అడుగంటడమేకాక భూకంపాలకు ఆస్కారం ఏర్పడటం,వృధాగా త్రాగునీరు వాడకం,చెట్లను విచక్షణా రహితంగా కొట్టివేయడం గురించి చక్కగా కొంతమంది ప్రసంగిస్తే,కొంతమంది వీటి నివారణ చర్యల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన చర్యలు,నీటి సంరక్షణకై ఇంకుడుగుంతల తవ్వకం,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతులు గురించి,ఎప్పటికి తరగని శక్తి అయిన సౌరశక్తి వినియోగం గురించి,ఇంధన కాలుష్యనివారణకు

తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చక్కగా ప్రసంగించి ఉపాధ్యాయుల ,ప్రధానోపాధ్యాయుల మన్ననలు పొందడమేకాక వీరికే బహుమతులు ఖాయం అని అందరూ అనుకొన్నారు.

చివరగా రవి అనే విద్యార్థి లేచి ఈ విధంగా ప్రసంగించడం ప్రారంభించాడు.

వేదిక నలంకరించిన ప్రధానోపాధ్యాయులకు,ఉపాధ్యాయులకు నమస్కారములు మరియు ధరిత్రి దినోత్సవ శుభాకాంక్షలు.తోటి విద్యార్థినివిద్యార్థులకు ధరిత్రి దినోత్సవ శుభాకాంక్షలు.నా తోటి విద్యార్థులు చాలా మంది ఈ రోజు కి గల ప్రాముఖ్యత , ధరిత్రికి జరుగుతున్న హాని గురించి,పర్యావరణ సమతుల్యత దెబ్బతినటం గురించి,వివిధ రకాలైన కాలుష్యాల గురించి,విచక్షణా రహితంగా చెట్ల నరికివేత గురించి,అదే విధంగా వీటన్నింటి విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చాలా చక్కగా వివరించారు. నేను వీటి గురించి ఏమి మాట్లాడుకోదలుచుకోలేదు అనే సరికి ఒక్కసారిగా ఉపాధ్యాయులలోను,విద్యార్థులలోను ఒకటే కలకలం.అపుడు తిరిగి మాట్లాడటం ప్రారంభించాడు.

మనం ఇట్లా ఎన్నో దినోత్సవాలు జరుపుకొంటున్నాము.ప్రతి దినోత్సవానికి ఎంతో ఆర్భాటంగా ఆ రోజు ప్రాముఖ్యత గురించి,చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి ప్రసంగిస్తున్నాము.ఆచరణలో మాత్రం శూన్యం.అందుకే ఇటువంటి దినోత్సవాలు ఎన్ని జరుపుకొన్నా మార్పు శూన్యం.ఉదాహరణకు ఈ రోజే తీసుకొండి.ఉపాధ్యయులకు ఇచ్చిన తేనీరు ప్లాస్టిక్ గ్లాసులలో ఇచ్చాము.కాగితపు గ్లాసులలో ఇవ్వొచ్చుకదా!మనపాఠశాల ఆవరణలో గల చేతిపంపు దగ్గర నీళ్ళు తాగేటపుడు ఎన్ని నీళ్ళు వృధా చేస్తున్నాం,

ఆ వృధాగా పోయే నీటికి మార్గం చేసి ఇంకుడు గుంత చేసే ప్రయత్నమేమన్నా చేసామా!మన తరగతి గదులలో డస్ట్ బిన్ గా ప్లాస్టిక డబ్బాలనే ఉపయోగిస్తున్నాం,వాటి బదులు ఖాళీ అట్టపెట్టెలు ఉపయోగించవచ్చు కాని అలా చేయటంలేదు.అలాగే బజారుకెళ్ళే ప్రతిసారి వాళ్ళిచ్చే ప్లాస్టిక్ కవర్లలలో సరుకులు వేసుకొని తీసుకొచ్చేస్తున్నాము,అలా కాకుండా ఒక జనపనార సంచి కొనుక్కొని ఆ సంచి పట్టుకెళ్ళి ప్రతిసారి ఆ సంచిలో తెచ్చుకోవచ్చుకదా,కాని అలా చేస్తున్నామా!ఆయా దినోత్సవాలలో మొక్కలు నాటుతున్నాం,ఆ తర్వాత వాటి గురించి పట్టించుకొంటున్నామా,అందుకే ప్రతి మొక్క నాటేటపుడు ఆ మొక్కను ఒక్కో విద్యార్థి దత్తత తీసుకోవాలి.

పాఠశాల నుంచి బయటకు వెళ్ళేంతవరకు ఆ మొక్క సంరక్షణ బాధ్యత ఆ విద్యార్థే తీసుకోవాలి,ఆ విధంగా ఏమన్నా చేస్తున్నామా! ఇటువంటి చిన్నచిన్న పనులు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మన వంతు సహాయం చేద్దాం , చేసి చూపిద్దాం, మీరు కూడా మీ వంతు సహాయసహకారాలు అందిస్తారని ఆశిస్తూ చేతలలో చూపిద్దాం అని మరొకసారి మీ అందరికి విన్నవించుకొంటూ ఏమీ ప్రసంగించకుండానే ముగిస్తున్నా అనేసరికి సభా ప్రాంగణం కరతాళధ్వనులతో మార్మోగింది. ఆ తర్వాత

రవి చెప్పినవి విద్యార్థులందరూ తూ.చ తప్పకుండా పాటించి పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు. ఆ విధంగా రవి ప్రసంగానికి సార్ధకత చేకూరింది.




రాంబాబు పెళ్లి అంగరంగ వైభవంగా హైద్రాబాదులో జరిగింది. ఆడపెళ్లివారు సిటీలో వున్న ఓ శుభకార్యం కోసం చుట్టాల్లింటికి రావడం, అదే ఫంక్షన్ కు రాంబాబు తల్లిదండ్రులు కూడా రావడం, మాటల్లో ఒకళ్లకొకళ్లు తమ పిల్లలకు సంబంధాలు వెతుకుతున్నామని చెప్పుకోవడంతో ఆదరబాదరగా అక్కడే పెళ్లిచూపుల ఏర్పాటు జరిగిపోయింది. రాంబాబు స్ఫురద్రూపి. చూడచక్కగా ఉంటాడు. మంచి చదువు హైటెక్ సిటీలో చక్కటి ఉద్యోగం. అమ్మాయి రజని కాస్త నలుపే కానీ కళగల ముఖం. ఇంటరు వరకూ చదివింది. ఇంటిపనులన్నీ చేయగలదు. వంటలు ఆమోఘంగా చేసి మెప్పించగలదు. కుట్లూ అల్లికల్లాంటివి కరతలామలకం. అమ్మాయి గుణగణాలన్నీ అందర్నీ, ముఖ్యంగా కాబోయే అత్తగార్ని మెప్పించాయి. ఇహనేం దగ్గర్లో ఉన్న మంచి ముహూర్తాల్లో నిశ్చయ తాంబూలాలు ఇచ్చిపుచ్చుకోవడం అపై పెళ్లి జరిగిపోయి కల్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదన్న లోకోక్తిని నిజం చేశాయి.

"బావగారూ, సరైన వ్యవధి లేకపోయినా కాలం కలసి రావడంతో, నలుగురు చట్టాలూ చేయివేయడంతో ఇక్కడే పెళ్లి జరిపించేశాం. శోభనం మాత్రం మా ఊళ్లో అంకాలమ్మ దేవతని కొత్తదంపతులు దర్శించుకుని పూజ చేశాక మా ఇంట్లో ఏర్పాటు చేస్తాం. అభ్యంతరం ఏమీ లేదు కదా?"అన్నాడు అచ్యుతరావు.

"దాందేవుందండీ, మేము మీ ఉరిని, మీ సంప్రదాయాలనూ చూడాలి కదా. అక్కడి వాళ్లూ వీళ్లిద్దరినీ చూసి ఆశీర్వదించాలి! పైగా అబ్బాయి మీ ఇంటికి వస్తూ పోతూ ఉండాలి కూడానూ!"అన్నాడు వివేకవర్ధనరావు.

*****

వెన్నంటిగూడెం స్టేషన్లో రైలు ఆగింది.

పెళ్లివారందరూ దిగారు. దిగంగానే వేడి సెగ బలంగా ముఖానికి తాకి పలకరించింది. దాంతో రాంబాబుతో సహా మగపెళ్లివారికి శోషవచ్చినంత పనైంది.

వీళ్లను తీసుకెల్లడానికి ఎడ్లబండ్లు వచ్చాయి. కొత్త పెళ్లికొడుక్కి, పెళ్లికూతురికీ మాత్రం కారొచ్చింది. అందరూ ఎక్కి బయల్దేరాక_ రాంబాబు కారు డ్రైవరుతో"కాస్త ఏ సి వెయ్యవా? బాగా ఉక్కపోస్తోంది"అన్నాడు.

"ఆయ్..దీంట్లో ఆ పెసిలిటీ లెదండి.."అన్నాడు.

రాంబాబు గుండాగిపోయింది. సిటీలో, రాంబాబు ఇంట్లో, వెళ్లే క్యాబ్ లో, ఆఫీసులోనూ ఏ సి నే. పాతకాలం నాటి బొగ్గుల ఇంజన్లో కూర్చున్నట్టుంది అతని పరిస్థితి.

"బాబూ ఒక్క సారి కారు ఆపు"అని కారు ఆపంగానే గబుక్కున దిగి గట్టిగా వేడిగాలి పీల్చుకుని "ఇహనేను కారులో రాను. ఎడ్లబండీలో వస్తా"అని రెల్లుగడ్డితో టాపు వేసి ఉన్న బండెక్కి కూర్చున్నాడు.

ఎండ మాత్రం వేడి గాలులతో చండ ప్రచండంగా కాస్తోంది. గూబగుయ్యిమనిపిస్తోంది. కాస్త సేద దీరుదామంటే, చుట్టు పక్కల ఓ పచ్చని చెట్టు లేదు, తాగడానికి గుక్కెడు చల్లని నీళ్లు లేవు.

ఎలాగో ఇంటికి చేరారు.

అది పెంకుటిల్లు. గబ గబా లోపలికెళ్లి, కుండలో నీళ్లు తాగాక కాస్త ప్రాణం తెరిపిన పడింది అందరికీ.

"మావయ్యగారూ, ఈ ఊరేంటండీ ఇలా ఉంది? ఒక్క చెట్టు లేదు, చల్లటి గాలి లేదు..చాలా హారిబుల్ గా ఉంది. నాకైతే నరకంలో ఉన్నట్టుగా ఉంది" అన్నాడు తడిచిపోయిన కర్చీఫ్ తోటే ముఖం తుడుచుకుంటూ.

"ఇక్కడింతే బాబూ, మాకిలాగే అలవాటైపోయింది. మీలాంటి నాజూకు జీవితాలు ఇక్కడుండటం కష్టమే!"అన్నాడు ఒకింత బాధగా.

*****

మరుసటిరోజు ఉదయం ఆరున్నరకే ఎండ భగ భగ లాడుతూ, నిప్పులు కురిపిస్తోంది.

నీళ్లు ఎక్కడో ఉన్న దిగుడుబావి నుంచి తీసుకురావడం వలన చాలా పొదుపుగా స్నాన కార్యక్రమం పూర్తిచేసి అంకాలమ్మ గుడికి బయల్దేరారు.

దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందా గుడి. కొండరాళ్లతో కట్టి వున్న దాంట్లో అమ్మవారి రాతిప్రతిమనుంచారు. అక్కడకూడా ఒక్క చెట్టూ లేదు నీడకు నిలబడదామంటే. లక్కీగా ఒక విశాలమైన రగ్గుకి నాలుగు వైపులా నాలుగు కర్రలు కట్టి ఎత్తుగా ఎత్తి పట్టుకున్నారు. దాని కిందకు బిల బిలమంటూ చేరిపోయారు అందరు. పూజయ్యేసరికి ఓ అరగంటయ్యింది.

అందరి శరీరాలనుంచి చమటలు ధారలు కట్టడంతో, నాలుకలు దాహంతో పిడచలు కట్టుకుపోతున్నాయి. ఇంటికి ఎలా చేరారో కూడా తెలియదు.

ఆ రాత్రే వాళ్లకి శోభనం.

విశాలమైన పందిరి మంచం. దానిపైన తెల్లటి దుప్పటి పరచి ఉంది. పూలు చల్లి ఉన్నా అవి వాడి, ఎండి పోయి ఉన్నాయి. మనిషి కూర్చుంటే కర కర మంటున్నాయి. పళ్లు కూడా అంతే! పైనున్న ఫ్యాన్ కిర్రు కిర్రు మని ఆపసోపాలు పడుతూ చిన్నగా తిరిగే ప్రయత్నం చేస్తోంది.

కిటికీలోంచి వేడిగాలి వీస్తోంది. పచ్చమొక్కలూ, పూలమొక్కలూ లేనేలేవు. ఆకాశాన ఉన్న చంద్రుడు కూడా వెలతెల బోతున్నాడు ఎందుకో.

అమ్మాయిని పాలగ్లాసుతో లోపలికి పంపారు.

ఇద్దరికీ ముఖాన చెమట్లే! పెదాలపై శుష్కహాసాలే!

ఎవరికి వారు తమని తాము భరించడమే కష్టం..అలాంటిది మరొకర్ని దగ్గరకి తీసుకోవడం అసంభవం.

ఎలాగో ఇద్దరూ ఆ గదిలో ఒక అరగంట గడిపి ఇహ ఉండలేక బయట కొచ్చేశారు.

వాళ్లను చూసి అబ్బాయి, అమ్మాయి తల్లిదండ్రులు నిట్టూర్చారు.

రెండో రోజు కూడా అలాగే జరగడంతో-"బాబూ, ఇలా అయితే ఎలా? మూడు రాత్రుల ముచ్చట ఎలా తీరుతుంది?"అన్నడు అచ్యుతరావు చేతులు నలుపుకుంటూ.

"నిప్పుల కొలిమిలా ఉన్న ఆ గదిలో కార్యం ఎలా జరుగుతుందండీ అసలు? మనసు పులకరించడానికి పచ్చదనం లేదు. ఆహ్లాదమైన వాతావరణమూ లేదు. ఇహ మూడెలా వస్తుంది? అసలు మీరందరూ ఏళ్ళకేళ్లుగా ఇక్కడ కాపురాలు ఎలా చేస్తున్నారండీ? ఇలా అయితే ఈ ఊళ్లో మానవ మనుగడ అంతరించి పోవడం ఖాయం."అన్నాడు ఆవేశంగా.

"అవును బాబూ! ప్రకృతిపట్ల మా స్వార్థంతో కూడిన నిర్లక్ష్యమే దీనికి కారణం. అవసరార్థం చెట్లను కొట్టుకుంటూ పోయాం తప్ప ఒక్క మొక్కా నాటలేదు. ఎల్లలుగా ఉన్న కొండల్ని రాళ్లు రప్పలుగా చేసి పట్నాలకు పంపించేశాం. ఊరికి ఆనుకుని ఉన్న అడవిని చేతులారా నాశనం చేసుకున్నాం. పొలాల్ని బిల్డర్లకు అమ్మి స్థలాలుగా మార్చేశాం. భూజలాన్ని అందినంత జుర్రేశాం. చెరువుల్ని పూడ్చి ఇళ్లు కట్టేసుకున్నాం, వర్షపు నీటిని కూడా జాగ్రత్త చేసుకోలేకపోయాం. కిల కిలలాడే పక్షులు లేవు, ఆదుకునే జంతువులు, క్రిమి కీటకాదులు లేవు, ఇప్పుడనుభవిస్తున్నాం. శ్మశానంలోని ప్రేతాల్లాగా అనుభూతుల్లేని జీవితం గడుపుతున్నాం."అన్నాడు పశ్చాత్తాపంతో కళ్లనీళ్లు నింపుకుని. అక్కడున్న నలుగురైదుగురు ఊరి పెద్దలు కూడా తల వంచుకున్నారు.

"అందుకే బాబూ, అంకాలమ్మ పూజ అయిపోయింది కాబట్టి నువ్వు అమ్మాయిని నీతో తీసుకుపో. అక్కడ హాయిగా మూడోరోజు గడపండి. పట్నంలో హాయిగా ఉండండి"అన్నాడు.

"అలా ఎవరికి వాళ్లం స్వార్థంగా ఆలోచించబట్టే..ఈ ఊరు వల్లకాడయింది. 'ఇది మా ఊరు' అని ఆప్యాయంగా చెప్పుకునే ప్రాధాన్యత కోల్పోయింది. రేపటి నుంచి నేనూ ఈ ఊళ్లో ఉంటాను. మీరందరూ నాకు సహకరిస్తే ఈ ఊర్ని నందనవనం చెద్దాం. ఈ ఊరు శోభాయమానం అయినప్పుడే మా శోభనం!"అన్నాడు స్థిరంగా.

అందరూ సహకరిస్తామని ఆనందంగా మాటిచ్చారు.

*****

రెండేళ్లు గడిచిపోయాయి.

ఇప్పుడు ఆ ఊరు పూర్తిగా మారిపోయింది.

ఎక్కడ చూసినా పళ్లతో ఒంగిన చెట్లు, పచ్చని తివాచీ పరచినట్టు పొలాలు. కిల కిలరవాల పక్షులు, పూడిక తీసిన బావుల్లో, చెరువుల్లో నీళ్లు. పచ్చతోరణాలు కట్టిన గుళ్లు గోపురాలు. ఆహ్లాదానికి మారు పేరుగా నిలిచింది.

మనుషుల్లో కూడా జీవకళ వచ్చింది.

ఒకప్పుడు ఎవరు రావడానికి ఇష్టపడని ఆ ఊరు ఇప్పుడు ఆహ్లాదకరమైన విడిదై..అందర్నీ ఆకర్షిస్తోంది. రైల్వే స్టేషన్ జనాలతో కిట కిట లాడుతోంది.

ఆ రాత్రి రాంబాబు రజని దంపతుల జీవితంలో మిగిలిపోయిన మూడోరాత్రి సంబరం.

ఆ గది కమ్మటి సువాసన పూలతో, తాజా పళ్లతో అలంకరించబడి వుంది. కిటికీపక్కనున్న నైట్ క్వీన్ పరిమళం గదంతా మత్తుగా ఆవరించింది. ఉండుండి వీస్తున్న చల్లటిగాలి తనువుల్ని మైమరపిస్తోంది.

'రజనీ, చూశావా ఈ రాత్రి ఎంత ఆహ్లాదంగా ఉందో. కొత్త దంపతుల సమాగమానికి ఇలాంటి వాతావరణమే కదా కావలసింది."అన్నాడు కన్నుగీటి సన్నగా నవ్వుతూ.

"అవునండీ, మనకే కాదు ప్రతి జంట తనువును మనసునూ ఇలాంటి వాతావరణమే పులకరింపజేస్తుంది. మీరు అసిధారావ్రతంలా ఈ ఊరిని పచ్చబరచే కార్యక్రమం చేపట్టి సక్సెస్ పొందారు. మీలో చక్కటి నాయకత్వ లక్షణాలున్నాయి. అందుకే ఎవరికి వారు అన్నట్టున్న వారిని ఒక తాటిపైకి తెచ్చి ఊరికి వన్నెతెచ్చారు. మా ఊరివాళ్ల తరఫున మీకు కృతజ్ఞతలు!"అంది రాంబాబు కాళ్లకి దణ్ణం పెట్టుకుంటూ.

"పిచ్చి, సమస్యను చుసి భయపడి పారిపోవడమూ, రాజీ పడడమూ సమాధానంకాదు. పరిష్కరించాలి. ఆ అంకమ్మ దయవల్ల అన్నీ చక్కబడ్డాయి. మీ నాన్నగారి కోరిక ప్రకారం మనిద్దరికీ మీ ఊళ్లోనే మిగిలిన మూడోరోజు శోభనం జరగబోతోంది. ఇహ ఇన్నేళ్ల విరహం నన్ను ఆగనియ్యడం లేదు. పరవళ్లతో ప్రవహిస్తూ కట్టలు తెంచుకోవాలని చూస్తోంది." అని ఆమెని దగ్గరకి తీసుకుని ఆలింగన చుంబన కర్యక్రమాలతో విజృంభించాడు. ఆకాశంలోని చంద్రుడు మనస్ఫూర్తిగా ఆ జంటపై కిటికీగుండా చల్లని వెన్నెల

గుమ్మరిస్తూ సహకరించాడు.

***




ఈ వేసవి కాలంలో మీరు వస్తున్నారా?” అని ప్రత్యేకంగా రాజారావును అడగాల్సిన పని లేదు. అతనికి వేసవి కాలంలో కాలేజీకి రెండునెలలు సెలవులుంటాయి. ముందుగానే పకడ్బందిగా ప్రణాళిక వేసుకోవడంతో ఒకరోజు అటో ఇటో విజయవాడ కుటుంబంతో సహా వాలిపోతాడు. ఇది ఇరవై ఏళ్ల నుండి జరుగుతున్న తంతు. ఇంత కాలం ఒక రెండు కుటుంబాలు ఒకే చోట కలుసుకో గలుగుతున్నారంటే వాళ్ళ మధ్య ఎంత అవగాహన ఉండాలి ? వాళ్ళు ఎన్ని సమస్యలను అధికమించి ఉండాలి ?

రాజారావుకి డబ్బుకు కొదవలేదు. లక్షన్నర వరకు జీతం వస్తుంది. చాలా మంది లాగానే అతను

కూడా ఏ సమ్మర్ టూరుకో వెళ్ళొచ్చు. లేదా ఇంట్లో జల్సాగా గడిపెయొచ్చు. కాని అతనలా చెయ్యడు. ఎప్పటిలానే తన అన్నగారి కుటుంబం తోనే గడపాలి. అక్కడ వాళ్ళతోనే కలిసి ఆ చుట్టుపక్కల పుణ్య క్సేత్రాలో ,ఇంకా ఏవైనా చూడవలసిన ప్రదేశాలకో వెళ్లి వాళ్ళ సాహచర్యంలో సరదాగా మమైకమై పోవాలి. మొదట్నుంచి అదే పద్ధతి. దీనికి ఎవరూ అడ్డు తగలరు. ఇక డబ్బు ఖర్చు పెట్టటం విషయంలో ఏనాడు తన , పర అనే భేదాలు రాజారావు సృష్టించుకోలేదు. ఈ రోజుల్లో ఇటువంటి వారు ఉండటం ఆశ్చర్యమే మరి. . సెలవు రోజుల్లో అయ్యే ఖర్చులో రాజారావు భాగమే ఎక్కువగా ఉంటుంది. అందుకు అన్నగారు సుబ్రహ్మణ్యం ఏమీ మాట్లాడటానికి వీల్లేదు.

ఒకవేళ ఆదవా సుబ్రహ్మణ్యం మొహమాటంతో తమ్ముడిని వారించబోతే “ నువ్వు మాత్రం ఎక్కడినుండి తెచ్చి పోస్తావురా ? మేమేనా డబ్బు వృధాగా సముద్రంలో పోయిట్లేదు కదా ? మన సరదాల కోసమేగా ఖర్చు పెట్టుకుంటున్నది ? మాటికి మాటికి డబ్బు విషయం నా దగ్గర ఎత్తకు . అక్కడ ఇంట్లో ఖర్చు పెట్టుకునేది ఇక్కడ ఖర్చు పెట్టుకుంటున్నట్టు అనుకో. కాని అంతకన్నా మన వాళ్ళతో కలిసి ఈ రెండు నెలలు హాయిగా గడప గలుగుతున్నామన్న సంతృప్తి అక్కడే ఒంటరిగా పడుంటే వస్తుందా ? “ అంటూ అన్నగారు మొహం ఇబ్బందిగా పెడుతున్నప్పుడల్లా దానికి అడ్డుకట్ట వేసేవాడు రాజారావు.

తోడి కోడల్లిద్దరూ వంటిట్లో తమ పుట్టింటి కబుర్లూ, పెళ్ళిళ్ళల్లో కలుసుకున్నప్పుడు తాము సరదాగా గడిపిన రోజుల గురించి మాట్లాడుకుంటూ చకచకా వంట పని కానిచ్చేసే వారు. వాళ్ళు కలిసున్న ఆ రెండు నెలలలో ఒకరి చీర ఒకరు కట్టుకోవడం , అప్పుడప్పుడు దగ్గరలో ఉన్న సినిమా థియేటర్కు వెళ్లి సినిమాలు చూసి రావడం వాళ్ళ మధ్య అన్యోన్యతను ఇంకా పెంచేది. ప్రతి సంవత్సరం రాజారావు కుటుంబం వచ్చే సరికి మామిడిపళ్ళ సీజన్ వచ్చేసేది. కొన్నప్పుడల్లా బుట్టలకు బుట్టలు కొనడమే తప్ప డబ్బుకు మొహం చూసుకునే వాళ్ళు కారు. ఇది కాకుండా ఆ చుట్టుపక్కల గ్రామాలనుండి తాటి ముంజెలు అమ్మేవాళ్ళు ఇంటిముందు ఎగబడి పోతూ ఉండే వాళ్ళు. ఎఋని ఎండలో ఊరంతా తిరిగి అమ్మాలంటే వాళ్లకు చాలా కష్టంగా ఉండేది. అలాంటిది ఒక్క దెబ్బతో మొత్తం బుట్టంతా సుబ్రహ్మణ్యం ఇంటిదగ్గర ఖాళీ అయిపోయేది. ఎక్కడనుండి వచ్చే వాడో కాని షోడాలు అమ్మేవాడు క్రమం తప్పకుండా రోజుకు పది షోడాలుకు తక్కువ కొట్టేవాడు కాడు. అదేమిటో కాని ఆ ఘాటే వేరుగా ఉండేది. వీటన్నిటికీ రాజారావే డబ్బు ఇచ్చే వాడు. అన్నగారు బలవంతంగా ఇవ్వబోతే “ప్లీజ్ నా ఆనందానికి అడ్డు రావద్దు “ అంటూ సున్నితంగా వారించే వాడు.

ఈ సంవత్సరం కూడా అనుకున్న షెడ్యూల్ ప్రకారం రాజారావు కుటుంబం మండు వేసవి కాలం సమీపిస్తూ ఉండగా అన్నగారింటికి వచ్చింది. . అతనికెందుకో ఆ ఇంటికొస్తే తన సొంత ఇంటికి

వచ్చినట్టే ఉంటుంది. కొత్తగా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నట్టుగా అనిపించేది. బంధుత్వాలు పూర్తిగా అడుగంటి పోతున్న ఈ రోజుల్లో ఇంకా ఈ రెండు కుటుంబాలు సంవత్సరానికి ఒక్కసారైనా సరదాగా గడప గలుగుతున్నారంటే చూసే వాళ్లకు ఆశ్చర్యంగా అనిపిస్తూ ఉంటుంది. అంతవరకు ఎందుకు అతని బంధువర్గంలోనే "అక్కడ ఏముందని ప్రతి సంవత్సరం వెళ్లి పోతున్నావ్ ?" అంటూ విమర్శించే వాళ్ళు కూడా ఎక్కువే.

రాజారావుకు హైదరాబాద్లో చుట్టాలు బాగానే ఉన్నా మహా అయితే ఒక గంటకన్నా ఎక్కువ కూర్చునే పరిస్తితి ఎక్కడా ఉండేది కాదు. ఎవరిని చూసినా నీళ్ళు రావడం లేదని, బోర్లు ఎండిపోయాయని, వచ్చిన వాళ్లకు గ్లాసుడు మంచినీళ్ళు కూడా ఇవ్వలేక పోతున్నామని ఒకటే సోత్కర్ష. నిజానికి ఎవరికి వాళ్ళు ఎంతమటుకు వాళ్ళ వాళ్ళ కుటుంబంతోనే గడపాలి అనే తాపత్రయం ఎక్కువగా కనిపించేది. . వేరే ఎవరినీ భరించే పరిస్తితి రోజు రోజుకి తగ్గిపోతోంది. వచ్చిన వాళ్లకు సేవలు చెయ్యాలి అంటెనే ఒక రకంగా ఇబ్బందిగా భావించే వాళ్ళే ఎక్కువ.

మొదట్నుంచి రాజారావుకు అన్నగారైన సుబ్రహ్మణ్యం అంటే బాగా చనువు. దానికి తోడు సుబ్రహ్మణ్యం భార్య కూడా అంతరితో కలిసిపోయే తత్వం. స్వార్థం ఏ కోశానా కనపడదు. అందరూ తనవారే అనుకునే మనస్తత్వం. చుట్టాలెవరేనా వస్తే అర్ధరాత్రైనా వండిపోస్తుందా మహా ఇల్లాలు.

మేడ మీద పడుకుని అన్నగారితో కబుర్లు చెపుతున్న రాజారావు అన్నగారు నిద్రపోతూన్డటం గమనించి కాసేపు మేడమీద అటూ ఇటూ తిరుగుతూంటే గతం గుర్తుకొచ్చింది.

ఇరవై ఏళ్ల క్రితం సంగతి. సుబ్రహ్మణ్యం ఇంట్లో గ్యాస్ పొయ్యికాని, కుక్కర్లు కాని లేవు. తన వదినగారు బొగ్గుల కుంపట్ల మీద, కట్టెల పొయ్యి మీద ఇంటిల్లి పాదికి రెండేసి కూరలు, పులుసు, పచ్చళ్ళతో చక్రం తిప్పేది. వేసవి కాలం వచ్చిందంటే ఇంటినిండా బంధువుల తాకిడే . ఆవిడను చూస్తూంటే మానవతావాది డొక్కా సీతమ్మ గుర్తుకొచ్చేది రాజారావుకు.

సాయంత్రం ఆరు గంటలయ్యేసరికి ఎటువంటి పరిస్తితిలోనూ భోజనాలూ పూర్తయి పోయేవి. ఆ వెంటనే ఆరుబయట నీళ్ళు చల్లుకుని రెండు మూడు మడత మంచాలు వేసుకుని హాయిగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేసే వాళ్ళు. ఏ సదుపాయాలూ లేని ఆ రోజులకు , అన్ని వసతులు ఉన్న ఇప్పటి పరిస్తితికి ఎందుకింత తేడా ? అప్పట్లో ఇప్పటిలా ఇరుకు మనస్తత్వాలు ఉండేవి కావు. ఎక్కడ చూసినా

కరడు కట్టిన స్వార్థం . నేనూ నా కుటుంబం తప్ప వేరే వాళ్ళు ఎవరూ అవసరం లేదు అన్న ధోరణి కనపడేది. . మానవ సంబంధాలు పూర్తిగా అడుగంటి పోయాయి. ఇప్పుడున్నది పూర్తిగా వ్యాపార బంధాలు మాత్రమే. పూర్వం పెదనాన్న, చిన్నాన్న కుటుంబాలంటే ఒక కుటుంబం లోని వ్యక్తులుగా పరిగణింప బడే వాళ్ళు. ఇల్లు ఎవరిదైనా " మన ఇల్లు" అని సంబోధించే వాళ్ళు. వేసవి కాలంలో అన్నదమ్ముల పిల్లలు ఒక చోట చేరి కలిసి మెలిసి ఉండేవాళ్ళు. ఇప్పుడు అన్న తమ్ముడింటికి వెళ్ళాలన్నా, తమ్ముడు అన్న ఇంటికి వెళ్ళాలన్నా ముందుగా అప్పాయింట్మెంట్ తీసుకోవాలి. కనీసం వారం రోజులు ముందుగా ప్రోగ్రాం వేసుకోవాలి. ముఖ్యంగా నగరాలలో పరిస్తితి అలా తగలపడి పోయింది. అప్పటికీ ఇప్పటికీ మారని కుటుంబం తన అన్నగారి కుటుంబం మాత్రమే.

వాతావరణ శాఖ వారు ఈ వేసవి తీవ్రత గతంతో పోల్చుకుంటే చాలా ఎక్కువగా ఉంటుందని ముఖ్యంగా ఉద్యోగానికి వెళ్ళేవాళ్ళు అత్యంత జాగ్రత్తతో మెలగాలని, పిల్లలను ఎటువంటి పరిస్తితిలో ఎండలోకి పంపించవద్దని, వృద్ధులు ఇల్లు కదిలి బయటకు రావద్దని హెచ్చరిక చెయ్యడంతో సుబ్రహ్మణ్యం కొన్ని జాగ్రతలు తీసుకోవడానికి సమాయత్తమయ్యాడు. సూర్యుడు యదాప్రకారం చరచరా పైకొచ్చేస్తున్నాడు తన ప్రతాపం చూపడానికి.

మర్నాటి ఉదయం సుబ్రహ్మణ్యం ఎవరితోనో మాట్లాడుతున్నాడు రెండు రోజులకొక వాటర్ టాంకర్ కావాలని. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో అందరూ బయట టాంకర్ల మీదే ఆధార పడే పరిస్తితి వచ్చింది.

ఇక మంచి నీళ్ళు వారం రోజులకొకసారి వస్తే గొప్ప. ప్రతి రోజూ మినరల్ వాటర్ డబ్బాలు ఎవరో తెచ్చి ఇంట్లో పడేస్తున్నారు. రెండు మూడు పెద్ద ఖాళీ తారు డబ్బాల నిండా నీళ్ళు నిలవ చేసాడు సుబ్రహ్మణ్యం.

ఏ వేసవి కాలంలోనైనా ప్రతివాళ్ళు ముఖ్యంగా ఎదుర్కొనేది నీటి ఎద్దడి. ఇందుకోసం అతను స్వయంగా ఇంట్లో కొన్ని పద్దతులు పాటించే వాడు. బాత్రూముల్లోను, వంటగదిలోనూ పంపులు లీక్ కాకుండా చూడటం , టాయిలెట్లో ఫ్లష్ నుండి నీళ్ళు ఓవర్ ఫ్లో కాకుండా ప్లంబర్ చేత పకడ్బందీగా మరమ్మత్తు పనులు చేయించడం, వాషింగ్ మెషీన్ వేసేటప్పుడు నీరు ఎక్కువగా తీసుకుని వృధాగా బయటకు పోతూ ఉంటుంది కాబట్టి

ఆ నీళ్ళను మామిడి , అరటి లాంటి పెద్ద చెట్లకు మళ్ళించడం లాంటి పనులు, స్నానం చేసేటప్పుడు బయటకు వృధాగా పోయే నీరును సన్నటి కాలువ కట్టి వేసవి కాలంలో కూరలు దొరకని నేపధ్యంలో తనే స్వయంగా దగ్గరుండి పండిస్తున్న కూరగాయల మొక్కలకు వెళ్ళేటట్టుగా మార్గం చెయ్యడం , ఇక స్కూటర్ లాంటివి కడగాలంటే సాధ్యమయినంత వరకు నీళ్ళు ఉపయోగించ కుండా పాత గుడ్డతో తుడవటం లాంటి పనులు ఒక క్రమపద్ధతిలో చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాడు.. ఇక తీవ్రమైన కరెంట్ సమస్య ఉన్నా క్రిందటి సారి రాజారావు వచ్చినప్పుడు ఇద్దరూ కలిసి బజారు వెళ్లి ఇన్వర్టర్ కొనుక్కు వచ్చారు . సంవత్సరానికి ఒకసారి వచ్చే తమ్ముడి కుటుంబానికి ఏ లోటు చెయ్యకూడదని సుబ్రహ్మణ్యం అహర్నిశలు మండు వేసవి కాలాన్ని అధిగమించడానికి ఏవేవో ఉపాయాలు ఆలోచించి వాటిని అమల్లో పెట్టేవాడు. రాజారావు భార్య చాలాసార్లు ఆశ్చర్య పోతూ ఉండేది బావగారు ఇంత గడ్డు వేసవి కాలంలో ఎంతో సంయమనం పాటించి ఏ మాత్రం అసౌకర్యం కలిగించకుండా నవ్వుతూ , తుళ్ళుతూ ఎలా ఉండగలుగుతున్నాడా అని. .ప్రతి వ్యక్తి తన కుటుంబానికి ఖర్చు పెట్టుకోవడానికిగాని సేవలు చెయ్యడానికి గాని ఆంక్షలు విధించుకోరు. . అదే ఇంటికి ఎవరైనా వస్తే లెక్కలు మొదలవుతాయి. ఏదో నష్టంలో కూరుపోతున్నట్టు భావిస్తారు. కాని ఇక్కడ సుబ్రహ్మణ్యం పద్ధతి చాలామంది ఆచరించే విధానానికి , తీరుకు విరుద్ధంగా ఉంటుంది.” బ్రతికినంత కాలం ఎవరూ బ్రతకరు. కాని బ్రతికున్నంత వరకు “ నా” అన్నవాళ్ళతో, దగ్గర వాళ్ళతో, మిత్రులతో మంచిగా ఉండాలని” అతని తాపత్రయం. నిజానికి అతని ఆర్ధిక పరిస్తితి అంత గొప్పదేమీ కాదు. కాని దాన్ని అధిగమించడానికి అతని మంచి మనసు ఎంతగానో తోడ్పడుతోంది..

“ఈ సంవత్సరం వచ్చి తప్పు పని చేసామేమో?” అన్నాడు రాజారావు అన్నగారితో ఒక రోజు..

“నువ్వలా పొరపాటున కూడా అలా అనుకోకురా! మీ కోసం ప్రత్యేకంగా మేమేమి చెయ్యడం లేదు. ప్రకృతి ప్రకోపించిన దానికి మనమేం చెయ్యగలం ? ఇరవై ఏళ్లుగా మనం దాదాపు ప్రతి ఏడూ ఈ ఇంట్లో

హాయిగా కాకపోయినా కనీసం మనసులు విప్పి గడుపుతున్నాం. ఇప్పుడేదో ప్రమాదం ముంచుకొచ్చినట్టుగా ఈ సంవత్సరం నేను బ్రేక్ చెయ్యదలుచుకోలేదు. ఇంకో విషయం. నేను ఎవ్వరితోనూ పోల్చుకోను. నా పంధాలో నేను పోతాను. దానికి నువ్వుకూడా ఎంతో సహకరిస్తున్నావు. ప్రకృతి ప్రళయ తాండవం ఆడినా ఎంతో నేర్పుతో మనకు అనుగుణంగా మార్చుకోవడంలోనే మన తెలివితేటలు ఉపయోగ పడతాయి. ఈ విషయంలో నువ్వు నాకు తోడుంటే ఇంతకన్నా గడ్డు పరిస్తితులలోనూ నెగ్గుకు రాగలమన్న ధైర్యం, నమ్మకం నాకుంది. “ అన్నాడు సుబ్రహ్మణ్యం ఎంతో ఆత్మ విశ్వాసం ధ్వనించిన గొంతుతో.....




"మీ పాత గుమాస్తా ఉద్యోగమే బాగుండేది, కాస్త ఖాళీ దొరికేది. ఏ ముహూర్తాన ఈ టీచింగు లైన్లోకి వచ్చారో, పనిరోజులకి, సెలవు రోజులకి తేడాయే ఉండడం లేదు..."- అంటూ శ్రీమతి అనే నిష్ఠూరపు మాటలు గుర్తు చేసుకుంటూనే సైకిల్ స్టేండ్ వేసేసి మెట్లెక్కి ఇంట్లోకి వచ్చాను. పొద్దున్న అర్జెంటు పని మీద కాలేజికి వెళ్లి, మళ్ళా ఇప్పుడే రావడం. చీకటి పడినా, గదులన్నీ నిప్పుల వాన కురిపిస్తున్నా యి. మేడ మీద ప్రైవేటా అవ్వడం, ఎ.సి.లు వగైరా లేకపోవడం తో వేసవి కాలమంతా మాకు నిప్పులతో సహవాసమే.

బాత్రూం లో కాళ్ళు కడుక్కొని వచ్చి, బట్టలు మార్చుకుంటూ.... "నాని గాడు డ్రాయింగ్ క్లాసు నుంచి ఇంకా రాలేదా?అని అడిగా...నేను ఏ టైముకి వచ్చినా... "నాన్నా.." అంటూ కాళ్ళకు చుట్టేసుకొనే నాని హాల్లో కనబడకపోవడంతో.

"అసలు వెళితే కదా.?" ముక్తసరిగా శ్రీమతి సమాధానం..ఆవిడ తీసుకొచ్చిన మంచినీళ్ళు తాగుతూ, "అదేంటి? మరెక్కడికెళ్ళాడు?" అన్నా.

“ఎక్కడికీ వెళ్ళలేదు. లోపల మంచంమీద పడుకున్నాడు…” ఆవిడ గొంతులో కూడా ఏదో తేడా.

“అప్పుడే?” – నిజానికి అది చిన్నపిల్లలు అందరూ పడుకునే టైమే అయినా, మావాడి సంగతి వేరవడంతో నాకు ఆశ్చర్యం వేసింది. సాయంత్రం స్కూలు నుంచి రాగానే, హోం వర్కు చేసుకున్న తరువాత 6 నుంచి 8 వరకు తనకు ఇష్టమైన డ్రాయింగ్ క్లాసుకు వెళ్లి వచ్చి, కాసేపు కార్టూను నెట్ వర్కు చూసి, నన్ను కథ చెప్పమని, చెబుతూ… చెబుతూ… నేను నిద్రపోయాక, వాళ్ళమ్మ దగ్గరకు పోయి “అమ్మా, నాన్న నిద్రపోయారు, నువ్వు కథ చెప్పవా?” అని ఆవిడ వెంటపడి, విసిగించి, పనులన్నీ అయ్యాక కథ చెప్పించుకొని, ఎం.ఎస్.రామారావు గారి హనుమాన్ చాలిసా వింటూ గాని పడుకోడు.

***

గదిలోకి వచ్చిన నాకు మంచం మీద బోర్లా పడుకున్న నాని అటూ, ఇటూ కదులుతూ కనిపించాడు. అంటే నిద్ర పోలేదన్నమాట.

“నాన్నా? ఇంకా పడుకోలేదా?” ఉహూ. ఉలుకూ, పలుకూ లేదు.

“అన్నం తిన్నావా?”..సమాధానం లేదు. దగ్గరకు వెళ్ళేటప్పటికి వెక్కి, వెక్కి ఏడుస్తున్నాడు. “ఏమైంది నాన్నా?” అంటూ మొహం తిప్పబోతే, బలవంతంగా మొహాన్ని తలగడలో దాచేసుకున్నాడు. అంతకంతకూ వాడి ఏడుపు స్థాయి పెరుగుతోంది. ఓహో, సాయంత్రం నేను వచ్చేటప్పటికే ఏదో అయిందన్నమాట – అలసిపోయి ఇంటికి వచ్చేటప్పటికి (ఇంటి)వాతావరణం చికాకుగా ఉంటే భరించలేని బాధ. ఇంతలో వంటింట్లో నుండి కంచాలు, గిన్నెలు సర్దుతున్న శబ్దాలు గట్టిగా వినిపిస్తున్నాయి. బాధొచ్చినా, కోపమొచ్చినా నా శ్రీమతి శాబ్దికంగానే మాట్లాడుతుంది. ఆ సింబాలిజానికి బాగానే అలవాటు పడ్డ నేను, ఇక “ఏమయింది…?” అని ఆవిడను ప్రశ్నించే ధైర్యం చేయలేదు. నాని గాడి నుంచి విషయం రాబట్టడమే సులువు.

అనునయంగా వాడి నడ్డిమీద నిమురుతూ, “ఏమైంది నాన్నా? నాకు చెప్పచ్చు కదా? అమ్మ ఏమైనా అందా? స్కూల్లో ఏమైనా గొడవ జరిగిందా?” అంటూ వాడి మొహం ఇటు తిప్పితే, జలజలా రాలుతున్న కన్నీళ్లు, బుగ్గల నిండా కన్నీటి చారలు, మొహమంతా కందిపోయి ఉంది. ఎప్పటినుండి ఏడుస్తున్నాడో ఏమో, తలగడ మొత్తం తడిసిపోయింది.

పరిస్థితి కొంచెం తీవ్రంగానే ఉందనిపించి, వాడి తలను నా ఒళ్లోకి తీసుకున్నాను. “ఉహూ…” అంటూ గించుకుంటున్నాడు- “ఏమక్కరలేదు, నువ్వెళ్ళిపో, నేనేం చెప్పను, నా కెవరూ ఫ్రెండ్సు లేరు, నన్ను ఆడుకోనివ్వరు. అమ్మ నా బెస్టు ఫ్రెండు కానే కాదు…”అంటూ పొంతన లేకుండా మాట్లాడుతూనే ఏడుస్తున్నాడు. ఆ ఏడుపు అంతకంతకూ పెరిగి ఆయాసంగా మారడంతో

భయం వేసి శ్రీమతిని గట్టిగా పిల్చాను. “ఏమోయ్, ఒక్కసారి ఇలారా, వీడికి ఆయాసం వచ్చేస్తోంది అని”. వాడికి ఆయాసం వస్తే, ఇక ఊపిరి ఆడనంతగా ఎగశ్వాస వచ్చి, చాలా ఇబ్బంది పడిపోతాడు. గదిలోకి వచ్చిన శ్రీమతి కూడా వాడి గుండెలపై చేయి వేసి, ఆయాసం తగ్గించే ప్రయత్నం చేస్తోంది, అయితే, వాడి ఏడుపు, ఆయాసం అంతకంతకూ పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు.

ఇంక ఆగలేక అడిగాను, “అసలేమైంది? మీ ఇద్దరికీ మధ్య?” అని.

“ఏముంటుంది? మామూలే...ఎండలు ఎలా ఉన్నాయో చూసారా? మధ్యాహ్నం వస్తూనే కిందకు వెళ్లిపోయి ఆడేస్తానంటాడు... వద్దన్నానని గొడవ...ఇక అది మొదలు, ఒక పాలు తాగడం లేదు, ఒక స్నాక్స్ తినడం లేదు – వాడు చెప్పినట్టే మనం వినాలంటాడు...”, అంటూ ఇంకా ఏదో చెప్పబోతోంది – నాని గుండెలపై నిమురుతూనే.

మధ్యలో వాడు అందుకొని, “ఏం కాదు...పోనీ పాలుతాగాక, స్నాక్స్ తిన్నాకనే వెళతానన్నాను...అయినా వద్దన్నావు కదా?” అంటూ వాళ్ళ అమ్మ మాటలకు అడ్డు వచ్చాడు.

”ఎప్పుడు? మధ్యాహ్నం 3.30 కి, పైగా క్రికెట్టు ఆడతాట్ట, ఆ పెద్ద పిల్లలతో కలిసి...స్కూలులో ఆటో వచ్చేవరకు ఎండల్లో ఆడేసి వచ్చింది చాలక ఇంకా ఇంటికొచ్చేక కూడా అవే ఆటలు మళ్ళా...”

“అవే ఆటలు ఏం కాదు ...వేరేవి...” లాజిక్ తీసాడు నాని. ఇంకా... “పెద్ద వాళ్ళతో ఆడితే నీకెందుకు ఆ ఆటలు? అంటావు, చిన్న పిల్లలతో అయితే నువ్వేమైనా చంటి పిల్లాడివా? అంటావు. నువ్వైనా నాతో ఆడమంటే పనుంది అంటావు, పోనీ నాన్న ఆడతారా అంటే, ఎప్పుడూ లేటుగా రావడం, వచ్చినా కంప్యూటర్ ముందు కూచోడం. ఇంక నేను ఎప్పుడు ఆడుకోవాలి? ఎవరితో ఆడుకోవాలి?” – అంత ఆక్రోశం లోనూ నాని లాజిక్ మిస్ కావటం లేదు, పైగా విషయం తిరిగి తిరిగి నా వైపే వస్తోంది.

“మరి ఎండలు చూడు నాన్నా...చాలా ఎక్కువగా ఉన్నాయి కదా? పొద్దున్న నువ్వే చూసావు కదా పేపర్లో వార్తలు, బస్సులో ఉన్న ప్రయాణికులే వడదెబ్బకు చనిపోతున్నారు. డాక్టర్లు కూడా చిన్న పిల్లలని ఎండలోకి అస్సలు పంపద్దంటున్నారు. అమ్మ కంగారు పడడంలో అర్థం ఉంది కదా...?” అంటూ అనునయించబోయాను. వాడికి ఆయాసం తగ్గడంతో, శ్రీమతి – భోజనాల ఏర్పాట్లు చేయడానికి వంటింట్లోకి వెళ్ళింది.

“నిజమే – నాన్నా... కాని, శీతాకాలం అయితే, చలిగాలి – బయటకు వెళ్ళద్దు అంటుంది, వర్షాకాలం అయితే, జ్వరం వస్తుంది,

బాడి, బందగా ఉంది, బయటకు వెళ్ళద్దు అంటుంది,     ఇంక సమ్మర్ లో – ఎండలు, వడదెబ్బ...పోనీ హైదరాబాద్ బావ దగ్గరకు వెళదాం అంటే, "ఇంకా స్కూల్ హాలిడేస్ ఇవ్వలేదు కదా...", అంటుంది. ఇంక నేను ఎక్కడ ఆడుకోవాలి? ఎప్పుడు ఆడుకోవాలి? ఎవరితో ఆడుకోవాలి? ...... ఇంట్లో నాతో ఆడటానికి ఇంకో మెంబర్ అయినా కావాలి..." ఆయాసం తగ్గి, నానిగాడి మాటల్లో ఆవేశం పెరుగుతోంది.

నిజమే, పదిమంది పిల్లల మధ్య పుట్టిన నాకు, నానిగాడి ఒంటరితనం ముల్లులా గుచ్చుతూనే ఉంటుంది. సింగిల్ చైల్డ్ ప్రోబ్లం బాగా అనుభవం లోకి వస్తోంది. ఇంకా ఊరుకుంటే, వాడు మరింత సమాధానం చెప్పలేని ప్రశ్నల్లోకి వెళతాడు అనిపించి, "పోనీలే నాన్నా... అమ్మ ఏదో పనిలో ఉండి, విసుక్కుని ఉంటుంది. మనమిద్దరం ఆడుకుందాం. రేపట్నించి తొందరగా వచ్చేస్తా కదా...భోజనం చేసేద్దాం నడు.." అన్నాను.

కొంచెం మెత్తబడ్డా, "...అయితే, నాకు భోజనం చేసేక కథ చెప్పాలి.." అన్నాడు.

"ఓస్ అంతే కదా...తప్పనిసరిగా చెబుతాను" అన్నా.."ఉహూ.. కథ కాదు, కథ చెబుతుంటే నీకు నిద్ర వచ్చేస్తుంది, కనక నీ చిన్ననాటి విషయాలు చెప్పాలి..." అన్నాడు.

నిజమే, అబద్ధాలతో అల్లేసే కథ కన్నా, వాస్తవం మరింత ఆసక్తిగా ఉంటుందని, ఉరుకులు, పరుగులు పెట్టే ప్రస్తుతం కన్నా గతం అందంగా ఉంటుందని, నిద్రబుచ్చడం కోసం అమ్మ చెప్పే కథల కన్నా కూడా నిద్రపోతూ, నాన్న చెప్పే కబుర్లే బాగుంటాయని మా నానిగాడికి బాగా తెలుసు.

***

మొత్తానికి భోజనం కానిచ్చి, మేడమీద పక్క వేసి,     నానిగాడి పక్కన పడుకున్నా..."ఇంక మొదలుపెడదామా... నా చిన్ననాటి కబుర్లు? అంటూ.."

"కాని నువ్వు నిద్రపోకూడదు మరి..." నానిగాడి ముందస్తు హెచ్చరిక.

"సరే...మా చిన్నప్పుడు ఎండాకాలం రోజంతా భలేగా ఎంజాయ్ చేసేవాళ్ళం తెలుసా..?" అంటూ ప్రారంభించాను.

“మరి, మామ్మ గారు, తాత గారు ఏమనేవారు కాదా?” “ఉహూ…వేసవి సెలవులు అంటేనే ఆడుకోడానికి అన్నట్లు ఉండేది, అయితే… దాంతో పాటు ఇంకా చాలా పనులు చేసేవాళ్ళం అనుకో…”.      ఇంక ప్రశ్నలన్నీ కళ్ళతోటే, అన్నట్టు మౌనంగా వింటున్నాడు నాని.

“పొద్దున్న లేస్తూనే – స్నానం చేసేసి, తరవాణి అన్నంలో ఆవకాయ నంచుకుని తినేసి, నేను నా స్నేహితుడు సుబ్బారావు ఇంటికి పోయేవాడిని.” --- “తరవాణి అంటే?” – అనే సందేహం వాడికి వచ్చినా, తరవాత ఏం చేసేవాళ్ళం అనే దానిపైనే ఆసక్తి ఎక్కువగా ఉండడంతో ఇక ప్రశ్న వేయలేదు. “అక్కడనుంచి వాడి సైకిలు మీద ఎక్కి, ఊరి చివర ఉన్న రెడ్డిబాబుగారి పెంకుల మిల్లు దగ్గరకు పోయేవాళ్ళం.      అక్కడ మరికొంత మంది స్నేహితులు కలిసేవారు. మిల్లు లోపల చల్లగా ఉండేది. కిరోసిన్ వాసన వస్తున్న మట్టి పెంకులు తయారి చూడడం భలేగా ఉండేది. పాడైపోయిన పచ్చి పెంకుల మట్టి ముద్దలు ముందేసుకొని బొమ్మలు చేసేవాళ్ళం. ఆకలేస్తే, రెడ్డిబాబుగారి మిల్లు వెనక తోటలో జామచెట్లు ఎక్కడం, కాయలు కోసుకొని, ఉప్పు, కారం లో నంచుకొని తినడం”---వింటున్న నానిగాడికి నోరూరుతోంది అన్న సంగతి తెలుస్తోంది.

“బాగా ఆకలి వేసేక, మధ్యాహ్నానికి ఇళ్ళకి చేరేవాళ్ళం. కటకటాల వాకిట్లో తాతగారు వ్యాసపీఠం మీద ఏదైనా పుస్తకం పెట్టుకుని శ్రద్ధగా చదువుకుంటుంటేనో, ఇంటికొచ్చిన వాళ్ళు ఎవరితోనైనా మాట్లాడుతుంటేనో పరవాలేదు, పిల్లిలా జాగ్రత్తగా లోపలికి వచ్చేసి, బుద్ధిగా గదిలో కూచునేవాడిని. లేదంటే కొంచెం ఇబ్బంది…మరి కాసేపటికి, మా అన్నయ్యలు, అదే – నీ పెద నాన్నలు, కూడా వాళ్ళ స్నేహితులతో తిరిగి, తిరిగి, ఎండలో చెమటలు కక్కుకుంటూ వచ్చేవారు”.

“ఏం బాబు, ఇల్లు ఇప్పటికి గుర్తుకొచ్చిందా? ఏం ఏకంగా రాత్రి పడుకోడానికి రాలేకపోయారా?” అంటూ మా అమ్మ – అంటే మీ మామ్మ గారు వంటింట్లోంచి వచ్చి అనేంతవరకు తాత గారు ఏమనేవారు కాదు. అప్పుడు కూడా, “ఏమర్రా, ఎండల్లో పడి ఎక్కడ తిరుగుతున్నారు? భగవద్గీత శ్లోకాలు వచ్చేసేయా?” అనేవారు.

“హమ్మో…” అప్పుడు గుర్తుకొచ్చేది – ముందు రోజు తాతగారు మమ్మల్నందరినీ కూర్చోపెట్టి నేర్పిన “భక్తియోగం శ్లోకాలు”. ఇంతలో మా పాట్లు చూసి, మా అక్క, చెల్లెళ్ళు – అదే నీ అత్తలు నవ్వేవారు – బాగా అయిందా? అన్నట్లుగా. వాళ్ళు ఆ పాటికి, శ్లోకాలు చదివి అప్పగించడం అయిపోయిందన్న మాట. మా అమ్మ – అన్నంతో పాటు పెట్టే తిట్లు కూడా కడుపునిండా నింపేసుకొని, భగవద్గీత పుస్తకాలు ముందేసుకుని కూచునేవాళ్ళం.

“ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమ: అథ శ్రీమద్భగవద్గీతా, భక్తియోగ: …….”ఏవం సతత యుక్తాయే భక్తాస్త్వాం పర్యుపాసతే…….” అంటూ ముందుకూ వెనక్కూ ఊగుతూ, మాలో మేము గొణుక్కుంటూ ఉంటే, “పెద్దగా వినబడేట్లు చదవండి”….అంటూ మీ పెద్ద అత్త హుకుం జారీ చేసేది. పెట్టినా, తిట్టినా అమ్మ తరవాత అక్కే కదా… అందుకొని ఏమీ చేసేది లేక – పెద్దగా చదువుతూ

ఉండేవాళ్ళం... ఈలోపులో ఊళ్ళో వాళ్ళో, పొరుగూరు వాళ్ళో మామిడి కాయలో, మామిడి పళ్ళో పంపేవారు అభిమానంగా. అంతే, శ్లోకాలు పక్కన పెట్టి, మామ్మగారి పక్కన చేరి, “ఏమైనా సాయం చేయాలా?” అని అడిగేవాళ్ళం – విషయం అర్ధమైన మామ్మగారు, అందరికీ తలో మామిడి పండు ఇచ్చి, “తినేసి మళ్ళా కూచుని శ్లోకాలు చదవండి, నాన్నగారు తిడతారు...” అనేవారు.

“ఆ చెరుకురసాల మామిడి పళ్ళు ఆస్వాదిస్తూ మేము తినడం, అదే, జుర్రుడం పూర్తి చేసేటప్పటికి, ఎండ కాస్త తగ్గేది, సిమెంటు చేసిన విశాలమైన వరండాలో మధ్యాహ్నం ఎండబెట్టిన ఎండుమిర్చి, కందిపప్పు, మినప్పప్పు లాంటివన్నీ సాయంత్రం అయ్యాక, అందరం కలిసి జాగ్రత్తగా డబ్బాల్లోకి ఎత్తేసేవాళ్ళం.    మరి ఎండుమిర్చి ఎండబెడితే మళ్ళా మండుతుంది కదా... అందుకని, నూతిలోంచి బక్కెట్లు, బక్కెట్లు నీళ్ళు తోడి, వరండాలో పోసి, చీపురు తో శుభ్రంగా గచ్చు అంతా కడిగేసేవాళ్ళం.    అక్కడే, శుభ్రంగా స్నానాలు కూడా చేసేస్తూ, గచ్చు పైనుంచి, కింద వరకు జారుతుండే వాళ్ళం ...జలకాలాటలలో అని పాటలు పాడుకుంటూ...” – వింటున్న నాని గాడి కళ్ళల్లో ఉత్సుకతతో పాటు, ఒకింత ఈర్ష్య కూడా కనబడింది.

“మామిడి కాయలు వచ్చినప్పుడు అయితే, మాగాయి, తొక్కుడు పచ్చడి, రకరకాల ఆవకాయల కోసం, ఆల్చిప్పలతో చెక్కులు తీయడం లాంటివి మేం చేసేవాళ్ళం. మరకత్తిపీట తో ఆవకాయ ముక్కలు కోయడం తాతగారు చేసేవారు. ఇంక ఆ వారం, పది రోజులు మామ్మగారు కారం కొట్టడం, ఆవ కొట్టడం, గానుగ నూనె తెచ్చి, జాడీల్లో ఆవకాయలు పెట్టడం – ఈ పనులతో బిజీనే బిజీ...ఒకోసారి, ఈ పనులన్నీ చుట్టుపక్కల వాళ్ళంతా కలిపి చేసుకొనేవారు....”

“మరి అమ్మ ఎప్పుడూ ఆవకాయ పెట్టదేం...?” అని అడుగుతూనే, “అయినా ఇప్పుడు రెడీమేడ్ ఊరగాయలు దొరికేస్తున్నాయి కదా....ఆ అవసరం లేదులే” అన్నాడు నాని. “అవును ..అయితే, ఇప్పుడు ఆ సందడీ    లేదు...రుచి లేదు..” అన్నా... అమ్మ చేసిన ఊరగాయ రుచి గుర్తుకొచ్చి నోరూరుతుంటే.

“ఒకోసారి, సాయంత్రం చల్లబడ్డాక, ఇంటివెనుక తోట పని – అక్కడ తాతగారు గునపంతో, పారలో, కొడవలితో శుభ్రం చేస్తుంటే, నేను, మీ పెదనాన్నలు, అత్తలు – అంతా సాయం చేసేవాళ్ళం.    అరటి చెట్లకు, కొబ్బరి చెట్లకు బోదెలు చేయడం, టమాటా, వంగ, పచ్చిమిర్చి మొక్కలకు – నీళ్ళు పోయడం కోసం సన్నని పాదులు తీయడం, నూతి నుంచి నీళ్ళు తూముల్లో పోసి, అక్కడినుంచి మళ్ళా, బొబ్బాసి గొట్టాలతో సన్నటి కుళాయిల్లా చేసి, మొక్కలకు నీళ్ళు పెట్టడం....” చెబుతుంటే, నానిగాడి మొఖంలో ఈసారి ఈర్ష్య స్పష్టంగా కనబడుతోంది.    “అవన్నీ నాకు ఇప్పుడెందుకు లేవు?” అన్న ప్రశ్న మౌనంగా సంధిస్తున్నట్టు అనిపించింది.

“తోటపని లేకపోతే, మళ్ళా పిల్లుల్లా బయటకు జారుకుని, ఇంటికి దగ్గరగా ఉన్న నూకాలమ్మ గుడికి చేరేవాళ్ళం. ఆ గుడి

చుట్టుపక్కల అప్పటికే పంటలు నూర్చేసిన పొలాలు ఉండేవి. తాటాకులతో చక్రాలను తయారు చేసుకుని, డానికి పొడవైన ముళ్ళు గుచ్చి, కింద మొనలు తేరిన గడ్డి దుబ్బులు గుచ్చుకుంటున్నా లెక్క చేయకుండా, పరుగులు పెట్టే వాళ్ళం..ఆ తాటాకు చక్రం తిరుగుతుంటే భలే సరదాగా ఉండేది. ఒక్కో సారి గాలిపటాలు న్యూసు పేపరుతో తయారు చేసుకొని, దారం కట్టి ఎగరేసుకునే వాళ్ళం...ఇంకా తాటి ముంజలతో బళ్ళు, పాత సైకిలు చక్రాలతో పరుగులు....అక్కడ ఎవరైనా తాటి ముంజలో, కాల్చిన తేగలో ఇస్తే తినెయ్యడం...మళ్ళా ఆడుకోడం. మా గ్యాంగు లో ఆ సందులో ఉండే లెక్చరర్ గారి పిల్లలు, ప్రెసిడెంటు గారి మనవలు, అప్పుడప్పుడూ మా క్లాసుమేట్లు, మా ఇంట్లో అద్దెకుండే వాళ్ళ పిల్లలు, ఆ పక్క సందులో వాళ్ళు – ఓహ్ సుమారు 25-30 మంది ఉండేవారు".

"హమ్మో అంత మందే..." అంటూ నాని నోరు వెళ్ళబెట్టాడు.

"ఆటలను బట్టి, ఆడా, మగా, విడివిడిగా గాని, కలిసి గాని ఆడేవాళ్ళం. ఆటలు పూర్తయి చీకటి పడి, మళ్ళా ఇల్లు చేరేటప్పటికి మామ్మగారు అన్నాలు రెడీ చేసేసేవారు. తొందరగా కానిచ్చి, మళ్ళా వీధుల్లోకి పరుగే పరుగు.

"అదేంటి? మరి కార్టూన్ నెట్ వర్కు చూసేవారు కాదా?" – నానిగాడు ఆశ్చర్యంగా అడిగాడు.

"ఉహూ....అప్పుడు అవి లేవు, అయినా మా ఇంట్లో అసలు టి.వి. నే లేదు.." అన్నాను.

"ఊ ...రాత్రి బయటకెళ్ళి ఏం చేసేవారు?" అన్నాడు.

"నిద్రపొమ్మని ఇళ్ళనుంచి పిలుపులు వచ్చే వరకు మళ్ళా ఆటలే ఆటలు...వీధి దీపాల వెలుగుల్లోనే ఏడు పెంకుల ఆట, దొంగా పోలీసు, ఆడపిల్లలైతే, కాళ్ళా గజ్జ కంకాలమ్మ...ఇల్లా ఆటలే ఆటలు....వీధంతా సందడే సందడి..." అని చెప్పి, "ఇంక పడుకుందామా?" అన్నాను.

"అదేంటి? అన్ని సమ్మర్ హాలిడేస్ అయితే, ఇన్ని విశేషాలేనా? ఇంకా చెప్పాలి..." అన్నాడు నాని.

"హమ్మదొంగా ....అన్ని రోజుల గురించి చెప్పాలా?" అంటూనే, "సరే...చెబుతాలే..విను" అన్నాను.

ఇంతలో "మీరు మీ పురాణానికి ఇక ఫుల్ స్టాప్ పెట్టకపోతే, వాడు అలా చెప్పమంటూనే ఉంటాడు..." అంటూ శ్రీమతి సూచన లాంటి మెత్తని హెచ్చరిక జారీ చేసింది.

"ఏమీ పర్వాలేదు..రేపు స్కూలు సెలవే కదా... లేటుగా లేచినా పర్వాలేదు....నువ్వు చెప్పు నాన్నా..." నానిగాడి ఆజ్ఞ.

"ఒకోరోజు... మా స్నేహితులం అంతా ఊరికి దూరంగా ఉన్న మా స్నేహితుడు కిట్టూ పొలానికి వెళ్ళేవాళ్ళం. అక్కడ సీమ చింత కాయలు, ముంజెలు, తేగలు తినడం...అక్కడకు వచ్చే లేళ్ళను, దుప్పులను దూరం నుంచే చూడడం చూసేవాళ్ళం". వింటున్న నానికి వింతగా అనిపించింది. నేను కల్పించి చెబుతున్నానేమో అనుకోని, "అదేంటి? లేళ్ళు, దుప్పులూనా? అవి జూలోను, అడవి లోను కదా ఉంటాయి?" అంటూ అనుమానం వ్యక్తం చేసాడు.

"లేదు నాన్నా... అప్పుడు అవి మా ఊరికి దగ్గరలో కూడా కనిపించేవి. ఇప్పుడు మొత్తం ఊర్లు పెరిగిపోవడం, ఇళ్ళు ఎక్కువ అయిపోవడంతో కనబడడం లేదు." అన్నాను. "ఇంకా... అక్కడ పొలం నుంచి మా స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి, చక్కగా స్వీట్లు, టిఫిన్లు తినడం, చల్లటి మజ్జిగ తాగడం.."గురువుగారి అబ్బాయి గారు" అని మా ఫ్రెండు వాళ్ళ పెద్దవాళ్ళు చెప్పుకుంటుంటే మా ఫ్రెండ్సు ముందు కొంచెం దర్జా వెలగబెట్టడం... భలేగా ఉండేదిలే...". నాని గాడు మరింత దగ్గరగా జరిగి, నా మీద చేతులు వేసి, వింటున్నాడు.

"ఉగాది తరువాత నూకాలమ్మ తీర్థం వచ్చేది. పది రోజుల పాటు సంబరాలు జరిగేవి. ఆ పది రోజులూ ఇంక ఇంటి పట్టున ఉండే వాళ్ళం కాదు. గుడి దగ్గర టేపు రికార్డులో సినిమా పాటలు వస్తుంటే, డేన్సులు చేసుకుంటూ, ఆటలు ఆడుకుంటూ సందడే సందడి...కొబ్బరికాయ ముక్కలు, అరటిపళ్ళు, వడపప్పులు, పానకాలు, అంతటితో ఆగకుండా తీర్థం లో అమ్మే జీళ్ళు, తవుడు ఉండలు ఆరగిస్తూ ఆడుకోవడమే.....రాత్రి అయితే గుడి పక్కన ఖాళీ అయిన పొలాల్లో సినిమాలు, నాటకాలు వేసేవాళ్ళు".

"ఏంటీ వీధుల్లో సినిమాలా?" నానిగాడికి ఆశ్చర్యం.

"అవును నాన్నా, అప్పుడు 16 ఎం.ఎం. అని చిన్న తెరమీద సినిమాలు వేసేవాళ్ళు....దొరబాబు, సోగ్గాడు, మాయదారి మల్లిగాడు, రైతుబిడ్డ, బావామరదళ్ళు, దసరాబుల్లోడు, కాంభోజరాజు కథ, లవకుశ, మాయాబజార్, ఖైదీ......." ఇలా చెబుతుంటే..ఎప్పుడూ వినని సినిమా పేర్లు వింటున్న నానిగాడు ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నాడు.

“మరి, ఎక్కడ కూర్చొనే వాళ్ళు?”

“అక్కడే.., పొలాల్లోనే, కాకపోతే, మేం ముందుగానే వెళ్లి, చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలు కొన్ని పీకి, కొంచెం గడ్డితో కలిపి, వత్తుగా పరుపులా చేసుకొని, వాటిమీద గోనె సంచులు వేసుకొని,...ఓహ్...ఇలా పడుక్కుని ఇంటి దగ్గర నుంచి తీసుకెళ్ళిన జంతికలో, చేగోడీలో తింటూ సినిమా చూస్తుంటే...” అంటుంటే, నానిగాడు ఉడుక్కోడం మొఖంలో స్పష్టంగా కనబడుతోంది. “అలా... ఒక్కోసారి సినిమా చూస్తూనే నిద్రపోయే వాళ్ళం..సినిమా అయిపోయాక ఎవరైనా లేపేవారు, లేదంటే తాతగారు వచ్చి తీసుకెళ్ళే వారు....” వింటున్న నానిగాడికి కొద్దిగా ఆవలింతలు వస్తున్నాయి.

“ఇంక పడుకుందామా?” అన్నాను.

“ఉహూ...ఇంకా చెప్పాల్సిందే...” – అన్నాడు ఆవలింతలను బలవంతంగా ఆపుకుంటూ. వింటున్న నాని కోసమే కాక, చిన్ననాటి తీపి గుర్తులు నెమరు వేసుకోవడం నాకూ చాలా ఆనందంగా ఉండడంతో, కొనసాగించడానికే నిశ్చయించాను.

“ఇక శ్రీరామ నవమికి ఊర్లో అన్ని పేటల్లో ఉండే రామ కోవెలలన్నీ ముస్తాబు చేసేవారు – సీతారాముల కల్యాణానికి. అంతేకాదు, చిన్నపిల్లలమైనా, గురువుగారి పిల్లలంటూ, మాకు కూడా, పెద్ద వాళ్ళతో పాటుగా విసనకర్రలు, మామిడి పళ్ళు, రూపాయో, రెండు రూపాయలో – తళతళలాడే నోట్లు – సంభావనగా అందించేవారు..” నానిగాడి పెదాలపై నవ్వు. అయితే, ఎప్పుడూ లేనిది, మరిన్ని ఆవలింతలు వస్తున్నాయి వాడికి.

“నాన్నా, ఇంక పడుకుందామా? “ అన్నా.

“అంటే....సమ్మర్ విశేషాలు అయిపోయాయా? మరి సమ్మర్ హాలిడేస్ కి మీరు ఎక్కడికి వెళ్ళేవారు కాదా?” అన్నాడు.

“ఓహో ఇంకా ఆ విశేషాలు కూడా చెప్పాలా?” అంటూ... “నీకు తెలుసు కదా, మాది పెద్ద ఫేమిలీ, అలాగే పెద్ద ఇల్లు కూడా. అందుకని, చుట్టాలంతా మా యింటికే వచ్చేవాళ్ళు. వస్తే ఎక్కువరోజులే ఉండేవారు. మా అమ్మమ్మ గారిది కూడా అదే ఊరు కావడంతో మా మావయ్యల పిల్లలు, పిన్నుల పిల్లలు అందరూ అక్కడికే – ఇంక చూసుకో సందడే సందడి. మధ్యాహ్నం ఐసు

ఫ్రూట్లు, చంద్రం కిళ్ళీ కొట్టు లో నిమ్మ సోడాలు, సాయంత్రం స్నానాలు అయ్యాక, విష్ణాలయంలో దర్శనాలు .... అక్కడికి వెళ్ళేది దేవుడి కోసం కాదు – ఆచార్యులు గారు పెట్టే వడల ప్రసాదం కోసం...." అంటుంటే....నాని గాడి పెదాల మీద మళ్ళా నవ్వు కనబడుతోంది, అయితే రెప్పలు మూతపడుతూ క్రమంగా నిద్రలోకి జారుకున్నాడు..." ఎందుకో చాలా రోజుల తరువాత జ్ఞాపకాల తీయని బాధ మూలంగా నాకు నిద్ర రాలేదు.

నానిగాడు మాత్రం "మళ్ళీ ఆ మంచి రోజులొస్తాయా నాన్నా...?" అంటూ పలవరిస్తూనే ఉన్నాడు రాత్రంతా.




భాగ్యనగరంలో అది "ఆనందవిహార్" అని అత్యంత ధనవంతుల గృహసముదాయాల ప్రాంగణం . అందులో గృహాలన్నీ కలిపి సుమారు 50 దాకా ఉండవచ్చు. ప్రతి ఇంటి ముందు కారు పెట్టుకునేందుకు , మూడు వైపులా పూల మొక్కలు పెంచుకునేందుకు ఖాళీ స్థలము ఉన్నాయి. విశాలమైన రోడ్లు , పచ్చదనంతో ఎంతో పరిశుభ్రంగా ఉండి ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న ఆ సుందరమైన కాలనీలోకి మూడు సంవత్సరాల క్రితం సావిత్రమ్మ శంకరయ్యగార్లు ఒక ఇల్లు కొనుక్కుని నివాసం ఉండటానికి వచ్చారు . ఆ దంపతులకి ఇరువురు కుమారులు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయ్యి అమెరికాలో స్థిర పడ్డారు. పెద్దకుమారుడికి ఇద్దరు కవల పిల్లలు చైతన్య , దీపిక . పదిసంవత్సరాల వయసున్న ఇద్దరిలోకి చైతన్య 2 నిమిషాలు పెద్దవాడు. రెండవ కుమారునికి ఒక 6 నెలల పాపాయి .

మరి నాలుగు రోజుల్లో శంకరయ్య దంపతుల కుమారులు కుటుంబాలతో సహా తల్లి దండ్రులను చూసి వాళ్ళ దగ్గిర గడిపి వెళదామని భారతదేశం వస్తున్నారు. ఈ విషయం తెలిసినప్పటినుండి ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. ఆనందవిహార్ లోని ఈ ఇంటికి పిల్లలందరూ రావడం ఇదే మొదటిసారి . మనుమడు మనుమరాండ్రతో సమయం

గడపాలని పెద్ద వాళ్ళిద్దరి మనసులు ఉవ్విళ్ళూరుతున్నాయి.

ఆనందవిహార్ కాలనీలో ఒక విచిత్రమైన పోటీ జరుగుతుంటుంది . అదేమంటే ఎవరి కారు , గృహ ప్రాంగణమైతే అత్యంత పరిశుభ్రంగా ఉంటాయో వాళ్ళకి ఒక బహుమానం ఇచ్చి ప్రోత్సహిస్తుంటారు . ఆ విధంగా కాలనీ అంతా కూడా పరిశుభ్రంగా ఉంటుందనే ఒక ఆలోచనతో ఈ పోటీ ప్రతిపాదించబడింది. శుభ్రమైన ప్రాంగణం ఎవరిదనే విషయాన్ని నిర్ణయించడానికి నిష్పక్షపాతంగా ఉంటుందని బయటనించి న్యాయనిర్ణేతలని పిలుస్తుంటారు. అందువల్ల ఆ బహుమానం తమకే దక్కాలని ప్రతి ఒక్కరూ తాపత్రయపడుతుంటారు . అందరూ ఉదయాన్నే లేచి నీళ్ళని డబ్బులాగా వెదజల్లి కార్లు, ప్రాంగణాలు శుభ్రం చేసుకుంటుంటారు . ప్రతి ఇంటికి బోరుబావి ఉండటంతో ఇష్టారాజ్యం భరతుడి పట్టం చందాన నీటి వాడకం జరుగుతూ ఉంటుంది.

శంకరయ్యదంపతుల పిల్లలకి, మనుమలకి ఆనందవిహార్ ఎంతో బాగా నచ్చింది. కాలనీలో జరిగే పోటిగురించి కూడా ఎంతో ఆసక్తిగా విన్నారు. అమెరికాలో ఉంటున్నప్పటికి ఇంట్లో కొడుకు కోడలు తెలుగులోనే సంభాషించుకోవడం వలన శంకరయ్యగారి మనుమలిద్దరికి తెలుగు బాగా మాట్లాడటం వచ్చును. మాతృభాష వచ్చి ఉండాలనే ఉద్దేశ్యంతో శంకరయ్యగారి కోడలు పట్టుబట్టి నేర్పించడంతో మనుమలిద్దరికి తెలుగు వ్రాయడం చదవడం కూడా బాగానే వచ్చును. చైతన్య దీపిక ఎంతో చురుకైన పిల్లలు. భాష తెలిసి ఉండటంతో సహజంగా స్నేహశీలులైన ఇద్దరూ కాలనీలో పిల్లలందరితో త్వరలోనే స్నేహం కట్టేశారు.

మంచి తెలివి తేటలు , గ్రహింపు శక్తి , విచక్షణా జ్ఞానం కలిగి ఉండటమే కాకుండా ప్రపంచ జ్ఞానం కూడా బాగా ఉన్న వాళ్ళు చైతన్య దీపిక. కాలనీలో అన్ని విషయాలూ ఎంతో బాగా నచ్చాయి కానీ ఒక విషయం మాత్రం పిల్లలకు ఆశ్చర్యము బాధ కూడా కలిగించాయి అదేమంటే కాలనీలో నీటి వాడకం పట్ల చూపబడుతున్న అలక్ష్యం దీనికంతటికి కారణం ముఖ్యంగా అందరూ ధన వంతులే కావడం పైగా పోటీలో ఎలాగైనా తామే గెలవాలనే ఉద్దేశ్యంతో మోటార్లు పని చేయనప్పుడు కూడా డబ్బు వెదజల్లి ఎడా -పెడా నీటి ట్యాంకర్లు తెప్పించుకుని మరీ ప్రాంగణాలు కార్లు శుభ్రం చేసేస్తుండటమే అనిపించింది పిల్లలిద్దరికి!!!

ఒకనాడు దీపిక గ్లాసులో మంచినీళ్లు పట్టుకుని సగం త్రాగి వదిలేసింది. అది చూసిన శంకరయ్యగారు “అదేమిటమ్మ దీపికా అలా నీళ్ళు వృధా చేయటం తప్పుకాదా? అవి కూడా త్రాగేసేయి “ అని కోప్పడ్డారు. ఒకసారి అన్నగారి కేసి చూసి దీపిక మిగిలిన నీళ్ళు కూడా త్రాగేసి అక్కడినించి మాట్లాడకుండా వెళ్లిపోయింది.

అంతా చూస్తున్న చైతన్య మాత్రం “ మీరందరూ పోటీల పేరుతో ఎంతో నీరు వృధా చేస్తున్నారు , అది తప్పుకాదా తాతగారు?”

అని అడుగుదామని నోటిదాకా వచ్చినా పెద్దవారితో వాదనలెందుకని అప్పటికి మౌనంగా ఉండిపోయాడు.

ఆ రోజు సాయంత్రం పార్కులో పెద్దలందరూ చేరి ఇష్టాగోష్టి చేస్తుండగా "రావుగారింట్లో బోరుబావిలో నీరు రావడం లేదుట" అన్నారు వారిలో ఒకరు.

"అవును నేను కూడా విన్నాను . ఇదే సమస్య రాఘవయ్యగారింట్లో కూడా వచ్చిందట" ఇంకొకరి ఉవాచ.

ప్రక్కనే ఆడుకుంటున్న చైతన్య దీపిక వీరి మాటలు వింటూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని "మనం ఊహించిన ఉపద్రవం రానే వచ్చింది" అనుకున్నారు.

"అమ్మయ్య అయితే మనకి పోటీలో ఇద్దరు తగ్గారన్నమాట " అని ఎవరో అనడం విన్న పిల్లలిద్దరూ అవాక్కయ్యారు. ఇలాంటప్పుడు కూడా వీళ్ళు తమకు పోటీలో ఇద్దరు తగ్గారనే సంతోషిస్తున్నారు తప్ప ముందు పొంచి ఉన్న ప్రమాదం గురించి ఆలోచనే లేదా? బోరుబావులలో నీరు కూడా ఇంకిపోతే వాడకానికి కూడా నీరు దొరకకుండా అయిపోతుందని ఇంతమంది పెద్దలలో ఒక్కరికీ అనిపించటం లేదా? లేదా ట్యాంకర్లలో తెప్పించుకుని వాడుకుందాములే అనే భరోసాతో ఉన్నారా అందరూ?" అనుకుని ఎంతో బాధపడ్డారు .

'ఈ పరిస్థితి మారాలి , అందుకు మనమే ఏదైనా చేయాలి ' అనుకున్నారు తదనంతరం చైతన్య దీపికలు.

ఆ మర్నాడు శంకరయ్యగారి ఇంట్లో అందరూ రాత్రి భోజనాలయ్యాక హాలులో సమావేశమై కబుర్లు చెప్పుకోసాగారు. మనుమలతో కబుర్లు చెపుదామని వాళ్ళకేసి చూసిన శంకరయ్యగారికి మాత్రం చైతన్య దీపిక ఎంతో శ్రద్ధగా టి. వి. చూస్తుండటం గమనించారు.

'ఏం చూస్తున్నారో పిల్లలు?' అని ఆయనా అటువైపు చూడగా తెలుగు వార్తలు చూస్తున్నారు ఇద్దరు. సరేలేమ్మని ఆయన చిన్న మనుమరాలితో ఆడుకోవడంలో నిమగ్నమైపోయారు. కాని వార్తలలో చూపించిన ఒక విషయం మాత్రం పిల్లలిద్దరిని ఎంతో ఆకట్టుకుంది. 'అవును మనం ఇలా చేస్తే బాగుంటుంది' అనుకుని మర్నాడు స్నేహితులందరితో సమావేశమై సమాలోచన చేసి ఒక నిర్ణయానికి వచ్చారు..........

ఆ రోజు ఆదివారం కావడంతో పెద్దలందరూ తీరుబడిగా లేచి కాఫీ తాగుతూ ఎవరిళ్ళల్లో వారు వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ఇంతలో బయట ఏదో కోలాహలం. అది తాముండే వీధిలోనే కావడంతో 'ఏమిటో' అని శంకరయ్యగారి కుటుంబసభ్యులందరూ బిల బిల మంటూ బయటకి వచ్చారు.

కాలనీలో పిల్లలందరూ ఒక గుంపుగా ఏర్పడి నినాదాలు చేసుకుంటూ వస్తున్నారు. ప్రతి ఒక్కరి చేతిలో నినాదాలు వ్రాసి ఉన్న ఒక్కొక్క ప్లాకార్డు (ప్రకటన పత్రిక) ఉంది . పిల్లల నినాదాలేమిటా అని చెవులు రిక్కించి కొంతమంది విందామని ప్రయత్నిస్తుంటే , మరి కొంతమందేమో వాళ్ళ చేతులలోని ప్లాకార్డులలో ఏమి వ్రాసి ఉందా అని పరికించి చూడసాగారు.

"పోటీల పేరుతో విలువైన నీటిని వృధా చేయ వద్దు"

"బోరుబావులను అధికంగా వాడటం వలన నీటి పట్టిక తగ్గిపోయే ప్రమాదం ఉంది"

"ఇంటింటికి ఇంకుడు గుంటలను త్రవ్వి నీటిని వృధా పోనీయక జాగ్రత్త పరుచుకోవాలి"

"ఇంకుడు గుంటల వలన భూమిలో నీటి పట్టిక పెరిగి భవిష్యత్తులో నీటి ఎద్దడి రాకుండా ఉంటుంది".........ఇలా సాగుతున్నాయి వాళ్ళ నినాదాలు.

పిల్లలు నినాదాలు చేయడంతో పాటుగా ప్రతి ఇంటిలోనూ నీటిని పొదుపుగా వాడే పద్ధతులను తెలియజేసే కరపత్రాలు పంచిపెట్టడం, గేటుకు 'ఇంకుడు గుంట త్రవ్వండి ' అని వ్రాసి ఉన్న ఒక బోర్డును వ్రేలాడదీయడం చేయసాగారు. ఆ పనిలో పిల్లలకి సహాయపడుతూ కాలనీ తోటమాలి , కాపలాదారుడు ఉండటం అందరూ గమనించారు. ఆ గుంపుకి నాయకత్వం వహిస్తూ ఇద్దరు పిల్లలు ముందు నినాదాలు చేస్తూ నడుస్తుంటే మిగిలిన పిల్లలు తిరిగి అదే నినాదం చేస్తూ వెనుకగా వారిని అనుసరిస్తున్నారు .

'నాయకత్వం వహించిన పిల్లలు ఎవరా?' అని పరికించి చూసిన శంకరయ్య పార్వతమ్మగార్ల ఆశ్చర్యానికి అంతులేదు !!! వాళ్ళు తమ మనుమడు చైతన్య , మనుమరాలు దీపిక!!

అప్పుడు శంకరయ్యగారికి ఆ రోజు తన మనుమలిద్దరూ వార్తలలో అంత సుదీర్ఘంగా చూసిన విషయమేమిటో తెలియవచ్చింది . నిజానికి నీటిని వృధా చేసే ఈ పోటీలకి శంకరయ్యగారు మొదటినించే వ్యతిరేకి. ఎన్నో సార్లు ఆయన ఈ విషయంమై అందరినీ హెచ్చరించడానికి ప్రయత్నించినా అందరూ పెడచెవిని పెట్టడంతో చెప్పి చెప్పి విసిగిపోయి ఆయన కూడా వదిలివేశారు. అదే విషయాన్ని ఈనాడు తన మనుమలు ఆకళింపు చేసుకుని ఇలా అమలు చేయడం ఆయనకి ఎంతో సంతోషాన్నిచ్చింది. కనీసం ఇప్పటికైనా ఈ కాలనీ వాళ్ళకి జ్ఞానోదయమైతే అంతే చాలుననుకుంటూ మళ్ళీ పెద్దగా నినాదాలు వినరావడంతో ఆలోచనలలోంచి బయట పడ్డారు శంకరయ్యగారు. ప్రత్యేకంగా మనుమలిద్దరి దగ్గరకు “నేను ఎప్పటినించో చెడామనుకుంటున్నది మీరు ఇవాళ చేసి చూపించారర్రా “ అంటూ వాళ్ళని భుజం తట్టి అభినందించారు.

“థ్యాంక్స్ తాతగారు” అని ఆ రోజు ఆయనను అపార్థం చేసుకున్నందుకు మనసులోనే ఆయనకు క్షమార్పణలు చెప్పుకున్నారు వాళ్ళు.

“చిన్న పిల్లలైనా నీటి పొదుపు గురించి ఎంత చక్కటి మాటలు చెప్పారు . పెద్దవాళ్ళకి ఈ విషయమై కనువిప్పు కలుగజేయడానికి ఎంత సున్నితమైన మార్గం ఎన్నుకున్నారు?” అనుకుని వాళ్ళ సూచనలను తు.చ. తప్పకుండా అమలు చేస్తామని పెద్దలందరూ వాగ్దానం చేశారు.

అంతే కాకుండా తక్షణమే పోటీలను రద్దుచేస్తున్నట్లు అందరికీ తెలియజేశారు. కానీ ఆరోగ్యారీత్యా కాలనీ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవడానికై సాధ్యమైనంతవరకు తక్కువ నీటిని వినియోగించాలని నిర్ణయించుకున్నారు. అలాగే ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలనే పిల్లల సూచనని అంగీకరిస్తూ ఆ పర్యవేక్షణ బాధ్యత అంతా శంకరయ్యగారికి ఒప్పగించారు.

ఈ పిల్లలు నిజంగా చైతన్య దీపికలే అంటూ కాలనీలో అందరూ ఇంత చక్కటి ఆలోచన చేసిన వాళ్ళని వేనోళ్ళ శ్లాఘించారు.




స్కూల్ టైమైంది. పిలల్లంతా భుజాలకు బ్యాగులు తగిలించుకుని గబగబా నడుస్తూ వెళుతున్నారు. ఉన్నట్లుండి ఆగుంపులో నడుస్తున్న నరేష్ ఏదోవినిపించినట్లై ఆగిపోయాడు.” ఏమైందిరా! అలా ఆగిపోయావ్ ?రా రా ! టై మవుతున్నది" అంటూ వెనక్కు చూశాడు శాయి."ఒరే శాయీ ! నా బ్యాగ్ కూడా పట్టుకుని నడుస్తుండరా! నేను ఐదు నిముషాల్లో మిమ్మల్ని కలుస్తాను." అంటూ మెడకు తగుల్చుకుని ఉన్న స్కూల్ బ్యాగ్ తీసి శాయికి అందిం చాడు. "ఒరే నరేష్ పాస్ కెళ్ళాల్సి ఉంటే త్వరగా వెళ్ళిరారా! ఈ రోజు నుంచి పరీక్షలు మొదలవు తున్నా య్! లేటైతే సార్లు పరీక్ష రాయనివ్వరు.జల్దీ వచ్చెయ్ !" అంటూ తన గుపులో కల్సి ముందుకు సాగాడు శాయి.

అంతా స్కూల్ చేరారు. ఫస్ట్ బెల్లైంది.సెకండ్ బెల్లైంది.ఎంతకూ నరేష్ రాలేదు. శాయికి కంగారెక్కువైంది.హాజర్ కూడా తీసేసుకున్నారు సార్ గారు. తెల్లకాయితాలు ఇచ్చేశారు. మూడో బెల్ ఐంది. ప్రశ్నాపత్రాలు ఇవ్వ సాగారు. ఇంతలో వగర్చుకుంటూ వచ్చాడు నరేష్ . "మే ఐ కమిన్ సర్ !" అంటూ వినయంగా నమస్కరించాడు.

"ఏరా పరీక్ష రోజైనా త్వరగా రావాల్ని తెలీదా! హాజర్ పట్టీలో ఆబ్ సెంట్ పడింది. వెళ్ళి పెద్దసార్ గార్ని పర్మిషన్ తీసు కురా! అప్పుడే పరీక్షరాయనిచ్చేది."అంటూ ప్రశ్నాపత్రాలు పంచడంలో మునిగిపోయాడు సార్.

నరేష్ పెద్దసార్ ఆఫీస్ రూం ముందు కెళ్ళి నిల్చుని " మే ఐ కమిన్ సర్ " అని నమస్కరించాడు. ఆయన తలెత్తి నరేష్ ను చూసి " ఎస్ .ఏంకావాలి? " అని అడిగారు. "సర్ ఆలస్యం గావచ్చాను ఇప్పుడే, పరీక్ష రాయాలంటే మీ పర్మిషన్ అడగమన్నారు సర్ గారు." అని మెల్లిగా చెప్పాడు .

పెద్దసార్ తలెత్తి వాడికేసి చూశాడు.యూనిఫాం చొక్కా తడిసి ఉంది.ముఖం గాబరాగాఉంది."ఏరా! ఏంచేశావు ఇంత సేపూనూ? సమయం తెలీలేదా? లేక పరీక్ష సంగతి మర్చిపోయి ఇంతసేపూ ఆడుకుంటూ ఇప్పుడు గుర్తొచ్చి వస్తున్నావా?" అని అడిగారు ఆగ్రహంతో.

"లేదు సార్! నేను వచ్చేదార్లో ..."అంటూ వాడు జరిగిందంతా చెప్పాడు.ఆమాటలు వింటూ పెద్దసార్ తన కుర్చీలోం చి లేచి వాడిదగ్గరగా వచ్చారు. అంతావిన్నాక భుజంతట్టారు. " సరే పద "అంటూ వాడి తరగతి గది దగ్గరకు వచ్చా రు.ఆయన్ని చూసి గదిలో పరీక్ష నిర్వహిస్తున్న సార్ వచ్చారు." ఈ నరేష్ కు ప్రశ్నాపత్రం ఇవ్వండి, నేను హాజరు వేస్తాను. పరీక్షయ్యాక అంతా అసెంబ్లీ హాల్లో హాజరవండి. మాట్లాడాలి. నరేష్ వెళ్ళి పరీక్షరాయి." అని చెప్పి వెళ్ళి పోయారు. పరీక్ష పూర్తైంది . అంతా భయభయంగా అసెంబ్లీ హాల్లో కొచ్చారు. పిల్లలకంతా భయంగానే ఉంది. పెద్ద సార్ ఏం కోప్పడతారో అని. పెద్దసార్ వచ్చారు." పిల్లలూ! మీరంతా కూడా నరేష్ లాగా ఉండాలి. ఈరోజు వాడు పరీక్షకు ఎందుకు ఆలస్యంగా వచ్చాడో తెల్సి నేను ఆశ్చర్యపోయాను.

మునిసిపాలిటీ వారు నీరు వీధి ట్యాప్స్ కు ఉదయం ఆరుకే వదులుతుంటారు . ఈరోజు ఆలస్యంగా వదిలారు. అప్పటికే నీటికోసం ట్యాప్స్ త్రిప్పేసి, నీరు రాక పోడంతో వాటి నలాగే వదిలేసి , నీరు వస్తే ఆశబ్దానికి రావచ్చని ఎవరో వెళ్ళిపోయారు.నీరు వదలగానే ట్యాప్స్ లోం చి నీరు క్రిందికి కారే శబ్దం నరేష్ విన్నాడు. వెంటనే ఒక బాధ్యతాయుత పౌరునిగా తన స్కూల్ బ్యాగ్ స్నేహితునికి ఇచ్చేసి , అతడు వరుసగా తిప్పేసి ఉన్న పది ట్యాప్స్ ఆపేసుకుంటూ ఆకాలనీ అంతా తిరిగాడు .అతది యూనిఫాం షర్ట్ తడిసిపోయినా లెక్కచేయలేదు. అంతేకాక అక్కడ ఒక చెట్టుక్రింద పడి ఉన్న ఒక ముసలవ్వకు నీరు పట్టి దాహం తీర్చాడు.అక్కడే చెట్టుక్రింద దాహంతో నాలిక తెరుచుకుని స్పృహ లేక ఉన్న ఒక ఆవుకు నీరు పోసి కాపా డాడు. ప్రాణాధారమైన నీరు వృధా కానివ్వక పోడమే కాక ఆప్రాణాధారమైన నీరు తెచ్చి అందించి ఇరువురి ప్రాణాలు కాచాడు మన పన్నెండేళ్ళ నరేష్. ఇంత చిన్నవయస్సులో సమాజం పట్లా, తోటి జీవులపట్లా , ప్రకృతి సంపద పట్లా తన బాధ్యత తెల్సుకుని ప్రవర్తించాడు, ఇతడు మన బళ్ళో చదవడం మనకు గర్వకారణం. ఈ మండే వేసవిలో నీరు వృధాచేయడం నేరం. మన నరేష్ నీటి శబ్దం దూరం నుంచే విని గమనించి వెళ్ళి ఇలా సేవచేయడం నిజానికి ఒక మంచి పౌరుని బాధ్యత. నరేష్ ! నీకు ఇలా చేయాలని ఎందుకని అనిపించింది బాబూ!"అని అడిగారు పెద్దసార్.

" సార్ ! నీటి బొట్టు విలువ నాకు బాగాతెల్సు. మా ఇంట్లో నీరులేక మేము ఒకే బకెట్ నీళ్ళతో తలా రెండు చెంబు లతో ఒళ్ళుతడుపుకుని స్నానం చేస్తాం .ఒక్కోమారు త్రాగను నీరులేక చాలా ఇబ్బంది పడుతుంటాం. మా అమ్మ ' ఎక్కడ కొళాయి నీరు పోతున్నా ఆపేసి వెళ్ళు బాబూ !' అని ,మానాయనగారు "నీరులేక ఎన్నో ప్రాణాలు పోతు న్నాయ్ ,నీరు వృధా

కానీయరాదు.'అని చెప్పారు. మా ఆంగ్ల ఉపాధ్యాయులు ఒక ఆంగ్లపద్యం చెప్పారు .దాని అర్థం చిన్న నీటిబొట్లు , చిన్న ఇసుక రేణువులే బ్రహ్మాండమైన సముద్రంగా మారాయని. Little drops of water – little grains of sand make a mighty ocean - చిన్న నీటి బొట్టును కూడా వృధాచేయకూడదని మా సార్ చెప్పారు. అందుకని నేను తల్లి తండ్రి గురువులు చెప్పిన మాటలు దైవ వాఃక్కులుగా భావించి ఎక్కడ నీటి చు క్క వృధా అవుతున్నా చూస్తూ ఉండలేను. ఆ చిన్న నీటి చుక్కలన్నీ కలిసి చెరువుగా, నదిగా సముద్రంగా మార టం నాకళ్ళకు కనిపిస్తుంటుంది." అని చెప్పగానే అంతా కరతాళ ధ్వనులు చేసారు. -




“ ఇంకా ఆ పల్లెటూరిలో ఇల్లు, భూములు దేనికి నాన్నా... అయిన కాడికి అమ్మేయండి ...ఇప్పుడు ఏవో సెజ్ ల కోసం భూములు సేకరిస్తున్నారు కదా! వాటికి ఇచ్చేయ రాదూ! మంచి రేటే వస్తోంది కూడా...అమరావతి రాజధాని అవుతూంటే భూముల ధరలకి రెక్కలొస్తున్నాయసలే ...మన వాటికి కూడా మంచి ధర పలక వచ్చు...ఏమంటారు?” అమెరికా నుంచి ఫోన్ చేసిన పెద్ద కొడుకు ప్రవీణ్ ఎప్పటి లాగానే పాత పాటే పాడి ఊదర గొడుతూ ఉంటే ‘అలాగేలేరా...చూద్దాం ...” అంటూ చిరు నవ్వు నవ్వాడు పుణ్య మూర్తి .

“ఇప్పటికి ఎన్నో సార్లు మీరీ విషయం చెప్పారు...మీ నాన్న గారు ఏమన్నా స్పందించారా? వృధా ప్రయత్నం కాక పోతేనూ!” పక్క నుంచి కోడలు సన్నాయి నొక్కులు నొక్కడం స్పష్టంగానే వినిపించింది పుణ్య మూర్తికి .

“చూద్దాం కాదు నాన్నా…మళ్ళీ మేమొచ్చేసరికి అమ్మకం జరిగిపోవాలి. తమ్ముడు ,చెల్లి కూడా ఇదే చెప్పమన్నారు.’’ కాస్త గట్టిగా చెప్పేసి ఫోన్ కట్ చేశాడు ప్రవీణ్.

పుణ్యమూర్తి మనసు చివుక్కుమంది. అలా వాళ్ళు ఆర్డర్స్ పాస్ చేయడానికి అదేమీ తాతలనాటి ఆస్తి కాదు. తన స్వార్జితం. తండ్రి తనకిచ్చిన రెండెకరాల పొలాన్ని తన కష్టంతో పదెకరాలు చేశాడు. ఈలోపు పిల్లలు ఎదిగొచ్చారు .వాళ్ళ చదువులకోసం పట్నంబాట పట్టక తప్పలేదు.

పల్లెలో ఆపొలాన్ని కామరాజుకి కౌలుకి ఇచ్చాడు. ఆయిల్లు కూడా అతడినే వాడుకొమ్మన్నాడు . పాపం ! గత ఇరవై ఏళ్లుగా వాటి మంచిచెడ్డ అతడే చూసుకుంటున్నాడు. తన ఖర్చులకి గాను కొంత డబ్బు తీసుకుని మిగతా సొమ్మును తన బాంక్ అకౌంట్ లో జమ చేస్తున్నాడు.

అలాంటిది ఇప్పుడు ఉన్నట్లుండి భూములధరలు పెరిగాయని వాటిని అమ్మేస్తే బంగారం పండే పొలాలు బీళ్ళు అయిపోవడమే కాకుండా వాటినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కామరాజు, అతడి కుటుంబం వీధిన పడతారు.

ఈ పిల్లల పంతం కాకపోతేనూ …వాళ్లకి ఆపొలాలు అమ్మేయాలన్న పట్టుదల దేనికో ! వాటిని అమ్మేస్తేగాని తమకి జరగదు అన్న బాధలేదు . ఒక్కొక్కళ్ళూ విదేశాలలో స్థిరపడి డాలర్స్ పండిస్తున్నారు. ఆ పంటలతో ఇండియాలో స్థిరాస్తులు సమకూర్చుకుంటున్నారు. బంగారాలు కొనుక్కొని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకుంటున్నారు .

ఇంకా డబ్బు కూడబెడదామన్న తాపత్రయం దేనికి ! పోయేటప్పుడు వెంటరావని తెలిసినా మనుషులకి ఈ భవబంధాల మీద, భోగభాగ్యాల మీద మమకారం నశించదు ఎందుకో! ప్రతివాళ్ళు ఎంతో కొంత కూడబెట్టి వారసులకి మిగిల్చిపోదామని ఆరాట పడేవారే .

వేదాంతధోరణి తొంగిచూసింది పుణ్యమూర్తి లో.

“ఎవరూ! పెద్దాడేనా ఫోను! ’’వంటింట్లోంచి చేతులు తుడుచుకుంటూ వచ్చింది కమల.

అవునన్నట్లుగా తలూపాడు పుణ్యమూర్తి.

"ఏమంటాడు?"

"ఏముంది!పాతపాటే!" విసుగ్గా చెప్పాడు పుణ్యమూర్తి.

"మీకు మాత్రం అంత పట్టుదల దేనికండీ. మన తరువాత ఆ పొలాలు అన్నీ చెందవలసింది      వాళ్ళకే కదా! అప్పుడు మాత్రం వాళ్ళు వాటిని అమ్మి సొమ్ము చేసుకోరని గ్యారంటీ ఏమిటి? అదేదో మనం బతికుండగానే చేసామనుకోండి ...వాళ్ళు కూడా సంతోషిస్తారు కదా!" మాతృప్రేమ గంగలా ఉప్పొంగింది కమలలో.

"వాళ్ళ సంతోషం కోసం నన్ను నమ్ముకున్న మనుషులకి అన్యాయం చేయలేను. నీకు మాత్రం తెలియదా! మనం పొలం, ఇల్లు అమ్మేసి ఇచ్చిన సొమ్ము వాళ్లకి సముద్రంలోకాకిరెట్ట తో సమానం అని.నేను బతికున్నన్ని నాళ్ళు కూడా వాటిని అమ్మే ప్రసక్తి లేదు " కాస్త కోపంగా అన్నాడు పుణ్యమూర్తి.

"హు(...నేను చెప్పినమాట మీరు ఎప్పుడూ విన్నారు కనుక!" మూతి ముడుచుకుని లోపలికి పోయింది కమల.

తల్లిప్రేమతో కమల తనకి ఎదురుచెప్పిందే కాని, వాస్తవం ఆమెకి మాత్రం తెలియదా ఏం! ...భారంగా నిట్టూర్చి చేతిలోని భగవద్గీతపైకి దృష్టి సారించాడు పుణ్యమూర్తి.

-----------------                    --------------------------------
--------------------------

"ఛీ...ఛీ... ఒకటే ఉక్కపోత...ఒకటే ఎండలు! ఈ సమ్మర్ లో మీ చెల్లి పెళ్లి      పెట్టినందుకు మీ బాబుని అనాలి ! హాయిగా డిసెంబర్ లో పెట్టి ఉంటే ఎంజాయ్ చేసి ఉండేవాళ్ళం." చిరాగ్గా అన్నాడు ప్రవీణ్.

"బాగుంది ! మనకి కావాల్సినప్పుడు ముహూర్తాలు కుదరద్దూ! ఆ అబ్బాయి కూడా మీలాగా ఆత్రం పెళ్లికొడుకే! ఈనెలలోపెళ్లి

చేసుకుని ,పెళ్ళాన్ని వెంట పెట్టుకుని అతను కూడా అమెరికా వెళ్ళిపోతాడుట! అందుకే ఇంత అర్జెంట్ గా చేయాల్సివచ్చింది." తానూ కూడా తగ్గకుండా చెప్పింది అతడి భార్య.

"ఎలాగర్రా పిల్లలూ అలా విసుక్కుంటే... మీకోసం మీ నాన్న ఖర్చుకి వెనకాడకుండా మూడు బెడ్ రూముల్లోను ఏసీ లు పెట్టించారు. అయినామీరు ఈ సుఖాల మధ్యనే పుట్టి పెరిగారా ఏమిటి! కష్టం సుఖం, ఎండ వాన అన్నింటికీ ఓర్చుకుంటేనే మనిషి..." మృదువుగా అంది కమల.

"ఆయనతో చేరి నువ్వు కూడా వేదాంతం వల్లించడం నేర్చావమ్మా ...చెప్పడానికి అన్నీ బాగానే ఉంటాయి...!మా బాధ నీకేం తెలుసు !" ఎండవేడిని తట్టుకోలేని చిన్నకొడుకు నవీన్ చిన్నగా కసురుకున్నాడు.

అతడు కూడా అత్తవారివైపు వాళ్ళ పెళ్లి ఏదో ఉంది అంటే కుటుంబంతో సహా దిగాడు.

"అయినా ఏసి అంటే పెట్టించారు కాని, పవర్ ఎక్కడినుంచి తెస్తారు?" తానూ మాట్లాడాను అనిపించుకోవడానికి పెదవివిప్పింది కూతురు కుందన.

తమ కడుపున పుట్టి తమని ఏమీ తెలియనివాళ్ల లా అలా తీసి పారేయడంతో కమల మనసు నొచ్చుకుంది. ఆ కోపం అంతా దేనికో ,ఆకస్సుబుస్సులు ఎందుకోసమో! అర్ధం అయిన పుణ్యమూర్తి గుంభనగా నవ్వుకున్నాడు.

"మీరు మీరొచ్చిన శుభకార్యాలకి హాజరు అవడానికి ఇంకా వారం రోజుల టైం ఉంది. ఈలోపు సరదాగా అలా మన ఊరు వెళ్లి వద్దామా!" అడిగాడు బిడ్డలని ఉద్దేశ్యించి.

"ఎందుకూ! ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉంటేనే ఉండడం చాలా ఇరిటేటింగ్ గా ఉంది. కనీసం ఒక రెండు మూడు గంటల తర్వాతనన్నా పవర్ వస్తుంది అన్న గ్యారంటీ ఉంది. అక్కడేముంది! ఒకవేళ పవర్ పోతే ఎప్పుడొస్తుందో! ఏమిటో కూడా తెలియదు." ప్రవీణ్ ఖండించాడు .

"అవునురా అన్నయ్యా,,,పెనం మీదనుంచి పొయ్యిలో పడినట్లుంది వ్యవహారం." హేళనగా నవ్వింది కుందన.

“మరేనమ్మా! ‘’ వదినలు వంతపాడారు.

ఏ మాత్రం చిన్నబుచ్చుకోలేదు పుణ్యమూర్తి. తనని అనే హక్కు వాళ్లకి తప్ప ఇంక ఎవరికీ ఉంటుంది అన్నట్లుగా చిరునవ్వు నవ్వాడు.

“అలాకాదర్రా... నామాట వినండి. మనూరు వెళ్దాం . మీకు నచ్చకపోతే వెంటనే వచ్చేద్దాం. పిల్లలకి కాస్త ఆటవిడుపు గా ఉంటుంది. కాస్త ఈ పొల్యూషన్ కి దూరంగా తీసుకెళ్ళినట్లుగానూ ఉంటుంది. వాళ్ళ నాన్న, చిన్నాన్న అత్త పుట్టి పెరిగిన ఆపల్లెలను వాళ్ళనూ చూడనీయండి మరి!’’ నెమ్మదిగా అనునయించే ధోరణిలో చెప్పాడు పుణ్యమూర్తి.

ఏమనుకున్నారో మరి కాదనలేదు వాళ్ళు. పిల్లలందరూ కూడా గంతులేయనారంభించారు. అందరూ కార్లలో పల్లెదారి పట్టారు.

వచ్చిన దగ్గరనుంచి పచ్చిగాలి వాసన తగలక అల్లాడిపోతున్నారో ఏమోగాని...పిల్లలు, పెద్దలు ఆ ప్రయాణాన్ని ఎంజాయ్ చేయనారంభించారు.

“అదృష్టం కొద్దీ మన ఊరికి ఇంకా పల్లె లక్షణాలు మిగిలే ఉన్నాయి.డబ్బు మీద ఆశతో పచ్చని పంటపొలాలని ఈ సెజ్ లపేరిట బీళ్ళుగా మార్చేస్తున్నారు. అందరూ అలా తమ భూములని అమ్మేసుకుంటే మనం తినేందుకు తిండి ఎక్కడనుంచి వస్తుంది! మీరంతా చదువుకున్నవారు. గ్లోబల్ వార్మింగ్ గురించి అవగాహన ఉన్నవారు.

ఇలా అభివృద్ధి కోసం అడవులు ఆక్రమించుకుని , చెట్లను నరుక్కుంటూ పోతే కొన్నాళ్ళకి ఈ ప్రపంచంలో పచ్చదనం అన్న పదమే వినబడదు. మొత్తం భూమండలమంతా ఉష్ణ తాపానికి విలవిలలాడిపోతుంది. ఒక పాతికేళ్ళ క్రిందట వేసవి కాలం ఎలా ఉండేది. మామిడిపళ్ళ తీయదనాన్ని, మల్లెల సౌరభాలని ఆస్వాదిస్తూ ఎంతో ఆనందంగా గడిచేది. కాని, ఇప్పుడు విపరీతంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో , అగ్నిగుండాన్ని తలపింపచేసే భూతాపంతో , బయటకు రావడానికి కూడా భయపడుతూ గడుపుతున్నాం.

ఇది ఆహ్వానించదగ్గ పరిణామమేనంటారా? నాకు వ్యతిరేకంగా ఆలోచించకుండా చదువుకున్న వాళ్ళుగా కాస్త ఆలోచించి చూడండి.’’ మెత్తగా సాగుతున్న పుణ్యమూర్తి మాటలు పిల్లలను నొరెత్తనీయలేదు.

మనసులో మాత్రం “అబ్బ ! ఈయనగారేమిటి ...ఇలా లెక్చర్ దంచుతున్నాడు ...’’ అనుకున్నారు .

అలా కబుర్ల మధ్యన, పిల్లల కేరింతల నడుమ ఊరు చేరారు వాళ్ళు. వీళ్ళు వస్తున్నారన్న మాట ముందే తెలియడం వలన కామరాజు ఘనస్వాగతం పలికాడు.

దాదాపు ఒక ఐదువందల గజాల స్థలంలో కట్టబడి ఉన్న పాతకాలపు పెంకుటిల్లు అది. ఇంటిచుట్టూ అనేక రకాల ఫలవృక్షాలు , పూలచెట్లు పెంచబడి ఉన్నాయి. బయట ఎండ మండిపడుతున్నా అక్కడమాత్రం హిమవంతంలాగా అతి శీతల వాతావరణం నెలకొని ఉంది. అదంతా అక్కడ ఉన్న చెట్ల మహాత్మ్యం వల్లనే అని వేరే చెప్పక్కర లేకుండా అర్థం చేసుకున్నారు అందరూ.

ఇల్లు పాతకాలం నాటిదే అయినా నిరంతరం కనిపెట్టుకుని ఉండి మరమ్మత్తులు అవి చేయిస్తూ ఉండడం మూలాన కొత్తగానే కనిపిస్తోంది. పట్నంలో ఇరుకిరుకు గదులలో జీవితం గడపడానికి అలవాటు పడిన వాళ్లకి విశాలంగా, స్వేచ్ఛగా మసలడానికి వీలుగా ఉన్న ఇల్లు ఎంతో సౌకర్యవంతంగా అనిపిస్తోంది.

దానికి తోడు కామరాజు దంపతుల ఆదరణ, ఆతిథ్యం వాళ్లని మరింత ఆనందిపజేశాయి. ఎరమరికలు లేని వాళ్ళ ఆప్యాయత, కల్మషం లేని వారి ప్రేమాభిమానాలు పుణ్యమూర్తి కుటుంబాన్ని రంజింపచేశాయి. మామిడితోటలు, పొలాలు అన్నీ చూసి చిన్నపిల్లలతో సమానంగా అల్లరిచేశారు పుణ్యమూర్తి పిల్లలు.

తాటిముంజెలు, మామిడిపళ్ళ మజాని మనసారా అనుభవించారు పిల్లలు, పెద్దలు తేడాలేకుండా.పూర్వంలా పల్లెలకి పవర్ కట్ అంతగా లేదు. కాని, పవర్ ఉందో…పోయిందో కూడా తెలియలేదు వారికి ఆచల్లని వాతావరణంలో. పట్నంలో లాగానే ఇక్కడ కూడా వడగాలులు వీస్తున్నా… ఆ బాధ తెలియడంలేదు వారికి .కారణం ఆ ప్రాంగణం అంతా పచ్చనిచెట్లతో నిండి ఉండడమే అని గ్రహించారు వారు.

'వృక్షో రక్షతి రక్షితః' అన్న మాటలకి అర్థం తెలిసింది వారికి. తండ్రి ఆవేదన కూడా అర్థం అయ్యింది. ఏ ఏసిలు కూడా ఇవ్వలేనంత చల్లదనాన్ని అందిస్తున్నాయి ఆ వృక్షరాజాలు.

ఒకరోజు కూడా ఉండడానికి ఇష్టపడకుండా ఆపల్లెకి రావడానికి సైతం వెరచిన వాళ్ళు, తిరుగుప్రయాణం ఊసే ఎత్తకుండా నాలుగురోజుల పాటు అక్కడే ఉండిపోయారు.

"మీ చెల్లి పెళ్లి కాబట్టి నువ్వు కావలిస్తే వెళిపో …నేను మాత్రం పెళ్లి వేళకి వస్తాను…" చెప్పేశాడు ప్రవీణ్ తన భార్యతో .

"బాగుంది వరస! ఇప్పటినుంచి నేను వెళ్లి మాత్రం ఏం చేస్తాను? సుఖానున్న ప్రాణాన్ని కష్టాన పెట్టుకోడానికి కాకపోతేనూ! నేనూ మీతోనే…" చెప్పేసింది ఆమె.

నవీన్- అతడి భార్య, కుందన - ఆమె భర్త అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అందరిదీ ఏకాభిప్రాయం కావడంతో మరి వేరే తలపే లేకుండా పోయింది.

"మమ్మల్ని క్షమించండి నాన్నగారూ…మీరు ఎంత ముందుచూపు తో ఆలోచించి ఈ ఇల్లు,భూములు అమ్మనన్నారో ఇప్పుడు అర్థమైంది .ఉన్నఊరు , కన్నతల్లి అని ఎందుకన్నారో ఇప్పుడు తెలుస్తోంది. మా అభిప్రాయం తప్పని తెలుసుకున్నాం.ఇప్పుడు

మీరు ఈ ఇల్లు, పొలాలు అమ్మడానికి సిద్ధపడినా మేము ఒప్పుకోము. ఇకమీదట ఇదే మా వేసవివిడిది. డాలర్ల వేటలో అలసిపోయిన మేము సేదతీరడానికి ఇంతకన్నా గొప్పప్లేస్ ఏముంటుంది ?

మీతదనంతరం కూడా కామరాజు మామయ్య కుటుంబం ఇక్కడే హాయిగా ఉండవచ్చును. మేము ఆయనకి ఏలోటూ రానివ్వము.'' తనముందు నిలిచి ముక్తస్వరం తో పలికిన పిల్లలను చూస్తూఉంటే పుణ్యమూర్తి దంపతుల కళ్ళు ఆనందంతో చెమర్చాయి.




"అంచాత నువ్వు వెంటనే వచ్చెయ్యాలన్న మాట.." అప్పటి కప్పుడే పావు గంటనుంచి ఫోనులో ఏవేవో నాకర్థం కాని విషయాలన్నీ మాట్లాడిన నా మేనల్లుడు రఘు చివరగా చెప్పిన ఆ వాక్యం మాత్రం నాకు బాగా అర్థమైంది.

"ఎలా కుదుర్తుందిరా అలా వెంటనే రమ్మంటే.. ఇక్కడేమైనా ఖాళీగా కూర్చున్నా ననుకుంటున్నావా?" కాస్త గొంతు పెంచాను.

"అబ్బ మావయ్యా.. ఓ నాల్రోజులు నువ్వక్కడ వుండక పోతే నీ ఊరేమీ వెనకబడి పోదు కానీ.. నువ్వు రాక పోతే ఇక్కడ లక్షల లక్షల నష్టం రావడం మాత్రం ఖాయం.."

నాకేం చెయ్యడానికీ తోచ లేదు. ఈ ఎండలకి భూమిలో నీళ్ళు మరీ పాతాళానికి పోయాయి.     అందు కోసం ఒక వైపు     పెద్ద మనుషులందరినీ కలిపి ఊళ్ళో వున్న ముఖ్యమైన కూడళ్ళలో బోరింగులు తవ్వే ప్రణాళిక వేస్తున్నాను. దాని పక్కనే ఇంకుడు గుంతలు యేర్పాట్ల కార్యక్రమం ఒకటుంది. మరో వైపు ఈ యేడు వర్షాలు చాలా కురుస్తాయని అందరూ చెప్తుండడంతో పల్లం లోకున్న వీధులను యెత్తు చేసి కంకర పోయిస్తున్నాను. లేకపోతే ఒక్క వర్షం పడగానే వీధులన్నీ చెరువులై పోతాయి. అది కాక వచ్చే నెల నుంచే ఊళ్ళో వున్న ప్రాథమిక పాఠశాలని మాధ్యమిక పాఠ శాల చెయ్యడం కోసం అధికారులను కలిసే సందర్భాలు వుండనే వున్నాయి. ఇవన్నీ కాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్‌ని వీలైనంత తొందరగా నియమించే పని అలాగే వుంది. నా చుట్టూ యిన్ని పనులు పెట్టుకుని ఇప్పుడు రఘు దగ్గరికి వెళ్ళాలంటే మాటలా!

"ఒరేయ్, నేను ఇప్పుడు ఊళ్ళోంచి కదల్లేను కానీ, నీ లాప్ టాపో ఏదో పట్టుకుని నువ్వే ఇక్కడి కొచ్చెయ్యి. నీ పనంతా అందులో వుంటుంది కదా.. ఇక్కడి కొచ్చి అందులో వివరాలన్నీ చూపించు. సరేనా!"

నాకు తెలుసు.. నా మేనల్లుడు ఆ లాప్ టాప్‌ని, ఐ పాడ్‌ని క్షణం వదల్డు. ఏ వివరాలు కావాలన్నా అందులో తల దూర్చేసి మొత్తం అడిగిన దాని చరిత్రంతా చెప్పేస్తాడు. అందుకే వాడొస్తేనే నయం. ఊళ్ళో నా పనులూ అవుతాయి, వాడు చెప్పదల్చుకున్నదీ తెలుస్తుంది.

"అబ్బా, మావయ్యా..నే చెప్పింది విన లేదా?     నేనొక్కడినే కాదు. నా ఫ్రెండ్స్‌తో కలిసి     నలుగురం ఈ ప్రాజెక్ట్ ప్లాన్ చేసాం." ఇంకా వాడి మాట పూర్తి కాకుండానే "అయితే వాళ్ళని కూడా తీసుకుని వచ్చెయ్యి.." అంటూ మరి వాడిని మాట్లాడనివ్వకుండా ఫోన్ కట్ చేసేను. వాడు ఇంతలా నా వెనకాల పడడానికి కారణం వాడి అమ్మ, మా అక్క అయిన వసుంధర. నిన్న రాత్రే అక్క నాకు ఫోన్ చేసి తన ఆతృతనంతా వెళ్ళ కక్కేసింది. ఈ సుపుత్రుడు నిక్షేపంలా చేస్తున్న ఉద్యోగం మానేసి, ఫ్రెండ్స్ తో కలిసి ఏదో బిజినెస్ చేస్తానని గొడవ పెడుతున్నాడుట. అసలదేం బిజినెస్సో, ముందు ముందు ఎలా వుంటుందోనని అక్కకి భయమేసి నాకు ఫోన్ చేసింది. "బావ గారేమన్నారక్కా.." అంటే.. "ఆయన కేం ఏమన్నా అంటారు.. కొడుకు మీద ఎంత ప్రేమంటే వాడు చెప్పిన మాటలు విని రోజుకో లక్ష సంపాదించి ఆయన ఒళ్ళో పోస్తాడన్నట్టు సంబర పడి పోతున్నారు. వాడేవంటున్నాడో నాకేవీ అర్థం కాటం లేదురా...నువ్వు కల్పించుకో పోతే లాభం లేదు." అని ఫోన్ పెట్టేసింది. అక్క అలా అడిగాక ఇంక కాదన గలనా..

ఇంతకీ వీడసలేం చెయ్యాలనుకుంటున్నాడూ అని నిన్నటి నుంచి ఆలోచిస్తుంటే ఇలా రఘూయే ఫోన్ చేసేటప్పటికి     ఇంక తప్పదని వాడినే రమ్మని చెప్పేసేను. చెప్పినట్టుగానే మర్నాడుదయానికే దిగి పోయేడు రఘు ముగ్గురు ఫ్రెండ్స్ తో కలిసి. నాకు చాలా సంతోషంగా అనిపించింది. మా ఊర్లోకి ఎవరైనా కొత్త మనుషులొస్తే నాకు ఎంతో ఆనందం. ఆ మట్టి వాసన, ఆ పైర గాలి, ఆ పచ్చ దనం. ఆ ఆప్యాయతలు అన్నీ వారికి మరీ మరీ రుచి చూపించి నా ఊరి పేరు చెప్పగానే ఆ వచ్చినవాళ్ళ మనసులో ఆనందం గుర్తు వచ్చేలా చెయ్యాలని నా ప్రయత్నం. అందులోనూ ఇప్పుడు వచ్చింది నా ముద్దుల మేనల్లుడయ్యె. అప్పటికి నేను పొద్దున్నే చెయ్య వల్సిన ముఖ్యమైన పనులు ముగించుకుని కూర్చున్నాను. రఘు ఫ్రెండ్స్ ప్రదీప్, శ్రీనివాస్, చంద్రశేఖర్ ముగ్గురూ

పల్లెటూళ్ళని చూడడం అదే మొదలనుకుంటాను, చుట్టూ కనిపిస్తున్న అందాలన్నింటినీ కళ్ళు విప్పార్చుకుని మరీ చూస్తున్నారు.

సూర్యోదయం అప్పుడే అయింది. కాని అప్పటికే పల్లె మొత్తం నిద్రలేచి పనిలో పడింది. నాలుగు రోజులై పుట్టిన లేగ దూడ అవ్వాయి తువ్వాయిగా తిరుగుతూ, మధ్య మధ్యలో వాళ్ళమ్మ దగ్గరికి పరుగెడుతూ పెరడంతా గంతులేస్తోంది. ఒక్కొక్క రేకూ విప్పుకుంటున్న పూ బాలలు హరుని పూజకు సిద్ధమన్నట్టు తలలూపుతున్నాయి. అప్పుడే దిగిన మామిడి పిందెలు కండ పట్టడానికి గాలి మేస్తూ వేలాడుతున్నాయి. మంద్రంగా గాలిలో తేలి వచ్చే మధురమైన సుప్రభాతం వీనుల విందుగా వుంది. కోవెల లోని ధ్వజ స్తంభానికి కట్టిన చిరు మువ్వల ధ్వని వీణా నాదంలా తోస్తోంది. ఆ ఆహ్లాద కరమైన ప్రకృతి సౌందర్యానికి మనసు పరవశించినట్టు తనువులు మరిచి నిలబడి పోయారు వాళ్ళు నలుగురూ..

వాళ్ళ కోసమని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాఫీ, టిఫిన్లకి సంబర పడి పోయారు అందరూ. కాస్త సర్దుకోగానే పని లోకి దిగి పోయాడు నా మేనల్లుడు రఘు.. ఎంతైనా నా మేనల్లుడయ్యె.. నా పోలికలు రాకుండా వుంటాయా అని గర్వ పడుతూ వాడు ఓపెన్ చేసిన లాప్ టాప్ విండో వైపు దృష్టి మరల్చాను. వాడూ, వాడితో వచ్చిన ఫ్రెండ్సూ కూడా వాళ్ల ప్రొజెక్ట్ నాకు అర్థం అయేలా చెప్పడానికి చాలా ఉత్సాహ పడి పోయేరు. ముందుగా రఘు ఓ వెబ్ సైట్ ఓపెన్ చేసి, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతిలో పరిసరాల సమ తుల్యతలో వచ్చిన తేడాలని గణాంకాలతో సహా చూపించాడు.

ఓజోన్ పొర పల్చ బడి పోవడం వలన ప్రకృతిలో కలుగుతున్న విష పరిణామాలను చూపించాడు. ఇలాగే జరిగితే ఇంకొన్నాళ్లకి ఋతువులలో వాటి వాటి పకృతి స్వభావమైన పరిణామం కనిపించదనీ, పోను పోను ప్రకృతిలో విపరీతంగా పెరిగే ఈ అసమానతల వల్ల మన చుట్టూ వున్న గాలి, నీరూ యెలా కలుషితమై పోతాయో చూపించాడు. వాడు చూపించిన దాన్ని చూస్తే నేను అనుకున్న దాని కన్నా చాలా తొందరగా మనం పీల్చే గాలీ, తాగే నీరూ కలుషితమై పోతాయనిపించింది. నా మేనల్లుడు, వాడి ఫ్రెండ్సూ లాంటి యువకులు దీనిని గుర్తించి, దానిని నివారించే దిశగా వాళ్ళేదో చెయ్యాలనే ప్రణాళిక వేసుకోవాలనుకోవడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. గర్వంగా రఘుని చూస్తూ, “అదంతా నిజమేరా.. మరి దానికి మీరేం చెయ్యాలనుకుంటున్నారు? దీనికీ, మీ బిజినెస్‌కీ ఏం సంబంధం?” నా సందేహం వ్యక్త పరిచాను.

రఘు మరింత ఉత్సాహంతో మళ్ళీ ఇంకో విండో ఓపెన్ చేసి అందులో అంకెలు చూపిస్తూ చెప్ప సాగేడు.

“ఇదిగో చూడు మావయ్యా.. వచ్చే రెండు సంవత్సరాలలో ఈ కాలుష్యం ఇంత ఎక్కువై పోతుంది. ఇప్పటికే మధ్య తరగతి వారు కూడా నీళ్ళు శుభ్రంగా వుండేందుకు ఫిల్టర్ల వాడకం మానేసి, చాలా మంది అక్వా లాంటివి వాడుతున్నారు. కొన్ని కొన్ని చోట్ల మునిసిపాలిటీ నీళ్ళు లేనివాళ్ళు బోర్ వాటర్ కి అది పని చేయక, అంత కన్న పవర్ ఫుల్ ది వాడుతున్నారు. రాబోయే సంవత్సరాలలో ఇంకా ఎక్కువ కాబోయే కల్మషాన్ని దృష్టిలో వుంచుకుని, మనం అంతకన్న పవర్ ఫుల్ ది, అందరి కన్న ముందే మార్కెట్లోకి ప్రవేశ పెట్టేమనుకో..ఇంక చూస్కో..మనకి ఆర్డర్లే.. ఆర్డర్లు.. అలాగే గాలి కూడా.. ఇప్పటికే కొన్ని కొన్ని సిటీస్‌లో

ఆక్సిజన్ క్యూబికల్స్ కట్టి ఆరోగ్య వంతమైన గాలిని గంట కింతని అమ్ముకుంటున్నారు. ఈ ట్రాఫిక్‌లో తిరుగుతూ, వాహన కాలుష్యానికి పాల బడిన వారందరూ వచ్చేరోజుల్లో ఈ ఆక్సిజన్ కొనుక్కోవడం ఎక్కువౌతుంది, ప్రాణం ముఖ్యం కదా.. అందుకని మనం ప్రతి సిటీ లోనూ ఈ ఆక్సిజన్ క్యూబికల్స్ ఏర్పాటు చేస్తే ఇంక మనకి రూపాయిల పంటే అనుకో..” పరవశంగా చెప్పుకు పోతున్న రఘుని నేను దిగ్భ్రాంతితో చూసాను.

ఏమిటి వీడు ఆలోచిస్తున్నది? ఎలకలని పోగొట్టడానికి ఇంటికి నిప్పు పెట్టుకుంటామా..అసలే కలుషితమై పోతున్న గాలి, నీరు లోంచి శుభ్రమైన వన్నీ లాగేసి, అమ్మేసుకుని, సొమ్ము చేసుకుని, తర్వాత వీళ్ళు ఏ గాలి పీల్చి బ్రతుకుతారు?

నేను శ్రద్ధగా వింటున్నాననుకున్న రఘు నాకు ఇంకా విడమర్చి చెప్పడం కోసం లాప్ టాప్‌లో ఇంకో సైట్ ఓపెన్ చేసాడు.

“ఇదిగో..ఇది చూసేవా మావయ్యా.. ఈ కంపెనీ ఆన్‌లైన్‌లో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని బాటిల్స్ లో అమ్ముతోంది. వాళ్ళే చెప్తున్నారు. రాకీ మౌంటెన్స్ లో గంటల తర బడి కష్ట పడి పట్టిన స్వచ్ఛమైన గాలిని, లాబ్‌లో ఒక్కొక్క బాటిల్ లోనూ నింపి “ఈ బే” అనే వెబ్ సైట్‌లో అమ్మకానికి పెట్టారుట. మొదటి బాటిల్ అమ్ముడవడానికి నెల్లాళ్ళు తీసుకుందిట. అది కూడా కేవలం 99 సెంట్లకే. కాని రెండో బాటిల్ మటుకు 168 డాలర్లకి అమ్ము డయిందిట.

గత మూడు నెలల్లోనూ ఆ కంపెనీ వాళ్ళు 900 ప్రాణ శక్తి వున్న అంటే ఆక్సిజన్ వున్న బాటిల్స్ అమ్మారుట. ముందు ముందు ఈ అమ్మకాలు ఎక్కువ వుతాయనే అంటున్నారు. మావయ్యా..నీకూ తెలుసు.. బిజినెస్ చేసే వాడు కస్టమర్‌కి కావలసినది అందిస్తే ఆ బిజినెస్ మూడు పూవులూ ఆరు కాయలూ అవుతుందని..” గుక్క తిప్పు కోకుండా చెప్తున్న రఘు మాటల్ని నేను స్థాణువునై వింటున్నాను. రాయిలా మారిన నన్ను చూసి రఘు ఫ్రెండ్ శ్రీనివాస్ చొరవ తీసుకుని ఇంకా ఇలా చెప్పేడు.

“మావయ్య గారూ, గాలిని పట్టి అమ్మడమేంటంటూ వినడానికి మీకు ఇది కొత్తగా అనిపించొచ్చు. కానీ ప్రస్తుతం లెక్కల ప్రకారం ఎక్కువ జనాభాగల దేశాలైన చైనా, ఇండియా, దుబాయ్ లలో వాహనాల వల్ల వచ్చే ఈ వాతావరణ కాలుష్యం చాలా ఎక్కువగా వుంది. అందుకని మా అంచనాల ప్రకారం మన ఇండియాలో చాలా తొందరలోనే ఈ ఆక్సిజన్ క్యూబికల్స్‌కీ, ఆక్సిజన్ బాటిల్స్‌కి డిమాండ్ వుండి తీరుతుంది. ఇంకా మన వాళ్లలో చాలా మందికి ఇలా గాలి పట్టి బిజినెస్ చెయ్యొచ్చనే ఆలోచన రాలేదు. అంత తొందరలో రాదు కూడాను. అందుకే మనదే మొదటి కంపెనీ అయ్యి బోల్డు లాభాలు చేసుకునే ఛాన్సెస్ చాలా వున్నాయి..”

చాలా బాగా చెప్పాడన్నట్లు అందరూ శ్రీనివాస్‌ని అభినందన పూర్వకంగా చూసారు. ప్రదీప్ మరింత చొరవ చేసుకుని నా పక్కకి

వచ్చి కూర్చున్నాడు. " అంకుల్, మీకు తెలినిదేముంది? బిజినెస్ అంతా డిమాండ్ అండ్ సప్లై మీద ఆధార పడుంటుంది కదా.. పోను పోనూ గాలి, నీరూ ఎంత అపురూపమై పోతాయో తెలుస్తోంది కదా..అదే మన బిజినెస్‌కి పెట్టుబడి.."

నా మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలకి అర్థం తెలీటం లేదు. పుట్టిన ప్రతి జీవికీ సహజంగా అందాల్సిన గాలి, నీరూ వీళ్ళకి వ్యాపార వస్తువులయ్యాయా? అయ్యో సహజ వనరులన్నీ తగ్గి పోతున్నాయే అని బాధ పడడం మానేసి, శవం మీద డబ్బు లేరుకుంటున్నట్లు ఆ తగ్గి పోయిన వాటి మీద వ్యాపారం చేస్తారా? మార్కెట్లో వున్న వస్తువులని దాచేసి, బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకునే వాడికీ, వీళ్ళకీ అసలేమైనా తేడా వుందా? పిచ్చి పిచ్చిగా వస్తున్న ఆలోచనలని ఆపుకుంటూ, బలవంతాన గొంతు లోంచి రాబోయిన అరుపును ఆపుకుంటూ, చెయ్యి పైకెత్తి ఇంక వాళ్ళని మాట్లాడ వద్దని ఆపేసాను.

వాళ్ళు నలుగురూ నా ప్రతి స్పందన కోసం ఆసక్తిగా నావైపే చూస్తున్నారు. నా మనసు లోంచి వచ్చిన భావాలు మాటల రూపంలో రాకుండా వుండ డానికి నన్ను నేను చాలా కంట్రోల్ చేసుకో వలసొచ్చింది. కాసిని మంచి నీళ్ళు తాగి నెమ్మదిగా మొదలు పెట్టాను.

"రఘూ, మీరు అనుకుంటున్నట్టు మనిషికి ముఖ్యంగా కావల్సినవి గాలి, నీరే. మీరు అన్నట్టు ప్రస్తుతం కలుషితమై పోతున్నవి కూడా అవి రెండే. కానీ మీ లాంటి వాళ్ళు అలాంటి కాలుష్యం జరగ కుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తే బాగుంటుంది కానీ ఇలా ఆలోచించడం ఏమీ బాగు లేదురా.."

నా మాటలకి చంద్రశేఖర్ అడ్డొచ్చేడు. "అంకుల్, ఈ జనాలకి అలా ఎంత చెప్పినా అర్థం కాదు. మీకు తెలీదా.. మన దేశంలో అవసరమైనన్ని టాయిలెట్స్ లేవు కానీ, అవసరానికి మించిన మొబైల్ ఫోన్లున్నాయి. ప్రతి వాడూ ప్రతి వాడి దగ్గరా దోచేసుకోవాలనుకునే ఈ మనుషుల గురించి మేం ఆలోచించడం ఎందుకు? వాళ్ల బలహీనతని కేష్ చేసుకుని నాలుగు డబ్బులు సంపాదించు కుంటే తప్పేమిటి? "

నేనింక ఆవేశం ఆపుకో లేక పోయాను.

"తప్పేమిటా? రేప్పొద్దున్న ఈ మనుషుల మధ్యే నువ్వూ జీవించాలి కాబట్టి. ఇప్పుడు వందకి కొన్న ఆక్సిజన్ బాటిల్ ని నువ్వు రెండేళ్ళ తర్వాత వెయ్యికి కొనుక్కుని, అది పెట్టుకుని, నీ రూం లోనే కూర్చో వలసొస్తుంది కాబట్టి. నీ పిల్లలకి పుట్టినప్పట్నుంచే ఆక్సిజన్ పెట్టే అవసరం వస్తుంది కాబట్టి.

ఇప్పటి వరకూ మనం చేసిన తప్పే మీరు వ్యాపారంలో కూడా చేసి డబ్బు సంపాదిస్తామంటున్నారు. సహజంగా వుండే అడవులని

కొట్టేసి పర్యావరణాన్ని పాడు చేసాం. సరైన కాలాల్లో వర్షాలు పడక నదులు ఎండి పోతున్నాయి. ప్రకృతిలో సమతుల్యత దెబ్బ తినడం వల్ల అకాల వర్షాలు, సునామీలూ మనల్ని ముంచేస్తున్నాయి. ఒక్క మొక్క నాటం కానీ మన దారికి అడ్డంగా వుందని చెట్లు మటుకు కొట్టేస్తాం. ఇంక మీ పిల్లల సమయం వచ్చే సరికి వాళ్ళు ఇరవై నాలుగ్గంటలూ ముక్కుకి ఆక్సిజన్ మాస్క్ తగిలించుకుని వుండే పరిస్థితి వస్తుంది. తాగడానికి నీటి చుక్క కోసం వేల రూపాయలు ఖర్చు పెట్ట వలసి వస్తుంది. పుడుతూనే పేరు తెలియని రోగాలతో ఈ భూమ్మీద పుట్టి, పుట్టినప్పట్నించి మందుల మీదే బతక వలసొస్తుంది. ఇప్పటికే నేను, నాది అంటూ పెరిగి పోయిన స్వార్ధం అప్పుడు ఇంకా వెఱ్ఱి తలలు వేసి ఎదుటి మనిషిని చంపినా తప్పు లేదన్న భావన వస్తుంది. ప్రేమ, స్నేహం, అభిమానాలు, ఆప్యాయతలు, పంచుకోడాలూ, ఆనంద పడడాలు వంటి వన్నీ పదాల లోనే వుంటాయి. కుళ్ళూ, కల్మషం విధ్వంసం మాత్రమే రాజ్య మేలుతాయి. ఇంకా.. " ఆవేశంగా చెప్పుకు పోతున్న నా గొంతులో దుఃఖం తన్నుకొచ్చి మాట రావడం ఆగి పోయింది.

నేను అంత ఆవేశంగా మాట్లాడడం చూసిన వాళ్ళు నలుగురూ మాట రాక స్థాణువులై పోయారు. భవిష్యత్తు యెలా వుంటుందో అంత పచ్చిగా చెప్పిన నన్ను ఆశ్చర్యంతో చూస్తూండి పోయారు. నన్ను నేను కాస్త అదుపు చేసుకున్నాను. రఘు వైపు చూస్తూ చెప్పాను.. "ఒరే రఘూ, మనం వుండేది మూన్నాళ్ళేరా.. ఈ మూన్నాళ్ళలో డబ్బు సంపాదించు కోవడం తప్పు లేదు కానీ అది ఎదుటి వాడి బలహీనత మీద సంపాదించడం చాలా తప్పురా. ఏదైనా పడ గొట్టడం సులభం కానీ నిర్మించడం చాలా కష్టం. ఇప్పటికే ప్రకృతిలో సమతుల్యత పోయింది. ఇప్పుడైనా మీలాంటి యువకులు జాగ్రత్త పడక పోతే ఇందాకా నేనన్నట్టు మీ పిల్లలు రోజంతా ఆక్సిజన్ మాస్క్ పెట్టుకుని తిరిగే పరిస్థితి వస్తుంది. కాస్త ఆలోచించండి. వున్న ఆక్సిజన్‌ని బాటిల్స్ లో పట్టి అమ్ముకునే ఆలోచన కన్నా, నాలుగు చెట్లు పెంచి ఆక్సిజన్‌ని పెంచే ఆలోచన చెయ్యండి. కలుషిత మౌతున్న నీటిని అలా అవకుండా నిరోధించే మార్గం చూడండి. యేడాదిలో వాడు లక్షలు సంపాదించాడు కొన్ని నెలల్లోనే నేను కోట్లు సంపాదిస్తాను అనే ఆలోచన రానివ్వకండి. ఎన్ని కోట్లైనా ఒక్క ఆక్సిజన్ బాటిల్ కొనడానికే కదా.. దానినే పెంచేదెలాగో ఆలోచించండి. మీరంతా యువకులు, చదువుకున్న వాళ్ళు, సాంకేతికత గురించి బాగా తెలిసిన వాళ్ళు. మీ లాంటి వాళ్ళు ఇలాంటి చర్యలు చేపడితే మీ పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. ఒక్కసారి ఆలోచించండి" గద్గద మౌతున్న నా గొంతులో బాధని గ్రహించిన వాళ్ళు నలుగురూ ఒక్కసారి నా ఎదురుగా కూర్చుండి పోయారు. రఘు నా చేతిని పట్టుకుని ప్రమాణం చేస్తున్నట్టు, "నిజమే మావయ్యా, ఆవేశంలో పడి నీ అంత ముందు చూపుతో ఆలోచించ లేక పోయాం. మా కళ్ళు తెరిపించావు. మా పిల్లల భవిష్యత్తుకి మేమే కదా మంచి బాట వెయ్యాలి. అలాగే మావయ్యా, తప్పకుండా నువ్వు చెప్పిన పద్ధతి లోనే ఆలోచించి వారికి ప్రాణాధారాలైన గాలీ, నీరూ సమృద్ధిగా అందేలా ప్రయత్నాలు చేస్తాం. థాంక్స్ మావయ్యా.." అన్నాడు. రఘు పట్టుకున్న చేతి మీద మిగిలిన ముగ్గురూ కూడా చేతులు వేసి అన్నీ కలిపి గట్టిగా పిడికిలి బిగించారు




మండు వేసవి భానుడు తన ప్రతాపాన్ని భూమి పై చూపిస్తున్నాడు ,మండే అగ్నిగోళం లా  భగభగ మంటూ నిప్పులు చెరుగుతున్నాడు ,ఆ నిప్పు కణికల వేడిమిని తట్టుకోలేక ప్రజలు విలవిలలాడుతున్నారు .సూర్యుడు తన వేడిమి తాపాన్ని తీర్చుకోవడానికి భూమి పైన ,నదులలోన,చివరికి మానవుని శరీరము లో ఉన్న నీటిని సైతం హరిస్తున్నాడేమో  అన్న తలంపు వస్తున్నది.భూమికి అతి చేరువుగా వస్తూ అత్యంత కాంతిలో ,ప్రకాశవంతముగా ,అత్యంత వేడిమి కలిగిన బుసలు కొడుతూ దేదీప్యమానముగా వెలిగిపోతున్నాడు .  సూర్యుని వేడిమి భరించలేని ప్రజలు కొందరు గృహానికే పరిమితమయిపోయారు. విధి లేని పరిస్థితులలో కొందరు బయటకు సాగుతున్నారు .రోడ్లమీద జనసంచారము మందగించింది .వీధి కోళాయిల వద్ద ఆడపడుచులు బిందెడు నీటి కోసము పడిగాపులు కాస్తున్నారు .డబ్బు ఉన్న వాళ్ళందరూ ఏసిల కింద కాలము వెళ్ళబుచ్చుతున్నారు .పానీయాలు ,ఐస్క్రీమ్ల బండ్ల వ్యాపారం జోరుగా సాగుతున్నది .తోపుడుబల్ల వ్యాపారస్థుల పరిస్థితి అత్యంత బాధాకరము, ఎండలో వెళ్ళలేరు వెళ్ళక పోతే పూట గడవదు .రిక్షా అబ్బి  పరిస్థితి గడ్డుకాలమనే చెప్పాలి, బతుకు జీవుడా అంటూ మండుటెండలో సూర్యుడు తన శక్తి ని  హరిస్తున్నా కాళ్లలో శక్తినంతా కూడా గట్టుకుని పయనం సాగిస్తున్నాడు.

మొత్తానికి ప్రతి ఒక్కరి నోటా ఒకటే మాట ''బాబోయి ఎండలు భరించలేకపోతున్నాము మా వల్ల కాదు బాబోయి ''. స్కూల్లకి సెలవులివ్వడముతో పిల్లలందరూ ఇంటిపట్టునే ఉంటున్నారు. అమ్మ వద్దని చెప్పినా దొంగచాటుగా వీధిలోకి వెళ్ళి పిల్లలందరూ ఆడుకుంటున్నారు .ఆ వీధిలో పిల్లలందరూ క్రికెట్టు ఆడుతున్నారు .అంతా ఒకేసారి నిశ్శబ్దం అయ్యారు. సూర్య  వేసే బంతికి ప్రతాప్  సిక్స్ కొడతాడలేక అవుటవుతాడా అని అందరిలో ఒకటే ఆరాటం .సూర్య బంతిని తన నిక్కరుకి రుద్దుతూనే ఉన్నాడు ప్రతాప్  వెనుక సురేశ్ బంతిని పట్టుకుని అవుట్ చేద్దామా అని సిద్ధముగా ఉన్నాడు.మిగిలిన వారందరూ బంతిని

ఆపడానికి ఉత్సుకతతో ఉన్నారు .మొత్తానికి సూర్య బంతిని వేయడము ప్రతాప్ సిక్స్ కొట్టడము జరిగిపోయాయి .ప్రతాప్ ని అందరూ హేయ్ అంటూ తమ మోచేతుల పైన ఎక్కించుకుని పైకి ఎత్తుతూ హాహాకారాలు చేశారు .తరువాత రెండు నిమిషాలకే ఉన్న పలముగా ప్రతాప్ కుప్పకూలిపోయాడు .అందరూ ప్రతాప్ చుట్టూ గుమిగూడారు .ఏమయింది ప్రతాప్ కి అనికంగారు పడ్డారు .అక్కడ పక్కనే ఆడుకుంటున్న ప్రతాప్ చెల్లి మల్లి పరుగెత్తు కుని వెళ్ళి విషయం అమ్మకి చెప్పింది .అందరూ కలిసి ప్రతాప్ ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు .డాక్టరు వడదెబ్బ తగిలిందని ,ఎండలు తీవ్రముగా ఉన్న ఈ సమయములో పిల్లలని ఎందుకు బయటకి పంపారని డాక్టరు ప్రతాప్ తల్లిని మందలించారు .

అందరూ సుర్యుడిని ఒకటే నిందిస్తూ ఉన్నారు .మాయదారి ఎండలు మా జీవితాలతో ఆడుకుంటున్నాయి భరించలేక పోతున్నాము ఆ సూర్యుడు మా పేదోళ్ళ మీద కన్నెర్ర చేశాడు ఇలా మనిషోమాట అంటూనే ఉన్నారు ప్రతాప్ పరిస్థితికి కారణమయిన ఎండను ,సూర్యుడిని అందరూ తప్పు పడుతున్నారు .అంతా విన్న మల్లి మాత్రం ఇంటిలో ఉన్న గుప్పెడు పువ్వులను తీసుకుని సూర్యుడి ఫోటో ముందు పెట్టి ''ఓ సూర్య భగవానుడా ,అందరూ నిన్ను నిందిస్తున్నారు ఎందుకు ....నువ్వు అంతా చెడ్డవాడివా ,మంచివాడివా ........,చెడ్డవాడివి అయితే చలిగా ఉన్నప్పుడు ,వర్షాలు పడినపుడు నిన్ను ఎందుకు తలుస్తారు,పిలుస్తారు,పూజిస్తారు.మంచివాడివయితే మా అన్నను ఇలా ఎందుకు చేశావు ,అందరూ నిన్ను ఎందుకు తిడుతున్నారు '' అని ప్రార్ధించింది .

అందరూ సూర్యుణ్ణి నిందిస్తున్న సమయములో మల్లి మాత్రమే సూర్యుణ్ణి ప్రార్ధించింది .వెంటనే మల్లి అనే పిలుపు వినబడేసరికి మళ్ళీ కంగారు పడింది ,''నేనమ్మ సూర్యుణ్ణి పిలిచావుగా నన్ను ప్రశ్నించావుగా'' అన్న మాటలు సూర్యుని ఫోటో నుండి వినిపించసాగాయి .భయపడకు నీ ప్రశ్నలకి సమాదానమిస్తాను వింటావా మరి అన ప్రశ్నకు అలాగే అన్నట్టుగా మల్లి తల ఊపింది .

చూడు మల్లి ఈ రోజున ప్రతీ ఒక్కరూ తప్పు నాదే అన్నట్లుగా నా మీదే విరుచుకుపడుతున్నారు .కానీ ఒక విషయము మాత్రము నిజం. నేను పుట్టినపుడు నుండి ఈ రోజు వరకు ఒకేవిధముగా ఉన్నాను అప్పుడు ఏ కాలములో ఎలా ప్రకాశించేవాడినో ఇప్పుడూ అలాగే నా విధి నిర్వర్తిస్తున్నాను .మద్యలో మార్పు వచ్చినదంతా మీ మానవుడి చర్యలవలనే అన్న మాటలకు ,అవునా అన్నట్లు మల్లి ఆశ్చర్యముగా చూసింది .ఇంతకు ముందు అడవులు ,కొండలు,చెట్లు అన్నీ కూడా బాగా ఎత్తుగా ,ఎక్కువుగా ఉండేవి .అవి నా వేడిమిని మీ వరకు చేర్చకుండా అడ్డుకునేవి .కాని ఇప్పుడేమి జరిగింది మానవులు చెట్లను అన్నింటిని కొట్టేశాడు కొండలను తవ్వేసాడు అడవులలో ఉన్న చెట్లను నరికేశారు మరి నా వేడి నుండి మీకు రక్షణ ఎలా వస్తుంది .సరే చెట్లను ,కొండలను,అడవులను అవసరార్ధము తవ్వేశారు అనుకుందాము .మరి నాకు మీకు మద్యన ఉండే రక్షణ కవచము ఓజోను పొరను మీ మానవులు దెబ్బతీశారు .

అనేక ఫ్యాక్టరీలు పెట్టి వాటినుండి కాలుషాన్ని నా పైకి పంపించారు అది ఓజోను పొరను దెబ్బతీసింది అందుకే నానుండి వెలువడే

వేడి మీకు అత్యంత సమీప మయ్యింది .రోడ్లమీద పాదాచారులు తగ్గిపోయారు అందరూ వాహనాల మీద వెళ్ళేవారే ఎక్కువయ్యారు దాని వలన వాహన ఇందన కాలుష్యం ఎక్కువయింది అది ఒక కారణమే మరి .సరే అన్నీ తెలుసుకుని కొంతమంది మేలుకుని మొక్కలు నాటే కార్యక్రమము అని మొక్కలు నాటి వెళ్లిపోతున్నారు కానీ తరువాత వాటి సంరక్షణ బాధ్యత వదిలేస్తున్నారు .మీ మానవులు కనిపెట్టిన అధునాతన వస్తువులు వాటి నుండి వెలువడే వాయువులు వలన ఓజోను పొర దెబ్బతిని నా నుండి వెలువడే అతినీలలోహిత కిరణాలు భూమి మీద మీ మనుష్యల మీద నేరుగా పడుతున్నాయి వాటి ప్రభావాన అనేక సమస్యలకు మీరు గురియవుతున్నారు ఇలా ఎన్నని చెప్పను మీ మనుషులు చేసిన తప్పిదాలు ఒకటా రెండా ......మీ సౌక్యము కోసము విలాసవంతమైన జీవితము జీవించడము కోసము పరిణామాలను పరిగణలోకి తీసుకోకుండా ఎన్నో వస్తువులను కనిపెట్టి వినియోగిస్తున్నారు. బొగ్గు , పెట్రోల్ లను వివిధ అవసరాల నిమిత్తము వినియోగాన్ని బాగా పెంచారు .కానీ వాటి నుండి వెలువడే వాయువుల పరిణామాలను ఆలోచించడము లేదు .ఇలా ఎన్నో తప్పిదాలను చేస్తూ ,తప్పు తన వైపు ఉంచుకుని నన్ను నిందిస్తున్నారు .

ఇప్పుడు చెప్పు మల్లి నన్ను పూజిస్తావో, నిందిస్తావో .......నీ ప్రశ్నకు జవాబు లభించింది అనుకుంటాను అన్న మాటలు వినిపించాయి మల్లికి తరువాత ఏమీ వినబడలేదు .మల్లికి విషయము అవగతమైంది అన్నట్లుగా అక్కడి నుండి వెళ్ళి మొట్టమొదట తన ఇంటి ముందు చిన్న చిన్న మొక్కలు నాటింది ,మల్లిని గమనించిన అందరూ తన వైపు ఆశ్చర్యముగా చూసారు .మల్లి అందరికీ విషయాన్ని తనకు అర్ధంయినరీతిలో వర్ణించింది,మల్లిని చూసి అందరూ మొక్కలు నాటారు.మరి ఎందుకు ఆలస్యం పదండి మనము మల్లిని అనుసరిద్దాము




"వినాయక రావ్ కూతురు పెళ్ళి కుదిరిందిట ! ఐతే పాపం ముహూర్తం వేసవిలో మే నెల్లోనేట. అదీనీ వారి నగరంలో ఏసీ

హాల్ లో పెళ్ళి చేయాలిట , కరెంటుపోతే --అదేదో ఏర్పాటు చేసి అన్నీ నడపాలిట, "అంటూ మార్చి ఎండన పడి ఊరి విశేషా లన్నీ సేకరించి వచ్చి, సమాచారం అందించాడు భార్య భానుకు బాపేశం , ఆమె అందించిన కొత్తకుండ లోని చల్లని నీరుత్రాగి.

" అయ్యో పాపం ఎలా చేస్తారండీ? కుదరక కుదరక ఈ వేసవిలోనే! , అదీని మే నెల్లో నే ముహూర్తం కుదరాలా పాపం హరి హరీ , నీళ్ళకు కరువు, కరెంటు కోత, ఒకటా రెండా వేసవి బాధలు -- " అంటూ నిట్టూర్చింది భాను ,పాపం ఆ వివాహం తానే పూనుకుని చేస్తున్నట్లు బాధ పడుతూ.

వీరిలా వినాయక రావు కూతురి పెళ్ళి గురించి బాధ పడుతుండగా బలరామ్మూర్తి వచ్చాడు " ఏంటండోయ్ తీవ్రంగా ఆలోచిస్తున్నా రు ." అంటూ. ' బలరామ్మూర్తి భలే వాడు' అనుకుంటారంతా.అతగాడి బుర్రకూడా దివిటీలా వెలుగుతుంటుంది, ఆకాశ చువ్వలా దూ సుకు పోతుంటుంది. వేసవి వచ్చిందంటే గ్రామ వాసుల్ని పలకరించ నన్నట్లు అందర్నీ కలేసుకుని తిరుగుతూ ఎక్కడికక్కడ చల్ల పానీయాలూ, చల్లా త్రాగుతూ దాహం తీర్చుకుని వెళుతుంటాడు, కాలక్షేపానికి కాలక్షేపం ,ఎవరికి కావాల్సిన ఉపాయాలు వారికి చెప్పివెళు తుంటాడు., అందుకనే బలరామ్మూర్తి వస్తున్నా డంటే ఇబ్బందిలో ఉన్నవారంతా ఊపిరి తీసుకుంటారు. ఏదో ఒక ఉపా యం చెప్పక పోడని.

"వినాయక రావ్ కూతురి పెళ్ళండీ! ఎప్పుడని అడగరేం? ఈ వేసవిలోనే నండీ పాపం , ఎలా వేగుకొస్తాడో ఏమో ,అసలే అమాయ కుడు అన్నయ్యగారూ! అదీని వారి నగరంలోకోరిన ఏసీ హాల్లో చేయాలిట.!" అంటూ చల్లని చల్ల గ్లాసు అందించింది భాను. ఆచల్ల త్రాగ గానే బలరామ్మూర్తి మైండ్ లో బల్బ్ వెలిగింది . ఒక్క ఉదుటున కుర్చీలోంచి ముందుకు వాలి, "అదే అక్కడే వచ్చిపడింది లాభ మంతా "అన్నాడు.

"లాభమేంటండీ చిక్కైతేనూ !" అంది భాను .

"చిక్కా పాడా, ఒక్క చిటికె లో తేల్చేస్తాను , రావయ్యా బాపేశం! నాతో పాటుగా మన వినాయక రావ్ ఇంటికి "అంటూ లేచి లాల్చీ దులుపుకున్నాడు బలరామ్మూర్తి . "ఇంతెం ఎండలో ఏం వెళతాం లేవోయ్ , పైగా ఇప్పుడే ఊరంతా తిరిగి వచ్చాను , మా ఆవిడకు తీపి కబురందించను." అంటూ నిరసించిన బాపేశాన్ని చేయి పట్టి లేపి , నీవు తిరగడం వేరు, నాతో తిరగడం వేరు. లేవయ్యా బాబూ విందు భోజనం తిని పిస్తానూ -- చెల్లాయ్ !మాకోసం ఎదురు చూడకు మేం భోజనం చేసి వస్తాం సరా!" అంటూ బాపేశాన్ని వెంటేసు కుని బయల్దేరాడు , తన చేతి లోని పెద్ద తెల్లగొడుగును తెరచి ఇద్దరికీ పట్టాడు బలరామ్మూర్తి .

ఇంటి ముందున్న పందిట్లో కూర్చుని భార్యతో చర్చిస్తున్న వినాయక రావు వీరిద్దరినీ చూసి " రండి రండి ! బలరామ్మూర్తి గారూ! సమయానికి పిల్చినట్లు వచ్చారు. చాలా సంతోషమూ, కాస్తంత విచారమూ, కలసి ఉన్న సమయంలో వచ్చారు. ఇహమీదే భారం " అంటూ వినాయక రావు సాదరంగా ఆహ్వానించాడు .

నవ్వుతూ "రావోయ్ బాపేశం ! ఇదో ఈ మహాను భావుడే నా చెవిన వేశాడు మీ కుమార్తె వివాహం కుదిరిందనీ, అదీ ఈ మే నెల్లోనే నని , పైగా వారి నగరంలో కోరిన ఏసీ హాల్లోనని తెలిసింది. ఇహ రాక చస్తానా చెప్పండీ !" అంటూ చెక్క బల్లమీద సర్దుక్కూర్చు న్నాడు, బాపేశాన్ని లాగి కూర్చో బెట్టి.

" రండి అన్నయ్యగారూ " అంటూ బల్ల చూపి లోని కెళ్ళింది ఆ గృహలక్ష్మి. " ఇహ చెప్పండీ .."అంటూ లోనికి చూశాడు బలరా మ్మూర్తి . అర్థం చేసుకున్న వినాయక రావు " ఇదో ఏమే ! కాసిన్ని కమ్మని చల్ల పట్టుకురా మా ముగ్గురికీనీ " అంటూ కేకేశాడు.

లోపలినుంచి " ఆపనిమీదే ఉన్నా .." అని విని పించాక స్థిమిత పడి ,బలరామ్మూర్తి మొదలె ట్టాడు.

" చెప్పవయ్యా! వినాయకా ! నావల్ల కావల్సిన కార్య మేదైనా కానీ మొఖమాటం లేకుండా చెప్పెయ్ ! పెళ్ళివారిదే ఊరూ? కట్న కానుకలు మాట్లాడుకున్నారా! పెళ్ళి తేదీ ఏంటి? పెళ్ళికి ఎందరు వస్తారు? ఎన్నిరోజుల ముందు వస్తారూ? ..." అంటూండగా , వినాయక రావ్ " బాబ్బాబూ కాస్త నిదానంగా ఒక్కోటీ చెప్తాను, మీ వల్ల కావాల్సిన కార్యాలు చాలా నే ఉన్నాయి. ముందు ఈ పూట మా ఇంట మా ఆతిధ్యం స్వీకరించి , నిదానంగా మేనెల్లో పెళ్ళికి ఎదురయ్యే మా ఇబ్బందులు అర్ధం చేసుకుని ఉపాయాలు చెప్పండి. ఒక్కోటి చర్చిస్తే గాని మా మనస్సులు కుదుట బడవు." అంటూ అభ్యర్థించగా , "ఈరోజు మనం లేచిన వేళ మంచిది, మనల్ని ఆదు కోను ఇరువురు నిస్వార్ధ బంధువులు వచ్చారు . త్వరగా వెళ్ళి వంటలు చూడూ.."అంటూ భార్యను తొందరచేశాడు.

ఆమెలోని కెళ్ళగానే పెళ్ళి గురించి తాను అడిగిన ఒక్కోప్రశ్నా మళ్ళా రిపీట్ చేస్తూ ,సమస్యలు చ ర్చి స్తూ, తనకు తోచిన నివారణో పాయాలు వివరిస్తూ , ఉండగా భోజనాలకు పిలు పొచ్చింది.ముగ్గురూ లేచి కాళ్ళు కడుక్కుని భోజన శాలకెళ్ళి కూర్చున్నారు .

పెద్ద అరిటాకుల్లో నూనె వంకాయ కూరా , మామిడి కాయ పప్పూ , దోసావకాయా, అప్పడాలూ ,వడియాలూ, కొబ్బరి పెరుగు పచ్చ డీ , బీరకాయ బజ్జీ , వడ్డించి ఉండగా " ఇదేంటయ్యా వినాయక రావ్ ! పెళ్ళి పప్పన్నం ఇప్పుడే పెట్టి నట్టున్నావ్!

పెళ్ళికి ఇహ పిల వ్వా ఏంటీ! " అని హా స్య మాడి, ఒక్కో వంటకం తింటూ , వాటి రుచి పొగుడ్తూ, పాయసం తో పూర్తిచేసి , మిగడ పెరుగుతో పొట్ట నిండ గా లేవలేక వినాయక రావ్ చేయందించగా లేచి , హస్త ప్రక్షాళన చేసుకుని తిరిగీ బల్ల మీదకు చేరారు.

"కాస్తంత నడుం వాలుస్తారా అన్నయ్య గారూ !" అంటూ వచ్చిన గృహ మమ్మాయిని ," భలేదానివి చెల్లాయ్ ! వచ్చింది ఇబ్బందులు చర్చించి వివాహ వేడుక చక్కగా నిర్వహించను గాని , భోంచేసి నడుం వాల్చనా? మీరూ కానివ్వండి,ఆలస్య మైతే ఆరోగ్యాలేం కానూ! అసలే ఆడ పెళ్ళివారు , భోజనం కానిచ్చి వస్తే చర్చ స్థాయికి వస్తుంది." అని ఆడవారిని పంపేసి , వారు భోజనాలు ముగించి వచ్చాక అందరితో కలిసి ,మిగతా విషయాలు చర్చించి, ఒక కొలిక్కి తెచ్చాడు.

"ఇహ నిశ్చింతగా ఉండండి!మీ అమ్మాయి పెళ్ళి సులువుగా మనఊర్లోనే జరిగి పోయినట్లే భావించండి. మేమిరువురం వెళ్ళి అన్నీ మాట్లాడివస్తాం కదా! విందు భోజనం లోకి చేయాల్సిన వంటల గురించి కూడా మీకు పట్టీ వ్రాసి తెస్తాను , ముందుగా వారింట ఒక భోజనం చేస్తే కాని దాన్ని నిర్ణయించ లేను.మన ఊరి విందు రుచి జన్మలో మర్చిపోకుండా చేద్దాం. నీవొస్తే 'అతికితే గతక 'దంటావ్ ,అందుకే మే మిరువురం,రేపే దశమి కనుక వెళ్ళి శుభవార్తతో వస్తాం. సరా !వెళ్ళిరామా! ఇక , పెళ్ళికూతురా ! అత్తారింటికి దారెటో , ఏమేమి తీసుకు వెళ్ళాలో , తేనె యాత్ర కెక్కడి కెళ్ళాలో తేల్చుకో ! వస్తాం మరి " అంటూ లేచాడు బలరామ్మూర్తి .

బాపేశమూ వెర్రి ముఖం వేసుకుని బలరామ్మూర్తి వెంట లేచాడు. ఆ మరునాడు బలరామ్మూర్తి వెంట వెళ్ళక తప్పలేదు బాపేశానికి .ఇరువురూ ఐదు మైళ్ళదూరం లోని నగరానికి బస్ లో వెళ్ళి , మగ పెళ్ళివారిల్లు సులువు గానే తెల్సుకుని లోని కెళ్ళారు. తా మెవరో చెప్పి పరిచయాలయ్యాక , ముందుగా వారిచ్చిన మంచి తీర్థం సేవిస్తూ , " పల్లెకూ పట్టణానికీ ఉండే తేడా ఈ నీళ్ళను బట్టే తెలుస్తున్నదండీ!" అంటూ మొదటి బాణం సంధించాడు .

"అంటే మీ ఉద్దేశ్యం?" నవ్వుతూనే అన్నా కాస్తంత ఆసక్తి కనిపించింది పెళ్ళికొడుకు తండ్రైన నాగేశం ముఖంలో.

" అబ్బే పెద్దగా ఏం లేదండీ! మేము నేరుగా కమ్మని మంచినీటి బావి నీరు తోడి తెచ్చుకుని , కొత్త మట్టి బానల్లో పోసుకుని సహ జ మైన చల్లని నీరు త్రాగుతాం. మీపట్టణ వాసులు ప్లాస్టిక్ డబ్బాల్లో శుద్ధి చేసో చేయకో నింపి అమ్మే నీరు ఫ్రిజ్ లలో పెట్టుకుని త్రాగు తారు. అంతే తేడా." అని అంటించాడు. ఇంతలో కరెంట్ కట్టై చెమట పోయసాగింది."మరేనండీ ! మాపల్లెల్లో చల్లని తాటాకు పందిళ్ళూ, చెట్లనుంచి వచ్చే సహజమైన గాలి , నగరాల్లోనో కరెంట్ లేక పోతే జీవితమే ఆగిపోయి నట్లుంటుంది. మా బాబాయ్య గారు ఉన్నారు లెండి పాపం, ఈ నగరంలోనే రామాలయం వీధిలో . ఎప్పుడూ అంటుంటాడు 'మీ పల్లె వాసుల జీవితం హాయిరా! ఎప్పుడూ సహజమైన గాలి, నీరూ తిండి గింజలూ, పండ్లూ కూరా, నారా అన్నీ నేరుగా చేలనుంచి తెచ్చుకు

తింటుంటారు. మేమో కోసి వారమయ్యాక మర్కెట్ నుండీ తెచ్చుకుని మరో వారం పాటు వాడుకుని చెత్త తింటుంటాం, నగరాల్లో పెళ్ళి అంతా నాటకాల్లో జరిగి నట్లే ఉంటుంది. ఒక్కమారు మీ ఊర్లో ఏదైనా పెళ్ళి ఉంటే పిలవరా! ఆకమ్మని కొత్త తాటాకు చాపలూ, పచ్చి తాటాకు పంది ళ్ళూ, దంపుడు బియ్యప్పిండి నిప్పట్లూ, కొబ్బరి నీరూ, తాటిముంజలూ.. అరిటాకు భోజనాలూ, పెట్రోమాక్స్ లైట్లూ అబ్బో ఒకటేం టీ అన్నీ చూసి మనసారా ఆనందిస్తాన్రా ' అని .." అంటూ ఓరగా ఆయన కేసి చూశాడు.

"ఏంటీ ఇవన్నీ మీ పల్లెల్లో పెళ్ళికి మాకూ అందుతాయా! ఐతే మాకీ నగరంలో కాకుండా పల్లెలోనే పెళ్ళి చేయించమని చెప్పండి" అంటూ ఆశగా చూశాడు బలరామ్మూర్తి వైపు.

"చిన్నగా అడుగుతారా! పెళ్ళి కుమారుల తండ్రి గారు మీరిలా అడిగితే కాదనే ధైర్యం మాకెక్కడిదీ !తప్పక అలాగే మాపల్లెలోనే వివాహం జరిపిస్తాం. నేనిప్పుడు చెప్పినవి కొన్నే నండీ బాబూ! మాకు కరెంటు అవసరమే లేదు. పెళ్ళి చక్కగా , హాయిగా , ఏ ఇబ్బందీలేకుండా సజావుగా జరిపించే పూచి నాదీ! పెద్దముండావాడ్ని నామాట నమ్మండి.కార్బైడ్ మందుతోకాక సహజంగా చెట్టు కే పండించిన మామిడి రసాలు , బంగినపళ్ళూ, కొబ్బరి మామిడీ ఒకటేంటండీ .. మీరు తిని చూడవలసిందే కానీ చెప్తే తీరేది కాదు. సరిసరి పెళ్ళి మాటల కొచ్చి ఏదేదో మాట్లాడు తున్నాను నా చాదస్తం మండా! మాపల్లెపేరు చెప్పగానే నామతి పోతుంటుంది కటిక సత్యాలవైపు ,ఇహ చెప్పండి బాబూ !మీకు కావల్సిన తీరులో పెళ్ళి ఏర్పాట్లు చేయిస్తాను.

ఇహ పట్టీ వ్రాసుకుందామాండీ! మేం మ ళ్ళా మా బాబయ్య ఇంటికి భోజనానికి వెళ్ళాలి.." అన్నాడు బలరామ్మూర్తి సందర్భోచితంగా సమయం చూసుకుంటూనూ. నాగేశం " భలేవారండీ !మధ్యవర్తులుగా వచ్చిన మీకు భోజనం పెట్టకుండా పంపుతామా! లోపల ఆఏర్పాట్లేవో అవుతున్న ట్లున్నా యి. ఉండండి ఇప్పుడే వస్తాను " అంటూ లోని కెళ్ళి చూసి వచ్చి "రండి వడ్డిస్తున్నారు . భోంచేస్తూ కొన్నీ , ఆ తర్వాత కొన్నీ మా ట్లాడు కుందాం." అంటూ వారిని భోజనానికి ఆహ్వానించాడు. వంకాయ కూర వడ్డించగానే తిరగేసీ మరగేసీ చూస్తూ "మరోలా అనుకోకండి కాని నిన్నమా వినాయక రావింట్లో చెల్లెమ్మ నేరుగా తోటనుంచి కోసుకొచ్చి నట్లుంది , గుత్తొంకాయ చేసిందీ ! ఏం రుచోనండీ బాబూ ! కాయ మీద కాయ లేపి ఆయాస పడ్డాను. తోట కాయల రుచండీ!" --- అనగానే, "మరైతే పెళ్ళికి ఒకటి గుత్తొకాయ కూర ఫిక్స్ "అన్నాడు నాగేశం.

"చాలా సంతోషమండీ ! తోటనుంచి కోయించి తెప్పిస్తాను."అని భరోసా ఇచ్చాడు బలరామ్మూర్తి . అలా వారిని మురిపిస్తూ , మరిపి స్తూ భోజనం పూర్తయ్యేలోగానే మెనూ తో పాటుగా పిండివంటలూ, టిఫిన్లూ అన్నీ వారిచేతనే చెప్పించేసి, భోజనం కాగానే వారిచేతే రెండు లిస్టూలు రాయించేసి " మరేమను కోకండి బాబూ ! మా వామనరావ్ నన్ను నమ్మాలంటే మీరు ఈరెండు పట్టీల మీదా కాస్తంత సంతకం గీకండి , మా వాడు సాక్షి సంతకం గీకుతాడు. లేపోతే వాడొక పట్టాన నమ్మడు , చాదస్తుడు, సాంప్రదాయ వాదీ నీ." అంటూ సంతకాలు కూడా చేయించేశాడు. కొత్త కోడలు తెచ్చే పిండి వంటల్లో కొన్ని తగ్గించి, మామిడి పండ్లూ, కొబ్బరికా య లూ, తాటిముంజలూ చేర్చాడు కూడాను. పెళ్ళిఏర్పాట్లు ఎలా చేయడమో సైతం వారిమనస్సులు మురిపించాక అదీనీ రాయిం చే సి సంతకాలు గెలికించేసి, ధన్యవాదాలు చెప్పించేసుకుని , అన్నింటికీ ఒప్పించేసి లేచొచ్చేశాడు

బలరామ్మూర్తి.

వివాహం రోజు రానే వచ్చింది. మగపెళ్ళి వారందరినీ రోడ్డుమీద బస్సు దిగంగానే ,తాటాకు చాపలు క్రింద కూర్చోనూ , పైన గూడు గా నూ ఏర్పరిచిన రెండెడ్ల బండ్లలో పిల్లలూ పెద్దలు సైతం మహదా నందపడుతూ నవ్వుకుంటూ , కేరింతలు కొడుతూ వచ్చి దిగారు. దారిలో మామిడి, కొబ్బరి, తాటి తోటలు చూస్తూ కేకలేస్తున్న పిల్లలను పెద్దలంతా చూస్తూ ఊర్కున్నారు. పిల్లలంతా వారి జన్మల్లో అదే మొదలు పల్లెలూ వాటి సొగసులూ చూడటం. విడిదిలో దిగ్గా నే పచ్చితాటాకు పందిళ్ళు చల్లగా ఆహ్వానించగా, కొబ్బరి మట్టలు కట్టిన గుంజలు, మామిడాకుల కమ్మని తోరణాల వాసనా పెళ్ళివారి మనస్సులను మెస్మరిజం చేశాయి. చుట్టూతా తడి చీరలు చుట్టి న కొత్త మట్టి బానల్లో నీరు కమ్మగా వారి పొట్టల్లో దిగు తుండగా అంతా తెగత్రాగసాగారు.

“ఆగండాగండి .నీళ్ళతోనే పొట్టలు నింపేసుకుంటే మా కొత్త బెల్లం పానకమూ, కొబ్బరి కాయ నీరూ, తాటిముంజలూ ఎవరు తినేట్లు ? " అంటూ వారిని ఊరించాడు బలరామ్మూర్తి. కొత్త తాటాకు చాపలు పరిచిన పందిట్లో స్వయంగా పిలిపించి దగ్గరుండి అల్లించిన తాటా కు విసిని కర్రలూ, గంపలూ , చాపలూ , లాంటి వాటివల్ల ఎంతోకాలం,గా పనిలేక వృత్తి వదలి కూలిపనుల్లో కెళు తున్న వా రంతా పందిళ్ళూ విసిని కర్రలూ నేసే వృత్తి పనివారూ, కులాలులూ చేతులెత్తి మొక్కారు. విసిని కర్రలన్నీ పెద్దపెద్ద మట్టి తొట్లలో నాన బెట్టి పిలల్లకూ పెద్దలకు తలోటీ ఇవ్వగానే వాటి అల్లికకు ఆనందిస్తూ , ఆకమ్మని వాసనను ఆహ్లాదిస్తూ అంతా ఎవరికి వారు విసురు కుంటూ కూర్చున్నారు. ఫ్యాన్లూ, ఏసీలు, కరెంటూ విషయమే మర్చిపోయారు. అడిగిన వారికీ అడగని వారికీ ప్రతి ఒక్క రికీ కొట్టి కొబ్బరి మట్టలతో పీకల్లా చుట్టిన స్ట్రాస్ వేసి అందిస్తుంటే తమ నగరంలో 30, 40 రు, ఈ మేనెల్లో ఇంకా ఎక్కువా పెట్టి కొని అపురూపంగా త్రాగే కొబ్బరి బోండాలు గుర్తొచ్చి మహా ఆర్తిగా త్రాగ సాగారు. అలా ఒకటేంటి అందరినీ మురిపించేసే ఏర్పాట్లు, మల్లెల మాలలూ, తినుబండారాలూ , కొబ్బరుండలూ, నిప్పట్లూ , అన్నీ అదిరిపోగా మహార్భాటంగా చేసిన ఏర్పాట్లు పెళ్ళివారిని ఎండల నుంచి మరిపించాయి. రాత్రికి పెళ్లనగా ఏర్పాటు చేసిన పెట్రో మాక్స్ లైట్లు సినిమాల్లో తప్ప చూడని పిల్లాజల్లా చుట్టూ చేరి చూస్తుం డ గా చక్కగా వివాహ వేడుకలన్నీ జరిగిపోయాయి.తెల్లారు ఝామునకు అప్పగింతలు , చేసేస్తుంటే అప్పుడే పెళ్ళైపోయిం దాని మగ పెళ్ళి వారు ఆశ్చర్యంగా సాగగా ,ఆడపెళ్ళివారు వేసవి తాపం లో , అది తెలికుండా బలరామ్మూర్తి చేసిన ఏర్పాట్లకు , పెళ్ళి నిర్వి ఘ్నంగా సాగినందుకు వినాయక రావు కుటుంబమంతా , బల రామ్మూర్తి కి ధన్యవాదాలర్పించారు. ఒక్క చుక్కనీరు వృధాకానీ కుండా , పదార్ధాలు వ్యర్ధం కానీ కుండా కరెంటు లేని-[ కొత ] గ్రామం లో పెళ్ళి మగ పెళ్ళివారిస్మృ తి లో నిల్చిపోయేలా , నగరంలో పెళ్ళి ఏర్పాట్లకి లక్షలు ఖర్చుకానీకుండా జరిపించినందుకు అంతా ఆనందించారు. బాపేశం మాత్రం అటునుంచి నరుక్కొచ్చిన బలరామ్మూర్తి తెలివి తేటలకు అబ్బుర పడకుండా ఉండలేక పోయాడు.




ఎండలు మండిపోతున్నాయి. సిటీలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోతున్నాయి. కిటికీ గుండా వీచే వేడిగాలులకు చెంపలు మండిపోతున్నాయి. ఏ సీ లు; కూలర్లు చాలడం లేదు. పగలు పదినుంచి సాయంత్రం అయిదు దాకా బయటికెళ్ళడానికి ధైర్యం చాలడం లేదు.వడగాడ్పులు...భానుని భగభగలు...అగ్నిగుండంలాగా సెగలు... వడదెబ్బకు రోజూ పదుల సంఖ్యలో మృతులు. పైన సెగ; కింద సెగ; చుట్టూ వేడిగాడ్పులు...శరీరంలో మంటలు.'రెడీ అయ్యారా? టైమవుతోంది...మీ పల్లెకి పోవడానికి... ఎండ ముదరకముందే బయలుదేరండి. " అరగంటనుంచి తొందర చేస్తోంది మా ఆవిడ. ఎండ తీవ్రతకు తను రానంది.

ఈ వేడికి నాకూ వెళ్ళాలని లేదు కానీ పూర్ణ మరీ మరీ చెప్పాడు. అదీ కాక ఎప్పుడో వదిలేసిన నా పుట్టిన పల్లెను చూడాలని ఉబలాటంగా వుంది. పాత మిత్రుల్నీ కలవవచ్చు. పల్లెను వీడి చాలా కాలమే అయినా; ఇప్పుడు తల్చుకుంటే ఎందుకో " నాపల్లె" అన్న భావన కలుగుతోంది. ఆ భావనే మధురంగా ఉంది. బహుశా ఆ పల్లెలో పుట్టాననే అభిమానమే అందుకు కారణం కావచ్చు."జనని - జన్మభూమి" సెంటిమెంట్ కావచ్చు. అందుకే కాబోలు; మా ఆవిడ రానన్నా, హుషారుగానే బయలుదేరాను. ఈ వేళ మా పల్లెలో "ద్రౌపది కల్యాణం" హరికథ. ప్రతి వేసవిలో మావూరి గుడిలో పద్దెనిమిది రోజులుపాటు "మహాభారతం" హరికథ చెప్పడం పరిపాటి. ఈ కార్యక్రమం చేస్తే వర్షాలు పుష్కలంగా కురిసి; పంటలు బాగా పండుతాయని గ్రామస్థుల నమ్మకం. అందులో ద్రౌపది కల్యాణానికి విశిష్టత వుంది. ఆ కార్యక్రమాన్ని చాలా గొప్పగా చేస్తారు. అంతే కాదు. ద్రౌపదమ్మ ఆ రోజ తమ ప్రత్యేక కోరికలు తీరుస్తుందని భక్తుల నమ్మకం. అందుకే మిగతా రోజులుకంటే ఈ రోజ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

అసలు ఆ పల్లెకు నాకు బంధం తెగిపోయి సుమారు నాలుగు దశాబ్దాలయిపోయాయి. నా చదువులకోసం వున్న పొలం; ఇల్లు-వాకిలి అమ్ముకుని పట్నానికి వచ్చేసి చాలా కాలమయింది. పట్నంలోనే నా చదువులు; ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో

వుద్యోగం... ఆ పల్లెకు వెళ్ళాల్సిన అవసరం లేకపోయింది. ఆ వూరికి వి. ఏ. ఒ. గా వున్న మా నాన్న పోవడంతో ఆ వూరితో బంధం పూర్తిగా తెగిపోయిందనే చెప్పాలి. నేను గత సంవత్సరమే రిటైరయి; పట్నంలోనే సెటిలయిపోయాను.

కాని వున్నట్టుండి నా పాత మిత్రుడు - పూర్ణ నిన్న బజార్లో కనపడి పల్లెలో రేపు " ద్రౌపదికళ్యాణం " హరికథ జరుగుతోందని రమ్మని ఆహ్వానించాడు. పాతమిత్రుల్ని కలవ వచ్చునని; అదీ కాక నేను పుట్టిన పల్లెను ఒకసారి చూడాలనిపించి సరే నన్నాను. బస్ ముందుకు కదుల్తుంటే; నా ఆలోచనలు వెనక్కి వెళ్తున్నాయి. నలభైయేళ్ళ క్రితం పల్లె రూపురేఖలు నా కళ్ళ ముందు కదలాడుతున్నాయి. అప్పటి నాపల్లె...వూరి బయటి ఆ మర్రి చెట్టు; వూరవతల పెద్ద చెరువు; మరో పక్క ఏటిగట్టు; చుట్టూ పచ్చని పొలాలు...మరోపక్క ఎత్తైన గుట్టలు - ఆ మనోహర దృశ్యం ఇప్పటికీ నా కళ్ళ ముందు సజీవంగా నిలబడుతున్నాయి.

ఆ మర్రిచెట్టు నీడలో మేమాడుకున్న ఆటలు; ఊడల్తో వూగిన వుయ్యాలలు; ఎండాకాలంలో ఆ చెట్టు నీడలో సేదదీరిన రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆ చెరువుగట్టున కూర్చొని సూర్యాస్తమయాల్ని చూస్తూ ముచ్చటపడేవాళ్ళం. ఎండాకాలం సెలవులొస్తే మాకు పండగే. ఏట్లో ఈతకొట్టేవాళ్ళం. చేపలు పట్టేవాళ్ళం. పక్కింటి దొడ్లో జామకాయల్ని కొట్టేసేవాళ్ళం. మామిడికాయల్ని దొంగిలించి ఉప్పుకారంతో నంజుకొని తింటూ చెరువుగట్టూ చుట్టూ పచార్లు చేసేవాళ్ళం. దొంగచాటున చెరుకు గడలు ఇంచుకొని; ఎవరికి కనబడకుండా ఏటివారకు వెళ్ళిపోయేవాళ్ళం. వేరుశనిక్కాయల చెట్లను పీక్కుపోయే దొంగతనంగా తినేవాళ్ళం. ఎవరికంటైనా పడితే అందకుండా పరిగెత్తేవాళ్ళం. అదో కాలం. అందమయిన బాల్యం. తీపి గుర్తులు. ఆ రోజులే వేరు. తిరిగిరాని మధురమైన జాపకాలు.

ఊరి మధ్యలో మంచినీళ్ళ బావి వుండేది. ఆ బావి నీళ్ళు కొబ్బరినీళ్ళలా తేటగా; తియ్యగా ఉండేది. ఎంత కరువొచ్చినా ఆ బావి ఎండిపోయేది కాదు.

ప్రతి ఇంట పాడి సమృద్ధిగా ఉండేది. ఇంటికై మిగిలిన పాలను డైరీకి పోసేవారు. అలా ఆదాయాన్ని పెంచుకునేవారు. . ఆ సహకార డైరీ కూడా లాభాల్లో నడిచేది. ఆ సంస్థ పాల ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాలలో మంచి డిమేండ్ ఉండేది. వందమందికి పైగా ఉపాధి ఉండేది. ఇంటికి ఎవరొచ్చినా చెంబుతో చల్లని మజ్జిగ ఇచ్చేవారు.

ఎండాకాలమయితే మజ్జిగ, అంబలి చలివేంద్రాలు ఏర్పాటయ్యేవి. ఒక్కొక్కసారి ఆ అంబలి తాగేసి బావుల్లోనో; ఏట్లోనో; చెరువులోనో ఈతకొట్టేవాళ్ళం. ఎంతసేపు కొట్టినా తనివి తీరేది కాదు.ఎండకు చల్లని నీళ్ళల్లో భలే మజాగా వుండేది. కనుచూపుమేరలో కొబ్బరి, టేకు, అరటి, తాటి, చెరకు, మామిడి తోటలతో పచ్చ పచ్చగా ఎంతో కనువిందుగా ఉండేది. ఎప్పుడూ ఊరంతా ఏవో పంటలతో కళకళలాడుతూ ఉండేది. వ్యవసాయ పనుల్లో; పశువులతో అందరూ బిజి బిజీగా వుండేవారు.

కులవృత్తులవారికి చేతినిండా పని వుండేది. అందరూ పగలంతా కష్టపడి; రాత్రంతా కంటినిండా నిద్రపోయి ఆరోగ్యంగా ఉండేవారు.

అలాంటి సుభిక్షమైన నా పల్లె ఇప్పుడెలా ఉందో...? ఈ లిబరలైజేషన్; గ్లోబలైజేషన్ తర్వాత రూపురేఖలు ఎలా మారిపోయాయో? చూడాలి- అనుకుంటూ నా మనసంతా ఆందోళనగా ఉంది. ఊరు దగ్గర పడింది. నాలో కూడా టెన్షన్ మొదలయింది. అదిగో...సహకార డైరీ...ఏదీ? అప్పట్లో సహకార రంగంలో స్థాపించి ఆది నుంచి లాభాల బాటలో నడిచి జిల్లాకే తలమానికమైన ఆ "డైరీ" ఏదీ? మొండి గోడలు; తుప్పుపట్టిన వాహనాలు; విరిగిపోయి గాలికి వూగుతున్న బోర్డ్... దర్శనమిస్తున్నాయి అక్కడ.

"డైరీకి ఏమయింది?" ఆతృత నణుచుకోలేక పక్కాయన్నడిగాను.

"ఇంకా ఏం డైరీ. ఎప్పుడో మూతపడింది" అన్నాడతను. ఆశ్చర్యపోయాను. నేనాశ్చర్యం నుంచి తేరుకోకముందే వూర్లో బస్సాగింది.

"అరె! ఇక్కడ పెద్ద మర్రిచెట్టుండాలే." బస్ దిగి చుట్టూ పరికిస్తూ అడిగాను. .

"మర్రిచెట్టా...? ఎప్పటి మాట... రోడ్ వెడల్పు చేసేటప్పుడు అడ్డమని కొట్టేసి చాలా కాలమయింది. " అన్నారెవరో.

మళ్ళీ షాక్కు గురయ్యాను. ఎంత విశాలమైన చెట్టు. ఎంత నీడనిచ్చేది. ఎంత గాలినిచ్చేది. మనసు బరువెక్కింది. ఎండ తీవ్రంగా ఉంది. సూర్యుడు పగబట్టినట్లు నిప్పులు చెరుగుతున్నాడు. నోరెండిపోతోంది. ఇంతలో "బానూ! బాగున్నావా?" భుజంపైన చేయి వేశాడు పూర్ణ.

"బాగున్నాను రా" అన్నాను చేయి కలుపుతూ.

"రావనుకున్నాను. వచ్చావు. సంతోషం. రా. ఇంటికి పోదాం." అంటూ ముందుకు కదిలాడు. నేనూ అనుసరించాను. ఫర్వాలేదు. వూరు బాగా డెవలప్ అయినట్లుంది. కరెంట్ వచ్చింది. రెండంతస్తుల బిల్డింగ్స్ బాగా పెరిగాయి. షాపులు; హోటెల్స్ పెద్దవయ్యాయి. రోడ్లు వెడల్పయ్యాయి. ఆటోలు పడ్డాయి. టూ వీలర్స్ బాగా పెరిగాయి. కార్లూ కనిపించాయి. ప్రతి చేతిలో సెల్

ఫోన్లు; ప్రతి ఇంట టీ వీ లు, ఇంటర్నెట్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్స్ వున్నాయి. రెండు;మూడు ఫ్యాక్టరీలు పడ్డాయి. నా పల్లె ఎంతో అభివృద్ధి అయింది. మాటల్లోనే పూర్ణ ఇంటికి చేరుకున్నాం. ఫ్యాన్లు తిరుగుతున్నా చెమటలు పడుతున్నాయి. గాలి పూర్తిగా స్థంభించిపోయింది. ఉక్కపోతలోనే చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ భోజనం కానిచ్చాం.

భోంచేసి "ఎండ విపరీతంగా ఉంది. కొంతసేపు రెస్ట్ తీసుకో. నేనలా పౌల్ట్రీ ఫార్మ్ దాకా పోయివస్తాను" అన్నాడు పూర్ణ. వాడికి పౌల్ట్రీ ఫార్మ్ ఉంది.

" ఊర్ని చూడాలి. నేనూ వస్తాన్ రా?" అన్నాను. ఎండ తీవ్రంగా ఉన్నా ఉబలాటం కొద్దీ బయలుదేరాను.

అక్కడక్కడా కొంతమంది ముసలివారు విసనకర్రలతో విసురుకుంటూ ఇళ్ళ ముందు అరుగులమీద ఉసూరుమంటున్నారు. ఊరి మధ్యకి వచ్చేసరికి బావి విషయం అడిగాను. అది ఎండిపోతే పూడ్చేశామన్నాడు. ఊరుదాటి మా ప్రయాణం సాగే కొద్దీ నాకు షాకుల మీద షాకులు. కనుచూపు మేరలో పచ్చదనం అనే మాటే లేదు. అంతా బీళ్ళు. బీటలు వారిన బీళ్ళు. నీటికోసం నోళ్ళు తెరుచుకున్నట్లు బీటలు. చెట్లు లేవు. పంటలు లేవు. ఎడారిలా ఉంది. బోర్లు ఎండిపోయాయి. బావులు పూడిపోయాయి. చెరువు బీటలు వారింది. పూర్తిగా పూడిపోయింది. దాన్లో అక్కడక్కడా కొన్ని గుడిసెలు లేచాయి. ఎవరెవరో ఆక్రమించేసి కంచెలు వేసేసుకున్నారు.కొండ కరిగి నేలమట్టమై పోయింది. అక్కడ ఒక కెమికల్ ఫ్యాక్టరీ వుంది. దాని వ్యర్థాలతో ఏరు నిండిపోయింది. ఎక్కడా నీటి చుక్క లేదు. బావులు, చెరువులు, దొరువులు, ఏర్లు ఎండి బీటలు వారిపోయాయి. సాగుకు కాదు కదా... కనీసం గొంతు తడుపుకోవడానికి కూడా నీళ్ళు దొరకడం లేదు. పది పదిహేను కిలోమీటర్లనుంచి ట్యాంకర్ల ద్వారా రెండురోజుల కొకసారి నీళ్ళు సప్లయి చేస్తున్నారు పంచాయతీవారు.

"నో ...ఇది నేను చూసిన నా పల్లె కాదు. కానే కాదు." గొంతు చించుకుని అరవాలనిపించింది.

కానీ వాస్తవం. కళ్ళముందు కఠినంగా కనిపిస్తుంటే ... నా కళ్ళను నేనే నమ్మలేక నిలువ గుడ్లేసుకొని చూస్తుండిపోయాను. ఎండ తీవ్రతకు; వేడిగాడ్పులకు చెమటతో నా బట్టలు తడిసి ముద్దయిపోయాయి. కానీ ఆ బాధ కన్నా కళ్ళ ముందున్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను.

అంతలోనే పూర్ణ కోళ్ళ ఫార్మ్ చేరుకున్నాం. షెడ్ బయట కొన్ని వందల సంఖ్యలో చచ్చిన కోళ్ళు పడివున్నాయి. షెడ్ లో కూలర్లు ఏర్పాటు చేసినట్లుంది కానీ ఈ ఉష్ణోగ్రతలకు తట్టుకోలేక కోళ్ళు మృత్యువాత పడుతున్నాయి. కడుపు తరుక్కుపోతోంది. నాకే అంత బాధగా ఉంటే; వాడికెలా ఉండాలి. అలా పరిశీలిస్తూ తలపట్టుకుని కూర్చుండిపోయాడు.

మెల్లగా తేరుకుని ఇలా అన్నాడు.

"చూస్తున్నావుగా! ఈ తాపానికి వందలకొద్దీ కోళ్ళు చనిపోతున్నాయి. నా పెట్టుబడి అంతా సర్వ నాశనం అయిపోయింది. నేనొక్కడినే ఇక్కడ ప్రాకులాడుతున్నాను. మన ఫ్రెండ్స్ అంతా బెంగుళూరు, చెన్నై లలో సెటిలయిపోయారు. రవి బెంగుళూరులో బిజినెస్ చేస్తున్నాడు. రాము అక్కడే సాఫ్ట్ వేర్ ఇంజనీర్. సుబ్బు చెన్నైలో సెటిలయిపోయాడు. యువతంతా బతుకుతెరువు కోసం వలస వెళ్ళిపోయారు. ముసలి;ముతక మాత్రమే ఇళ్ళల్లో ఉన్నారు. ఫ్యాక్టరీలలో అరకొర జీతాలిచ్చి; కార్మికుల జీవితాల్తో ఆడుకుంటున్నారు. విధిలేక చేస్తున్నవారు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యం; ఆ క్వారీ ధూళి వల్ల గాలి; నీరు కలుషితమయిపోయాయి. ఆరోగ్యాలకు కూడా హానికరంగా ఉంది. ఈ వాతావరణం కోళ్ళకు కూడా అయ్యేట్లుగా లేదు. ఈ వేడికి రోజూ వందలకొద్దీ కోళ్ళు చనిపోతున్నాయి. ఈ నష్టాలు భరించలేకపోతున్నాను. బ్రతకడానికి వేరే మార్గం లేక; భారంగా నెట్టుకొస్తున్నాను. ." అన్నాడు పూర్ణ నిస్సహాయంగా.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నా పల్లె కన్నీటి గాథను విని నేను తట్టుకోలేక పోతున్నాను.

నా పల్లెకి విశాలమయిన రోడ్లొచ్చాయి. ఫ్యాక్టరీలొచ్చాయి. బస్సులొచ్చాయి. కార్లొచ్చాయి. సెల్ ఫోన్లొచ్చాయి. టీ వీ లొచ్చాయి. ఇంటర్నెట్లొచ్చాయి. అన్నీ వచ్చాయి. అభివృద్ధి అంటే ఇదేనా? అయితే జనం ఏరీ? ఈ అభివృద్ధి జనం కోసమే అయితే జనం వలసలు ఎందుకు పోతున్నారు? ఇంకేం కావాలి వారికి?

కడుపుకింత కలుషితంలేని సురక్షితమైన కూడు; చేతినిండా పని; పనికి తగిన కూలి; తలపై ఇంత గూడు. ఆరోగ్యవంతమైన జీవితం, స్వచ్ఛమైన నీరు; గాలి. సామాన్య మానవుడికి ఇదికూడా అత్యాశే అవుతుందా?

ఆలోచిస్తూ గుడిలోకొచ్చాం. అప్పటికే చాలా మంది వచ్చేశారు. పాత మిత్రుల్ని ఒక్కొక్కర్నే పరిచయం చేశాడు పూర్ణ. ముఖ కవళికల్ని బట్టి కొంతమందిని నేనే గుర్తుపట్టగలిగాను. కొంతమంది వారే గుర్తుపట్టి పలకరించారు. వారి సంతానం పెద్దవారైపోయి ఉద్యోగాల్లో ఎక్కడెక్కడో సెటిలయిన వారు కూడా వచ్చారు. తండ్రి; తాతలు పుట్టిన వూరిని మర్చిపోకుండా సంవత్సరానికి ఒకసారి ఇలా కార్యక్రమాన్ని తలకెత్తుకుని చేయడం నాకెంతో నచ్చింది. అంతా పండగ వాతావరణంగా ఉంది. తిరనాళ్ళా ఉంది. ఊరంతా ఒకచోట చేరి కుటుంబ సభ్యులతో పండుగ చేసుకున్నంత సంబరంగా ఉంది. సంవత్సరమంతా పనిచేసి ఆటవిడుపుకు వచ్చినట్లుంది. పెద్ద ఉద్యోగాల్లో వున్న వారు సైతం హోదాలు మరిచి పల్లెటూరి వాతావరణంలో ఎంజాయ్ చేయడం; త్రుళ్ళుతూ హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ కాలం గడపడం నాకెంతో నచ్చింది. ఆ యువతలో చాలా మంది నాకు తెలియదు. కాని ఒక కామన్ ఫ్యాక్టర్ - ఆ పల్లెతో వారి తాత; తండ్రుల అనుబంధం- ఒక్కటే మమ్మల్ని కలిపింది. చాలా మంది యువతకి ఆ పల్లెతో ప్రత్యక్ష సంబంధమే లేదు. అయినా వేల లెక్కన చందాలు వేసుకుని ప్రతి సంవత్సరం కార్యక్రమాన్ని

నిర్వహిస్తున్నారు.

ఎవర్ని పలకరించినా " మా తలిదండ్రులు; తాతలు ఈ ఊర్ని వదిలి దశాబ్దాలయినా ఇది మా ఊరు. దాని కోసం ఖర్చుపెట్టడంలో మాకానందం వుంది. మా కోసం ఖర్చు పెడుతున్నాం. మా వారి కోసం ఖర్చు పెడుతున్నాం. మా ఊరి కోసం ఖర్చుపెడుతున్నాం. ఇందులో మాకానందం ఉంది." అంటున్నారు.

"ఈ ద్రౌపదమ్మ తల్లి దయవల్లే మేమింత వారమయ్యాం. మా కోరికలన్నీ ఆమె తీరుస్తుంది." అన్నారు మరికొంతమంది. ఆ యువతలో చాలామంది వారికి వారే పరిచయం చేసుకొని నాతో మాటలు కలిపి నిమిషాల్లోనే ఆత్మీయంగా కలిసిపోయారు. "మన ఊరు" అన్న బావమే అందర్నీ దగ్గరికి చేర్చింది. ప్రదీప్, అవినాష్, ప్రతాప్, కన్నయ్య, రాజగోపాల్ ఇలా అందరి ఉత్సాహం చూస్తుంటే నాకూ ఉత్సాహం రెట్టింపయింది.

చుట్టుపక్కల పల్లెల జనం కూడా బాగా పోగయ్యారు. ఇంతలో హరికథ మొదలయింది. అంతా శ్రద్ధగా వింటున్నారు.; చక్కని అభినయంతో శ్రావ్యమయిన కంఠంతో అప్పుడప్పుడు సినిమా హిట్ సాంగ్స్ తో ఉత్సాహపరుస్తోంది భాగవతారిణి. జనమంతా భయభక్తులతో హరికథను ఆలకిస్తున్నారు. మహాభారతంలో ద్రౌపది స్వయంవరం ఒక రసవత్తరమయిన ఘట్టం. జనం ఎంత భయభక్తులతో; ఏకాగ్రతతో వింటున్నారంటే; ఉక్కపోతతో శరీరాలు తడిసి ముద్దవుతున్నా ఎవరూ పట్టించునే ధ్యాసే లేదు.

అంతగా కథలో లీనమైపోయారు.

ఇంతలో వాతావరణంలో పెనుమార్పు చోటు చేసుకుంది. ఆకాశం మేఘావృతమయి జల్లులతో ప్రారంభమయి హోరున ఏకధాటిగా అరగంట వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జనంలో ఆనందం పెల్లుబికింది. విపరీతమయిన భక్తి పారవశ్యంతో భక్తులు చిందులు వేశారు. వైభవోపేతంగా ద్రౌపది కల్యాణం కథ పూర్తయిపోయేంతవరకు జనం శ్రద్ధాశక్తులతో విన్నారు. వర్షం లో తడిసినా ఎవరూ కట్టుకదలలేదు. చివరికి కార్యక్రమం చాలా విజయవంతంగా ముగిసింది. జనం తీర్థ ప్రసాదాలు తీసుకుని తిరుగుప్రయాణమయ్యారు.

"ప్రసాదం తీసుకోండి అంకుల్" అని ప్రసాద్ తెచ్చి ఇచ్చాడు. తనూ తీసుకుంటూ పక్కనే కూర్చున్నాడు.

"చూడండి అంకుల్ అమ్మవారి మహత్యం.     పెళ్ళి సమయానికి మంచి వర్షం పడింది." అంటూ వచ్చాడు ప్రతాప్.

"అమ్మవారి పెళ్ళిరోజు ప్రతిసారి వర్షం పడాల్సిందే. అదీ ఆమె గొప్పతనం" పూర్ణ అన్నాడు.

"అరగంట వర్షం వాతావరణం లో ఎంత మార్పు తెచ్చిందో చూశారా?" అన్నాడు ప్రదీప్.

ఒక్కొక్కరుగా అందరూ మా చుట్టూ చేరారు.

"గంటక్రితం ఎంత ఎండగా వుందో; ఇప్పుడు అంత చల్లబడింది. శరీరానికి ఎంతో హాయిగా ఉందిప్పుడు" మాట కలిపాడు అవినాష్.

"అవినాష్! ఈ వైరుధ్యానికి తేడా ఏమిటంటావు?" అడిగాను     కుతూహలంగా.

"వర్షం పడిందిగా ...అందుకే!" అన్నాడు అవినాష్.

"అంటే సూర్యుని ప్రతాపానికి కారణం వర్షాలు లేకపోవడమేనా?"

"కారణాలేవయినా...వర్షం దానికి విరుగుడని ఋజువయిందిగా!" అన్నాడు ప్రతాప్.

"ఈ విపరీత వైపరీత్యాలకు ముఖ్య కారణం మనమే అంకుల్" అన్నాడు ప్రదీప్.

అందరూ ప్రదీప్ వైపు చూశారు.

ప్రదీప్ కొనసాగిస్తూ " నానాటికి భూతాపం పెరిగిపోతోంది. అంటే భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీరే ప్రాణికోటికి జీవనాధారం. దానిపై మనం కానీ; మన ప్రభుత్వాలు కానీ తగిన శ్రద్ధ చూపడం లేదు."

"అంటే వివరంగా చెప్పు ప్రదీప్!" అన్నాను.

అందరూ శ్రద్ధగా ప్రదీప్ వైపు చూశారు.

"పర్యావరణంలో భారీ మార్పులకు ముఖ్య కారణం - భూతాపం విపరీతంగా పెరిగిపోవడం. భూతాపం పెరిగిపోవడానికి కారణం తగినంత వర్షాలు లేకపోవడం. తగినంతగా వర్షాలు లేకపోవడానికి కారణం మనం నిత్యం చెట్లని; అడవుల్ని నాశనం చేయడం. అంకుల్! మీకొకటి చెప్పనా?" ఆగాడు ప్రదీప్.

అందరూ శ్రద్ధగా వింటున్నారు. ప్రదీప్ మళ్ళీ మొదలెట్టాడు.

"ఒక సర్వే ప్రకారం ...చెట్ల; మనిషి నిష్పత్తి ప్రపంచంలోనే ఇండియాదే లీస్ట్. అంటే కెనడాలో ఒక మనిషికి 8953 చెట్లుంటే; రష్యాలో అది 4461; అమెరికాలో 716, చైనాలో 102, ఇండియాలో 28. ప్రపంచ సరాసరి తీసుకుంటే అది 422. "

"అంటే మనం యావరేజ్ కన్నా చాలా తక్కువలో ఉన్నామా?." అవినాష్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"దానికీ...దీనికీ సంబంధమేమిటి?" పూర్ణ సందేహం వెలిబుచ్చాడు.

"చాలా వుంది. మనం చెట్లే కదా అనుకుంటాం. కానీ చెట్లు వాతావరణ సమతుల్యతకు దోహదపడుతాయి. తత్ ద్వారా మానవ మనుగడకు తోడ్పడుతున్నాయి. వర్షాలనిస్తాయి. మనం విడిచే కార్బన్ డై ఆక్సైడ్ గ్రహించి మనకు కావాల్సిన ఆక్సిజన్ ఇస్తాయి. చల్లని నీడనిస్తాయి. భూసారాన్ని పరిరక్షిస్తాయి. భూతాపాన్ని తగ్గిస్తాయి. "

"ఓ! ఇన్ని ఉపయోగాలున్నాయా?"

"అవును. మానవాళికి ఇంతగా ఉపయోగపడే చెట్లను మనమేం చేస్తున్నాం? అడ్డొస్తుందని నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నాం. అడవుల్ని నాశనం చేస్తున్నాం. ఫలితంగా వర్షాలు తగ్గిపోతున్నాయి. భూమిలో తేమ తగ్గిపోతోంది. వాతావరణంలో గాలి పరిమాణం తగ్గిపోతోంది. గాలిలో కార్బన్ డై ఆక్షైడ్ పెరిగిపోతోంది. మరోవైపు జనాభా పెరుగుతోంది. ఫలితంగా లభ్యమవుతున్న నీరు; గాలి పైన ఒత్తిడి పెరిగి కలుషితమైపోతున్నాయి. కాలుష్యం రోజు; రోజుకీ పెరిగి వాతావరణం అస్తవ్యస్తమవుతోంది. ఫలితమే ఈ భరింపరాని ఉష్ణోగ్రతలు; అకాల వర్షాలు; భూకంపాలు; జలప్రళయాలు. " ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు ప్రదీప్.

"ఫైన్. చాలా బాగా చెప్పావు. అయితే దీనికి పరిష్కారం లేదా?" అన్నాను.

"ఎందుకు లేదంకుల్. వుంది. ఇప్పటికైనా మనం మేలుకోకపోతే వచ్చే తరం మనల్ని క్షమించదు. అభివృద్ధి పేరుతో మనం చేస్తున్న విధ్వంసాన్ని ఆపాలి. పర్యావరణాన్ని రక్షించాలి. నీటిని ఒడిసిపట్టాలి. చెరువుల్ని; బావుల్ని నింపాలి. జలసిరిని పెంచుకోవాలి. చెట్లను నాటడం; సం రక్షించడం ఒక ఉద్యమంగా చేపట్టాలి. పచ్చదనం పెంచాలి. వర్షాల్ని ఆకర్షించాలి. భూతాపాన్ని తగ్గించాలి. అప్పుడే సూర్యుని ప్రతాపం తగ్గుతుంది. వాతావరణంలో సమతుల్యత ఏర్పడి స్వచ్ఛమయిన నీరు; గాలి అందుబాటులోకి వస్తుంది. అన్నిటికీ ఏకైక మార్గం పర్యావరణాన్ని రక్షించడమే. అది ఒక ఉద్యమంగా సాగాలి. నిరంతరం సాగాలి. అందుకు మనమే ముందడుగు వేయాలి." అన్నాడు ప్రదీప్ ధృడంగా.

ఈ తరం యువతరానికి ప్రతీకలా కనిపించాడు ప్రదీప్. అందరూ తేరుకొని "అయితే మనమేం చేయాలి?" అన్నారు ముక్తకంఠంతో.

"నీటిని పొదుపు చేయాలి. ఎక్కడి నీటిని అక్కడే ఒడిసిపట్టాలి. చెరువుల్ని పూడికతీసి వాటి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. ఎక్కడికక్కడ ఇంకుడు గుంతల్ని ఏర్పాటు చేసుకోవాలి. చెక్ డ్యాంలను నిర్మించాలి. వర్షపు నీరు వృధా కాకుండా ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకిపోయే ఏర్పాట్లు చేసుకోవాలి. భూగర్భ నీటి మట్టం పెరగాలి. భూతాపం చల్లారాలి. దీనితో పాటు చెట్ల పెంపకం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. చెట్లు నాటటమే కాదు ...వాటి సం రక్షణ కూడా చేపట్టాలి. అడవుల విస్తీర్ణం పెంచాలి. ప్రచారం కోసమో; టీ వీ ల్లో ఫోటోల కోసమో కాకుండా చిత్తశుద్ధితో ఒక ఉద్యమంగా సాగాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. పరిమితమైన ప్రకృతి వనరుల్ని పొదుపుగా వాడుకొని; సం రక్షించి ముందు తరాలకి అందించాలి. అప్పుడే వచ్చే తరాలవారికి మేలు చేసిన వారమవుతాం." ముగించాడు ప్రదీప్.

"అయితే మనం మన వూరిలోనే ప్రారంభిద్దాం." అన్నాడు ప్రతాప్.

"పూర్ణ గారూ! మీకు కావల్సిన సహాయ సహకారాలు మేమందిస్తాం. మీరు ముందుండి నడిపించండి. అవసరమయితే ప్రభుత్వ అధికారుల సహాయం తీసుకోండి. మన సాయాన్ని ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేయండి.    మన వూరి కోసం కలిసి పనిచేద్దాం. " అన్నాడు అవినాష్.

“మీరూ తోడుగా ఉండండి భానుగారూ!" అన్నాడు ప్రదీప్. చేతనైన సహాయం చేయడానికి; ఆ విధంగానైనా పుట్టిన వూరు ఋణం తీర్చుకోవడానికి    నేనూ ముందడుగు వేశాను.

"ఇప్పుడే ద్రౌపది కల్యాణమయింది. ఇదే సుముహూర్తం. ఇక లోక కల్యాణం కోసం మనమే మొదటి అడుగేద్దాం." అంటూ పూర్ణ చేయి కలిపాడు.

ఇప్పుడు వాతావరణం ఎంతో    చల్లగా, హాయిగా, ఆనందంగా,    ఆహ్లాదకరంగా ఉంది.

యువతలో చైతన్యం వచ్చింది.    వారికి అసాధ్యమేదైనా ఉంటుందా? కోరుకున్న మార్పు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది.*



నా పేరు కాలువ కుంట... నేను ఉండేది నగరానికి ఒక 150-200 కి మి దూరంలో కాలువరాళ్ళ అనే గ్రామం సరిహద్దులో, అసలు నా వల్లే ఆ గ్రామనికి కాలువ రాళ్ళ అని పేరు వచ్చిందని అంటారు. నా వయసు ఎంతో నాకు సరిగ్గ తెలియదు కాని నేను ఆ ఊరి సంస్థానం రాజా వారిని, తెల్ల దొరలను చూసినట్టు గుర్తు .. అంటే ఒక 200-300 ఏళ్ళ నుండి నా ఉనికి ఉందన్నమాట. నన్ను ఆ చుట్టుపక్కల గ్రామ ప్రజలంతా చిన్న చెరువు అని కూడ అంటారు ఎందుకంటే నా ప్రయాణం ఒక చిన్న పిల్ల కాలువలాగ మొదలై మంచి వర్షాలు పడి కాల క్రమేణ ఒక చెరువు లాగ రూపాంతరం చెంది ఒక పది పదిహేను గ్రామలను కలుపుకుంటు పోయి కృష్ణా నది లో ముగుస్తుండేది. నాలో పుష్కలంగ జలసిరి ఉండటం వల్ల నేను పారిన గ్రామాల పంట పొలాలు ఎప్పుడూ పచ్చగా ఉండేవి.

ఆయా గ్రామాల ప్రజలు ధన ధాన్యాలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో విలసిల్లుతూ ఉండేవారు...ఎవరైనా వయసు అయ్యి కాల ధర్మం చెందేవారే తప్ప ఎటువంటి శారీరిక ఇబ్బందులతో, రోగాలతో ఉండేవారు చాల తక్కువ. ఆ ఊళ్ళన్నింటికి ఒక్క ఆసుపత్రి కూడ ఉండేదికాదంటే అర్థం చేసుకోవచ్చు..దాదాపు ప్రతి ఇంట్లో సమ్రుద్ధి గా పాడి ఉండేది. నాకు ప్రత్యేకించి కాలువ రాళ్ళ అంటే ఎక్కువ అభిమానం ఎందుకంటే నా ప్రయాణం మొదలైంది అక్కడినుండే...ఆ ఊరు పచ్చని చెట్ల తో,చిన్న చిన్న వాగులతో, సెలయేళ్ళతో, రక రకాల పక్షులకు నివాస యోగ్యమై ఉండేది.ఎండా కాలం వచ్చిందంటే పిల్లలు, పెద్దలు అందరు నాలో ఈతలు కొట్టి, సంతోషంగా వాళ్ళ ఇండ్లల్లకి వెళ్ళే వారు. వర్షాలు పడకున్నా నేను మాత్రం ఎప్పుడూ ఎండి పోయే దాన్ని కాదు..కరువు అనే మాట కాలువ రాళ్ళ ప్రజలకి తెలియదు...ఇలా కొన్ని ఏళ్ళు గడిచినాయి..మనుషుల తో పాటు కాలం లో కూడ మార్పు గమనించ సాగినాను.అభివృధి పేరుతో ఆ గ్రామనికి దగ్గరలో ఒక ఫాక్టరి వెలిసింది..దాని కోసం లెక్క లేనన్ని చెట్లని కొట్టేసి, వాగులని పూడ్చి వారికి తగ్గట్టుగా మార్గం చేసుకున్నారు..

ఆ గ్రామ ప్రజలు కూడ ఆ అభివృద్ధి మాయ లో పడి వారి భూములని కూడ ఆ ఫాక్టరి వారికి అమ్ముకోవటమే కాకుండా వారు, వారి పిల్లలు అక్కడే పనికి కుదిరి నెల జీతానికి అలవాటు పడి చేతి వృత్తులని వ్యవసాయాన్ని పక్కన పెట్టినారు..కొన్నాళ్ళకి ఆ ఫాక్టరి నుండి వచ్చే వ్యర్ధాలు సెలయేళ్ళలో కలిసి కలుషితం అయినాయి..పొగ ఆ చుట్టుపక్కన ఉన్న వాతావరణాన్ని పాడు చేసింది..అక్కడికి ఇప్పుడు పక్షులు రావటం లేదు, చెట్లు ఎండి పోసాగాయి..సెలయేళ్ళలో ఇప్పుడు నీటి చుక్క లేదు.. ఆ వ్యర్ధాలు నాలో కూడా కలిసి నన్ను కూడా కలుషితం చేయ సాగాయి..నాలో ప్రవహిస్తున్న నీటిని తాగి పశువుల పాడి తగ్గి పోయింది, ఆ ప్రజలకి కొత్త రోగాలు , జ్వరాలు పీడించ సాగాయి..

ఇప్పుడు అక్కడికి దగ్గరలో ఒక ఆసుపత్రి కూడ వెలిసింది. ఒక్కొక్క ఏడు వర్ష పాతం తగ్గి పోయి మెల్లి మెల్లిగా నాలో కూడా జల తగ్గి పోయింది...ఇప్పుడు నాతో పాటు కాలువ రాళ్ళ గ్రామం కూడా కళ తప్పింది..నాలో కాలువ పోయి కుంట మిగిలింది..కాలువ రాళ్ళ లో పచ్చదనం ధన ధాన్యాలు అన్ని పోయి రాళ్ళు బయట పడ్డాయి..వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు..కాని వారికి ఏం తెలుసు విధ్వంసం ఎంత తొందరగా చెయ్యొచ్చొ సృష్టించటం అంతకు వంద రెట్లు కష్టమని...ఆ గ్రామ ప్రజలకి ఇప్పుడు అర్థం అయ్యింది వారు ఏం పోగొట్టుకున్నారో.... మెల్లిగా అందరూ కలిసి కట్టు గా నడుం బిగించి నాలో మళ్ళి జీవం పోయటానికి పూడికలు తీస్తున్నారు.ఫాక్టరి వారితో అందరూ ఏకమై మాట్లాడి, దగ్గర లోని టౌన్ కి మార్చుకున్నారు.అక్కడ మళ్ళి మొక్కలు నాటుకున్నారు...ఎవరి వృత్తులు వారు చేసుకుంటున్నారు..నేను పూర్వం లా

పొరటానికి, ఆ గ్రామం లోని సెలయేళ్ళు, వాగులు, పచ్చిక, చెట్లు ఇవన్నీ పూర్వ రూపానికి రావటానికి కొంత సమయం పట్టొచ్చు , కాని నాకు నమ్మకం ఉంది ఎందుకంటే అందరి ధృడ చిత్తం తో ఒక నాంది పడింది..ఈ ఐకమత్యం అందరి లో వచ్చి అన్ని గ్రామాలు ఇలానే ముందడుగు వేస్తే ప్రతి గ్రామం సస్య శ్యామలం అవుతుంది..

ఫలితంగా ఈ దేశం రైతు భారతం గా మారటానికి ఎక్కువ కాలం పట్టదని ఆశిస్తూ....

మీ కాలువ కుంట